THE CHINTAMANI.

CONTENTS OF THE SECOND VOLUME

విషయసూచిక.

THE CHINTAMANI.

CONTENTS OF THE SEVENTH VOLUME

వి ష య సూ చి క.

శ్రీ

చి ం తా మ ణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

రాజమహేంద్రవరము

సంపుటము ౨] నందనసంవత్సర ఆషాఢమాసము (31-7-92) [సంచిక ౧

ప్ర క ట న.

ఈ చింతామణిని ప్రకటించుటలో దేశాభివృద్ధియు భాషాభివృద్ధియు మా ముఖ్యోద్దేశములు. ప్రకృతిశాస్త్రములు, చరిత్రములు, నీతిబోధకములైన చిత్ర కథలు, దేశాచార వ్యవహారాదులను దెలుపు వినోదకరములైన నవీనప్రబంధములు, సంస్కృతమునుండిగాని యింగ్లీషునుండిగాని తెనిఁగింపఁబడిన మంచినాటకములు, దేశాభివృద్ధి కుపయుక్తములైన యుపన్యాసములు, ఆరోగ్యధర్మాదులను బోధించు పుస్తకములు, గొప్పవారియొక్క జీవచరిత్రములు, నీతిని జ్ఞానమును కలిగించెడి యితరవిషయములు; ఇందుఁ బ్రకటింపఁబడును. ఈవిషయములనుగూర్చి వ్రాయువారు సులభశైలిని కాగితముయొక్క యొక్క ప్రక్కనుమాత్రమే వ్రాసి మాకుఁ బంపవలయును. గ్రంథమును పూర్ణముగా వ్రాయకముందుఁ గొంచెముభాగమును మాత్రమే వ్రాసిపంపినయెడల మేమిందుఁ బ్రచురింపఁజాలము. గ్రంథముయొక్క గుణదోషముల నెఱుఁగుటకయి మేము గ్రంథమునంతను ముందుగాఁ జూడవలెను. ఇప్పటివారు వ్రాసెడు శృంగార ప్రబంధములనుగాని శృంగార పద్యములనుగాని పంపనక్కఱలేదు మేమిందుఁ బూర్వకవులు రచించిన ముద్రితములుకాని మంచి పుస్తకములనుగూడఁ బ్రచురించుచుందుముగాన, తమయొద్ద నట్టి గ్రంథములున్నవారు మాకాగ్రంథములను బంపుదురని కోరుచున్నాము.

ఆంధ్రభాషాభివర్ధనీసమాజము.

ప్రెసిడెన్సీ కాలేజిలోని ఆంధ్రభాషాభివర్ధని సమాజముయొక్క ద్వితీయ
ంవత్సరోత్సవ ప్రకటన పుస్తకము మాకందినది ఈసభలో ముఖ్యముగా విద్యా
చేరియున్నను, వీరుచేయుపని శ్లాఘనీయముగా నున్నది గతసంవత్సరమున
న్యుల్లుగారి కుమారుఁడయిన నారాయణరావు B A గారు ఆంగ్లేయ
రచియింపఁబడిన రెండు చిన్నకావ్యములను కా
నామములతో పద్యరూపమున తెనిఁగించిరి.

పానుగరిటి పార్థసారథినాయనింగారు గోల్డుస్మిత్తు హెర్మిట్టును తెనిఁగించిరి. మఱి కొందఱు ఆరోగ్యము, స్నేహము, ఐకమత్యము, మొదలైన యంశములమీఁద ఉపన్యాసములిచ్చిరి. ఇవియన్నియు ముద్రింపఁబడినచో జనోపయుక్తములుగా నుండును. ఈసభవారు గ్రంథభాండారమును స్థాపింపవలయునని కొంతధనముచేర్చి యాకార్యమును కొంతవఱకు నిర్వహించినారని వినుచున్నాము. అన్నిపట్టణములయందు నిట్టిపుస్తకభాండారము లేర్పడినచో, ఆంధ్రభాషాభివృద్ధియగును.

పతివ్రతాధర్మములు.

పాతివ్రత్య ధర్మములనుగూర్చి వాత్స్యాయనుఁ డీక్రిందఁ జెప్పినరీతిని వ్రాసినాఁడు. ఆతఁడు ఇప్పటికి రెండువేల సంవత్సరములకు క్రిందటివాఁడనఁగా క్రీస్తుశకమునకు పూర్వపువాఁడయినట్లు కానిపించుచున్నది.

తనభర్త కేకపత్నియయిన కాంత యాతని నమ్మకమును సంపాదించి దైవముంబోలె నాతనిం బూజింపఁదగును.

ఆతఁడంగీకరించెనేని గృహకృత్యభార మంతయు నామెయే వహింపఁదగును.

ఇంటిని చక్కఁగా కడిగి, తుడిచి, పరిశుద్ధముగానుంచి, దానియందంతటను, పూవుల నలంకరించఁదగును. నట్టింటిని నున్నగా నుంచఁదగును. ఇంటి దేవరపట్టును ఉదయమధ్యాహ్న సాయంకాలములందు కడిగి, దేవతార్చనమునకు అవసరమైన పూజలఁ జేయఁదగును. ఇదియే పురుషునకు హృద్యమయిన కార్యము.

తన భర్తయొక్క తల్లిదండ్రులను, అతనియింటి సేవకులను, అతనిసోదరీలను వారల భర్తలను నర్హ్మగౌరవముచే సంభావింపఁదగును.

భిక్షువులు, శ్రమణలు, క్షపణలు అను మూఁడుజాతుల యోగినీస్త్రీలతోఁగాని, జాతి బహిష్కృతలయిన స్త్రీలతోఁగాని, సాముద్రికము, జ్యోతిషము లేక ఎఱుక చెప్పు స్త్రీలతోఁగాని, ఓషధులతో గారడీచేయు స్త్రీలతోఁగాని యామె సంభాషింపఁ దగదు.

యోగినులు, సాధారణముగా, జారత్వ సంఘటనమునకు నియోగింపఁబడుచురుగనుక వారికట్టియపఖ్యాతివచ్చినది.

ఆహారవిషయమయి తనభర్తకు ఇష్టమయినదేదియో, అనిష్టమయినదేదియో తెలిసికొని, మఱియు నాతనికి పథ్యమేదో యపథ్యమేదో కనిపెట్టఁదగును.

ఆతఁడింటికివచ్చునపు డాతనికంఠస్వరము వీధినుండి తనకు వినఁబడఁగానే యెదుర్కొని తన నాతఁడేమిచేయుమనికోరునోయని యడుగుటకు సిద్ధురాలయి యుండఁదగును.

సేవకురాలిని మానిపి తానే యాతనిపదములఁ గడుగఁదగును.

తనభర్తతో తాను రహస్యముగా నున

మాని యాతనికిఁ గన్పింపఁదగదు.

ఆతఁడతివ్యయము చేయునపుడుగాని, దుర్వ్యయము చేయునపుడుగాని, యా విషయము రహస్యమున నాతనికి బోధింపఁదగును.

అతని యనుమతి లేకుండ, పెండ్లికొడుకు నింటికయినను పెండ్లికూఁతునింటి కయినను వివాహమునకుఁగాని, ఏదేని యుత్సవమునకుఁగాని, తనస్నేహితురాండ్రతోఁగూడ విందుభోజనమునకుఁగాని, దేవాలయమునకుఁగాని వెడలఁదగదు.

ఆతని హృదయమున కాహ్లాదము గలిగించు వినోదములనుమాత్రమే యామె యనుభవింపఁదగును.

ఆతఁడు శయ్యఁజేరినపిమ్మటఁ దాను శయ్యంజేరి యాతనికంటె ముందుగా ప్రక్కనుండి లేవఁదగును. ఆతఁడు పగట నిద్రించుచుండెనేని యెన్నఁడును మేల్కొలుపరాదు.

వంటసాలను రహస్యముగాను, ఎండచొరుదానిగాను, ఉంచఁదగును.

ఆతఁడన్యాసక్తుఁడయి తనపట్ల దోష మాచరించెనేని కొంచె మాగ్రహించి యాతనిని నిందింపవచ్చును. కాని, హెచ్చుగాఁగాదు

ఆతని ఎత్తిపొడుపుమాట లాడవలసివచ్చెనేని, ఆతనితో స్నేహితులుమాత్రమే యున్నపుడుగాని, లేక యాతఁడొంటరిగామాత్రమే యున్నపుడుగాని, అట్టిమాట లాడవచ్చును. మందులు మాయలుఁ బ్రయోగించి యాతనిమనసు వశము చేసికొనుట కెన్నఁడును బ్రయత్నింపఁదగదు.

కోపసంభాషణము, కోపదృష్టి, పరాఙ్ముఖియయి మాటలాడుట, తలవాకిట నిలుచుండి వీధివైపునకుఁ జూచుట, సేనసేపు స్థలాంతరమందుండుట,— ఇట్టికృత్యముల నామె వర్జింపఁదగును

ఆమె సర్వదా సుందరముగాను శుచిగాను, ఉండఁదగును.

ఆమె యవసరమునుబట్టి విలువవస్తులును, సాధాణవస్త్రములును ధరింపఁదగును.

ఆమెభర్త మ్రొక్కుకొనెనేని, లేక యుపవాసముండెనేని, ఆమెకూడ నాతని ననుసరింపఁదగును. ఆతఁడామెను వలదనెనేని, యామె యందుకొప్పక "ఈ విషయమున నన్నాతంకపెట్టఁగూడ"దని ఖండితముగాఁ జెప్పఁదగును.

గృహకృత్యమునకుఁ గావలసిన సర్వవిధములయిన లోహపాత్రములు, మృణ్మయపాత్రములు, తట్టలు, బుట్టలు, కఱ్ఱసామానులు, తోలువస్తువులు, ఇనుపవస్తువులు, వీనిని ఆమె బేరమాడి కొనవలయును.

అటులనే, ... ఁరు, అపరూపమయిన యోషధులు వీని నామె జాగ్రత్త చేసి యుఁ

ఆమె తన ద్రవ్యస్థితినిగాని, తనభర్తచేయు నుపదేశమునుగాని, యితరు లెవ్వరికినిఁ జెప్పఁదగదు

ఆమె వస్త్రధారణమందును, వంటచేయుటయందును, యశస్సంపాదన మందును, భర్తృసేవయందును, తన తోడిచేడియలకంటె నధికురాలగుట కామెయత్నింపఁ దగును.

ఆమె తనకుటుంబమునకు సంవత్సరమునకు వచ్చునాదాయము లెక్కించుకొని, యందుమీఁద వ్యయమును నిర్ణయించుకొనఁదగును.

భోజనమునందు వ్యయముకాఁగా మిగిలెడు పాలతో నామె నేయి చేయఁదగును. అట్లే మిగిలెడుచమురును పంచదారను జాగ్రత్త చేయఁదగును. ఆమె ముందినాడికి ఆనూలితో బట్ట నేయఁదగును. అవసరమయిన పలుపులు, త్రాళ్ళు మొదలగువానిని, వల్కలములను, చౌకగా దొరకినపు డామెకొనఁదగును. వడ్లుదంపించి బియ్యముచేసి, నూకలు తవుడు యుక్తరీతి నుపయోగింపఁదగును. ఆమె సేవకుల జీతబత్తెములను లెక్కయించఁదగును పొలముల దున్నించుటయందును, పశుపాలనమందును, అశ్వశాలా విమర్శనమందును జాగరూకురాలయి యుండఁదగును. మఱియు కోడిపుంజులు, పూరేండ్లు, చిలుకలు, కోయిలలు, నెమళ్ళు, కోఁతులు, లేళ్ళు, లోనగు పెంపుడు జంతువుల మేతనుగూర్చి ప్రతిదినము నామె శ్రద్ధపుచ్చుకొనఁదగును. ప్రతిదినమును ఆమె లెక్కల సరిచూచుచుండఁదగును.

తన భర్తయొక్క ప్రాఁతబట్టల నామె దాచి యవసరమయినపుడు, అర్హులయిన సేవకులకును భిక్షులకును ఈయఁదగును.

తనభర్తయొక్క స్నేహితుల నర్ఘ్యపాద్యాది సత్కారములచేతను, పుష్పమాలికలచేతను, అభ్యంగనస్నానముచేతను, తాంబూలదానముచేతను సంభావింపఁదగును. తన యత్తమామలను సేవించి, వారియాజ్ఞలను నిర్వర్తించి, వారి మందలింపులను సహించి, వారియెదుట మెల్లగా మితముగా భాషించుచుండఁదగును. బిగ్గఱగా నవ్వఁదగును. తనభర్తయొక్క స్నేహితులనే తనస్నేహితులనుగాను ఆతని శత్రులనే తనశత్రులనుగాను భావింపఁదగదు. ఆమెవినోదములకుఁ బ్రయత్నింపఁదగదు తనసేవకులపట్ల నాదరముగలదై యుండునది తనభర్తకుఁ జెప్పకుండ నెవ్వరికిని, ఆమె, యేప్రదానమును జేయఁదగదు. తనసేవకులు తత్తదర్హకృత్యములను జేయునట్లామె కనిపెట్టఁదగును. పండుగుదినములయందుఁ దనసేవకులకు సెలవిచ్చి వారికృత్యములు తానే చేసికొనఁదగును. ధర్మపత్నీలక్షణములిట్టివే!

పా॥ ॥సూర్యగోపాలము.

జ య ద్ర థ నా ట క ము.

—— ౦ ——

ప్ర థ మాం క ము.

రంగము—కాశ్మీరపురము, ఒకవీధి

[కలహప్రియుఁడును, కామపాలుఁడును ప్రవేశించుచున్నారు]

కామ— జయద్రథుని వివాహమునంతయు నెఱిఁగియుండి యెంత మోసము చేసితివి! కొంచెమయినఁ జెప్పనక్కఱ లేదా? అబ్బా! అబ్బా! ఎంతసొమ్ము తింటివి! నా సొమ్మే నీసొమ్ముగా వాడితివిగదా

కల— దైవసాక్షి! నామాట వినుము. కలలోనైన నేనాసంగతి వినియుంటినేని నీ యిష్టప్రకారము నన్ను నిందింపుము.

కామ—నీకాతనిపై కోపముకలదని చెప్పితివిగదా! నిజమేనా?

కల—కోపమున కేమిభాగ్యము. నాకతనిపై కోపము లేనియెడల నీవు నన్ను దరిఁజేర నీయకుము. ముగ్వురు గొప్పయుద్యోగస్థు లాతనిపాలికరిగి బహువినయముతో నన్నాతని రెండవ సేనాపతినిగా నియమింపుమని ప్రార్థించిరి. నాసంగతి నాకు తెలియును. నేనును గొప్పపనులకు తగినవాఁడనే. అయిన నాతఁడు వారలనిరాకరించి, తనప్రధానము వెల్లడియగునట్లు యుద్ధసంబంధమగు మాటలు కొన్ని చెప్పి "నాకు కావలసినవాని నిదివఱకే నియమించితి"నని చెప్పి పంపెను. సరే. ఇఁక నాయుద్యోగస్థుఁడెవఁడు? మన జయంతుఁడు మంచిలెక్కగాఁడు. ఇదివఱకెన్నఁడును పుస్తకములలోను పటములలోను తప్ప యుద్ధప్రముఖమైన చూచి యెఱుఁగఁడు. మంచి సువారపుదొర. ఆడువారివలలలో బాగుగా చిక్కఁగలఁడు. అతఁడు! సేనాపతి! ఇఁక నాధైర్యస్థైర్యము లనేకయుద్ధములయందు దండలు కన్నులారఁ జూచియున్నను తుదకెట్టివానికి లోపడవలసి వచ్చినది. కటకటా! సేనాపతిక్రింద ధ్వజధారినా!

కామ—ధ్వజధారిగా నుండుటకన్న నురులుతీయు కిరాతుఁడుగా నుండుట మేలు.

కల—ఏమి, ఇఁక దానికి మందు లేదు. ప్రస్తుత మన్నియుద్యోగంబులకును ముఖ్యముగా తటస్థించుచున్న చిక్కేయిది. గొప్పపనులు చాలకాలమునుండి పనిచేయుచున్నవారికిని తెలివిగలవారికిని నియ్యఁబడక, బంధుత్వమునుబట్టిమాత్రమే యియ్యఁబడుచున్నవి ఇప్పుడాలోచింపుము జయద్రథునకును నాకు నుండవలసిన మిత్రతచె ప్రేమించవలెను.

కామ—ఆతని నింక నే ప్రేమించను

కల—మిత్రమా! తృప్తిపొందుము. నావంతుతీర్చికొనుటకు నేనాతని వెంటాడించెదను. జనులందఱును యజమానులు గాఁ గాని భటులు గాఁ గాని యుండుట సంభవింపకుగదా అయినను,

గీ॥ భటులుకొందఱు మిక్కిలి భక్తితోడఁ
గడుపుకూటికై యెంతెంతో కష్టపడుచు
గడ్డికై పాటుపడునట్టి గాడ్దెనఁగ
వెలయుచుందురు పుడమిపై వెఱ్ఱులగుచు.
ముసలితనమునఁ బనులలో మెసలలేని
యవసరంబునఁ బనినుండి యవల వెడలఁ
గొట్టఁబడి బీదలై బుద్ధిఁ గుందుచుంద్రు.

కామ—ఔను. అట్లు చేయుదురు.

కల—గీ॥ మఱియుఁ గొందఱు నిత్యంబు మనములందుఁ
జేయునూహలఁ బైకెవ్వ జెప్పకుండ
భయముభక్తియు నటియించి ప్రజ్ఞవడసి
ప్రభువులై తామె సౌఖ్యంబుఁ బడయుచుంద్రు
వీరె జీవముగలవారు వెఱవనేల
నేను వీరలం దొక్కఁడఁ గాననింకఁ
గోపమంతయుఁ దీర్చెదఁ గూర్మినీవు
పొందు మోమిత్ర యింకను బూర్ణముగను.

కామ—గుణవతి దక్కిన యెడల జయద్రథుఁ డెంత యదృష్టవంతుఁ డగును!

కల—గుణవతి తండ్రిని లేపుదము, బెదరఁగొట్టుదము, జయద్రథుని వెంటాడింతము, విషప్రయోగము చేసిన ట్లాతనిసంతోషము పాడుచేయుదము, వీధివీధిని నాతని దుర్మార్గకృత్యము చాటుదము ఈసంగతి యామె బంధులందఱకుఁ దెలియఁజేయుదము. ఈతఁడిప్పు డెంత స్వర్గసౌఖ్య మనుభవించుచున్నను నరకసౌఖ్యమును రుచిచూపుదము. ఆతనిసౌఖ్య మిప్పు డెంతవిశేషముగా నుండినను కొంతైనను తగ్గునట్లు చేయుదము.

కామ—ఆమెతండ్రియిల్లిదే. నేను గొంతెత్తి కేకలువేసెదను.

కల—ముఖ్యముగా వేయుము రాత్రివేళ గొప్పపట్టణములలో నగ్నిపుట్టి యిండ్లన్నియు కాలిపోవునప్పుడు వేయవలసినంత గట్టిగ ము.

కామ—ఏమండో! జయలోలుఁడుగారు!— అయ్యా! జయలోలుఁడుగారు లెండి, ఏమండి జయలోలుఁడుగారూ! దొంగలు, దొంగలు, దొంగలు. మీయింటిని, మీకూతును, మీసంచులను చూచుకొనుండి దొంగలు, దొంగలు

[జయలోలుఁడు మేడపైకి వచ్చుచున్నాఁడు]

జయ— ఇంతగట్టిగాపిలుచుటకు కారణమేమి? ఏమిసంగతి

కామ—అయ్యా మీవారందఱు లోపలనున్నారా?

కల—మీతలుపులు గడియలు వేసియున్నవా?

జయ—ఏమి? ఈసంగతియెందుకు? ఇప్పుడు?

కల—దొంగలండీ! చౌర్యముజరిగినది, మీదుస్తులుతొడుగుండి సిగ్గుసిగ్గు మీగుండె లవిసినవి, సగముప్రాణముపోయినది గుబ్బుపట్టి నిద్రపోవుచున్న జనులనందఱిని త్వరగా లేపింపుండి లేనియెడలమనుమలనైతెవరు. చెప్పినమాటవిని లెండి, లెండి.

జయ—ఏమి? మీకుపిచ్చపట్టినదా?

కామ—మంత్రివర్యా! నాకంఠస్వరము మీరెఱుఁగుదురా?

జయ—నేనెఱుఁగను నీవెవరవు?

కామ—నాపేరు కామపాలుఁడు.

జయ— ఛీ! మఱింత గౌరవముతక్కువగా నింటికి పదిసార్లు రావలదని మునుపే చెప్పియుంటిని. స్పష్టముగా నాకూతును నీకియ్యనని కూడ ననియుంటిని. ఈరాత్రి వేళ తిండియెక్కువై తప్పత్రాగి యొడలుదెలియక నానిద్రాభంగము చేసెదవే!

కామ—అయ్యా! అయ్యా! అయ్యా!—

జయ—నాయధికారమును శక్తియును నీకీపనికి తగినశిక్షఁ జేయుటకు తగునని మాత్ర మెఱింగియుండుము.

కామ—అయ్యా! శాంతించుండి.

జయ—దొంగలని చెప్పినావే! ఇదికాశ్మీరము. నాయిల్లుగుడిసెగాదు.

కామ—అయ్యా! జయలోలుఁడుగారూ! నేనతిపరిశుభ్రమగు నాత్మతో నిచ్చటకు వచ్చితిని.

కల—దైవసాక్షి. రాయబారిని నమ్మనియెడల రాయబారము నిరాకరించువారిలో మీరొకరు.

జయ—నీవు రాజద్రోహివి.

కల—మీరా—మంత్రులు.

జయ—దీనికి నీవుత్తరమొసఁగవలెను. కామపాలా! నిన్ను నేనెఱుఁగుదును.

కామ—అయ్యో! దేనికైన నుత్తరమొసంగెదను.

ఉ॥ ఈనడిరేయి పౌరజనులెల్లరు నిద్రనుజొక్కియుండఁగా
నానరనాథకాంతునిటు నొక్కటి సద్భటహీనఁగాఁ బరా
ధీనఁగ నాజయద్రథుని ధీరహితున్ వడిగారవింపఁగాఁ
గానక పంపియుంటివొకొ కానకయయ్యెడుసుమ్ము సంపదల్.

ఉ॥ మీకిది యిష్టమైనయెడ మే మపరాధుల మౌదుమయ్య బల్
చీకటిరాత్రిలేపుటకుఁ, జెప్పనుమీరలు పంపకుండినన్
దేవమమ్ముఁదిట్టుటయుఁ జెప్పఁగమీయెడ నేరమైతగున్.
ఏకడనైన హాస్యముల నిట్టులుపల్కఁగ నేనుగుత్తినే.

సీ॥ కనులనుగాననే ఘనమానవులమిమ్ముఁ జెడుబుద్ధినెగతాళి చేయుటకును
మీయాజ్ఞలేనిదె మీపుత్రిపోయిన వినిపింతు మరలసేవకుఁడనునెమ్మి
తనదివ్యరూపంబుఁ దనమేలిగుణమును దనపూర్ణమౌవిద్య తనధనంబు
నిలువనీడయులేని నిర్భాగ్యునకునేఁడు దానంబుచేసి మీదయనుబాసె
నిజముఁదెలియుఁడి శీఘ్రంబ సుజనవర్య
యింటఁగలదేని నన్నుమీకిష్టమైన
శిక్షఁజేయుఁడి యీరాత్రి సిగ్గులేక
లేపినందుకు మాపైనిఁగోపమునను.

జయ—దీపము వెలిఁగించుఁడు! నాచేతి కొకవత్తినీయుఁడు! మనబంధువులనందఱను బిల్వుఁడు! నామనస్సు నిదివఱకె కుందుచున్నది. నాకు పీడకలలుకూడ వచ్చినవి. దీపము! దీపము! తెండి! తెండి! (నిష్క్రమించును.)

కల—నేను సెలవుపుచ్చుకొనియెదను. ఏమన నేనీసమయమం దిచ్చట నుంటినేని జయద్రథునకు వ్యతిరేకముగ సాక్ష్యమీయవలసివచ్చును. ఆపని యిప్పుడెంతయు తగదు. ఏమన నిప్పుడు లక్షద్వీపమందు జరుగుచున్న యుద్ధంబులకుఁబోవుటకాతఁ డొక్కండెసమర్థుండు. అంతపరాక్రమవంతుండు మనదేశంబున మఱియొక్కండును లేఁడుగనుక రాజాతని నీతప్పున కించుకశిక్షించినను పనినుండిమాత్రము తొలఁగించఁడు. నేనాతనిని యమలోకబాధలకుసమానమైనకోపమునఁజూచినను, ఇప్పుడుమాత్ర మాతనిపై మిగులదయయున్నట్లు నటించవలెను. నీవాతని నిశ్చయముగా పట్టుకొనఁగలవు ఆపెతండ్రి మొదలగువారి పెద్దసత్రమువద్దికిఁబోఁజొక్కని రమ్ము. నాకుసెలవొసఁగుము. [నిష్క్రమించును]

ప్ర భా వ తీ ప్ర ద్యు మ్న ము.

ప్ర థ మా శ్వా స ము.

ఉ॥ శ్రీమదుమామహేశు లతిచిత్రవిలాసులు దారు మున్ వియో
గామితచింత నొండొరులకై సగమేనులు నిచ్చి దెల్పు కాం
క్షామహిమంబుచేఁ జెలువగంబుగ నొక్కయొడల్ధరించు స
త్ప్రేమపు దంపతుల్కృతిపతిం దనరింతురుగాతఁ గీర్తులన్॥ ౧॥
ఉ॥ అంగజహేతుకంబు లరయన్మిథునంబుల ప్రేమలిట్టిచో
నంగజు తల్లిదండ్రులగునట్టి యనన్యసమానహార్ద సం
సంగు లనాదిదంపతులు సత్కృప నిత్తురుగాక సౌఖ్యము
ల్పింగళి సూరధీరవరు బిడ్డకు మా యమరేశమంత్రికిన్॥ ౨॥
చ॥ అమలనవీనహైమనిజ యానగరుద్ద్యుతిఁ బ్రోచు సద్వపు
ర్విమలరుచిన్ స్వభక్తులకు వెండియుఁ బైడియుఁ గీర్తియు న్నుతే
జము నెపుడప్పుడేయొసఁగు సర్గనిధానముఁ దాల్చియున్న య
ట్లమరెడు వాగ్విధాత లమరార్యున కిత్తురు నిత్యసౌఖ్యముల్॥ ౩॥
వ॥ అని సకలభువనప్రవర్తనహేతువులైన పురాతనమిథునంబులం గొనియాడి॥ ౪॥
గీ॥ ఆదికవులఁ బ్రాచేతస వ్యాసమునులఁ । దలఁపులోన భజించి యత్యంతసరస
మగుప్రభావతీప్రద్యుమ్నమను ప్రబంధ । మాచరింపుచునొక్కనాఁడాత్మలోన॥ ౫॥
మ॥ జనముల్మెచ్చఁగ మున్రచించితి నుదంచద్వైఖరిం గారుడం
బును శ్రీ రాఘవపాండవీయముఁ గళాపూర్ణోదయంబున్మఱిన్
దెనుఁగుం గబ్బము లెన్నియేనియును మత్పిత్రాదివంశాభి వ
ర్ణనలేమిం బరితుష్టి నాకవి యొనర్పంజాల నత్యంతమున్॥ ౬॥
క॥ తండ్రియు సుతులకు దైవం । బండ్రుగదా వేదవాదు లదివినియును నే
వీంద్రమును వాంద్రమును బలె మా । తండ్రిఁ బరమపూజ్యుఁగాఁగఁ దలఁపమితగునే॥ ౭
మ॥ గయలోఁ గాశిఁ బ్రయాగ శ్రీగిరిని గంగాద్వారనీలాచలో
జ్జయినీద్వారకలం దయోధ్య మధురన్ సంస్తుత్య పుణ్యస్థలా
గ్రియతన్నొందియు మించు నైమిశ కురుక్షేత్రాదులం దర్పణ
క్రియచే నాపినతమ్ముఁ డెఱ్ఱన యొనర్చెం దండ్రి కాస్లాదమున్॥ ౮॥
క॥ ఏనుం బితృపూజ నసం । చేనైన క్లొద్దియైనఁ జేయఁగవలయున్

గానఁ గృతియిచ్చి మేదిని।పై నిలుపుదు నతనికీర్తిఁ బరమేశుకృపన్॥ ౯॥

వ॥ అని నిశ్చయించి ప్రభావతీప్రద్యుమ్నంబు మద్గురుండైన యమరామాత్యుని పేర సంకేతంబుగ రచియింపంగడంగి తత్కావ్యలక్ష్మీముఖంబునకుం దిలకాయమానంబుగ నా వంశావతారం బభివర్ణించెద॥ ౧౦॥

గీ॥ గంగఁదనదు పేర గౌతమీనామ వి।ఖ్యాతిఁబరగఁదెచ్చె భూతలమున।
కేమహానుభావుఁ డామునిసింహుఁడు। గౌతముఁడుతపోధికతఁదలిర్చు॥౧౧॥

ఉ॥ వాదున గెల్వలేక పురవైరి లలాటముకన్నుఁజూపఁ డా।
బాదమునందుఁ గన్న ప్రతిపక్షతఁజూపెను శాస్త్రముల్ ప్రమా।
ణాది పదార్థతత్వ కథనాత్మకముల్ రచియించె నాత్మసం।
వేదము కై మును ల్కులపవిత్రుని గౌతముఁబోలనేర్తురే॥ ౧౨॥

క॥ ఆ గౌతమగోత్రంబున। నాగమనిధిపుట్టె గోకనామాత్యుఁడు స।
ద్భోగక్షేత్రస్వామ్య స।మాగతిఁ బింగలిపురాంకుఁడై యతఁడొప్పెన్॥౧౩॥

ఉ॥ పేర్వెలయంగ నాఘనుఁడు పింగలి గోకబుధోత్తముండు గం।
ధర్వి నొకర్తుఁ జేకొనుచు దానిని దాసిఁగ నేలె యోగితా।
గుర్వనుభావుఁడై వెరపె గోపకుమారుని ఖడ్గవర్ణ నం।
బర్వపు నిండువెన్నెలలపై నెటిఁజూపెడు కీర్తిసంపదన్॥ ౧౪॥

ఉ॥ సంతతిలేక మున్నతనిజాయ సభక్తిని సూర్యసేవ య।
త్యంతముఁజేయఁగా నతఁడు సద్విజుఁడై కలవచ్చి దొండచె।
ట్టెంతికినిచ్చి బాల ఫలియించును నీకిది ప్రోదిచేసి కొ।
మ్మెంతయు నంచుఁబల్కె నటయింతియు నాకలగాంచి ధన్యయై॥ ౧౫॥

గీ॥ సకలదిశలకు శాఖోపశాఖలిడుచుఁ।బాదలిఫలియించు దొండయుఁబోలిప్రబలి।
యాత్మసంతతిపుత్రపౌత్రాదిబహుప।రంపరలనొప్పవెలసెభర్తయును దాను॥౧౬

మ॥ తరముల్నాల్గయి దొంతునెందునగు తత్తద్గ్రామనామంబులన్।
బరగుల్ వంశముల్లెల్లఁ బూర్వపు నిజప్రఖ్యాతి మాయంగనే।
మరుదోపింగళినామ మందుఁ జిరకాలావాసులైయున్న సు।
స్థిరతన్ గోకనమంత్రి వంశజులకున్ బెన్నొందు మిన్నందుచున్॥ ౧౭॥

ఉ॥ రంగుగ గౌతమీపరిసరంబులఁ గృష్ణకెలంకులన్ ఘనుల్।
పింగళి రామయాదులు లలింబలనాటను బాకనాటనుం।
బింగళి గాదయాదులిటఁ జెంపునహించిన యస్మదాన్వయులా।
పింగళిగోకమంత్రి యిలుపేరనె చాలఁబ్రసిద్ధులెల్లచోన్॥ ౧౮॥

వ॥ అదియట్లుండె నమ్మహావంశంబునందు నస్మజ్జనకజననీ జీవంతికాత్యంత కమనీయంబైన శాఖావిశేషం బెట్టిదనిన॥ ౧౯॥

క॥ గంగయనా వెలయుచు శుచి।తంగడు శోభిల్లెనాకఁడు తద్వంశములో।
గంగయనావెలయుచు శుచి।తంగడు శోభిలెఁ దదూర్జిత యశఃశ్రీయుక్॥ ౨౦॥

క॥ మాంగల్యశోభియగునా। గంగియకును ముగురు వంశకరులైరిసుతుల్।
రంగత్కీర్తులు మహినె।న్నంగ న్సూరనయుఁ గుప్పనయు రామనయుక్॥ ౨౧॥

క॥ కనియెక్ గుప్పన సూరన।యనుపుత్రుని నతనిపుత్రులగు బానయ భ।
ద్రన కుప్పార్యులకాత్మజు। లనేకు లెఱ్ఱయ్య పాపయాదులు ప్రాజ్ఞుల్॥ ౨౨॥

క॥ జనియించెను రామనకుం। దనయుఁడుగంగన్న గంగనకుగాదన గా।
దనకుం బెద్దయమొదలుగ। ననేకులీగతిఁ దదన్వయము శోభిల్లెన్॥ ౨౩॥

గీ॥ ఇట్లు పుత్రపౌత్రాదుల నెసఁగునట్టి। సోదరులుదన్ను మిక్కిలినాదరింప।
నలఘుసాద్గుణ్యసౌభాగ్యకలితుఁడగుచు। గంగనామాత్యసూరయకరము వెలసె॥

ఉ॥ పింగలి గంగమంత్రివరుబిడ్డకు సూరనకుం బదాబ్జ రే।
ఖంగల కాంతికేవలచి కైవసమయ్యెను రాజ్యలక్ష్మి దా।
బంగరు కామకుంచెలును బల్లకియు న్మొదలైనయాత్మ స।
ర్వాంగ సమృద్ధితోడ సిరికంబుజరేఖల ప్రేమవింతయే॥ ౨౫॥

గీ॥ సూరనిభుఁడైన పింగలిసూరవిభుని। దొరయఁబోఁ డొరుఁడలవేల్పుదొరయకాని।
యతనిదానము సిరికి నియతనిదాన। మర్థులప్పుడు దానసమర్థులైరి॥ ౨౬॥

క॥ సూరయమంత్రికిఁ గలిగెను। సూరయమంత్రియయనంగ సుతరత్నము కం।
ఠీరవమున కెందును గం।ఠీరవముజనించునట్టి నియమముఁగోఁచన్॥ ౨౭॥

ఉ॥ సూరయసూరమంత్రి కతిశుద్ధిఁ దలిర్చిన యక్కమాంబయం।
దౌరసులుద్భవించిరి మహాత్ములు నల్వురు సజ్జనస్తుతుల్।
దారగుణాభిరాములయి యన్నయభవ్యుఁడు సూరసూరియుక్।
ధీరుఁడు వల్లశౌరియును నీతయశస్కుఁడు లింగవార్యుఁడుక్॥ ౨౮॥

వ॥ వారిలోన॥ ౨౯॥

క॥ వల్లయమంత్రికిఁ బుత్రుఁడు। పుల్లయమంత్రియనఁబుట్టె భువిలింగన కు।
త్పల్లయశుఁడు సూరయయును। సల్లాలిత నీతియక్క సచివుఁడుఁదనయుల్॥ ౩౦॥

క॥ వారలకు నగ్రజుండగు। సూరయ సూరప్రభుండు సుకవిత్వసదా।
చారశివభక్తి వినయో।దారత్వాదులఁ బ్రసిద్ధతముఁడై మించెన్॥ ౩౧॥

క॥ వేదుక నాయనపెండలి।యాడె వెలగలేటి యమరనామాత్యసుతన్।

క్రీడావతులందును గొని। యాడందగిన యమలాంబ నఖిలగుణాఢ్యన్॥ ౩౨॥

క॥ అమల మహాగుణనిధియా। యమలమ హారిప్రకార యశమునఁదనరెన్।
గమలాలయాసరస్వ।త్యుమ లాలితాంగిఁబోల్ప నొనరెడు గరితల్॥ ౩౩॥

ఉ॥ ఆ యమలమ్మయందును గృహస్థశిరోమణి సూరశౌరి య।
త్యాయతశీలురంగనియె నాత్మజుల న్సుగుణన్ సుధీజన।
ధ్యేయగుణప్రశంసు నమరేశ్వరమంత్రిని ధర్మనిర్మలో।
పాయుని మల్లనార్యు నతిభవ్యతమించిన యక్కధీరునిన్॥ ౩౪॥

వ॥ అందు॥ ౩౫॥

క॥ ఇమ్ముగనుదయించిరి జన।సమ్మతుఁడగు మల్లనకును జగ్గనయనఁగాఁ।
దమ్మయసూరయచిన్నయ। తిమ్మయలనఁబరగు సుతులు ధృతిబలసహితుల్॥ ౩౬॥

క॥ ఆమల్లనకును జన్నమ।చే మంత్రులకెల్ల గుణవిశేషంబులచే।
భూమిన్ జ్యేష్ఠుఁడనంగ మ।హామహిమౌదార్యుఁ డమరనార్యుఁడు వెలసెన్॥ ౩౭॥

సీ॥ చిలుమనఁదెచ్చి రాచటీకమిచ్చిన బుధోత్తముఁ దేవభూమణితాతతండ్రి।
యనవరతమునికి నాయూరిపేరఁ దాపెలయు కేసయ్య యేపెలఁదితాత।
యన్నయబాపయ్య లగ్రజానుజులుగాఁ బరగుభావయ్య యేగరితతండ్రి।
జయనయోన్నతులు కొండయరాఘవార్యలేసతి కన్నదమ్ములై నతులుగనిరి।
పృథివి నేపురంధ్రి పెదతండ్రికొడుకు సాత్త్వికశోభితుండు కేసవిభుఁడు।
తనరునేగుణాఢ్యపినతండ్రిసుతుఁడు గం।గయ్యబహుసహోదరాంచితుండు॥ ౩౮

గీ॥ రమ్యగుణనిధి యన్నమ్మ రాచపూడి। గణపతిసుపుత్రి యేసాధ్వికన్నతల్లి।
యట్టియంబమ్మఁ బింగలి యమరమంత్రి। పెంపునింపును మెఱయంగఁ బెండ్లియాడె॥

గీ॥ అనఘసౌభాగ్య వర్తనార్ధాంగలక్ష్మి। పింగళియమరామాత్యు నర్ధాంగలక్ష్మి।
యంబమాంబిక భోగభాగ్యములమరుని।యంబకును నంబికకు సాటియనఁగ వెలసె॥

క॥ ఆదంపతులకుఁ బుత్రుల।మై జనియించితిమి సూరనాఖ్యుఁడ నేనున్।
ధాత్రీజితమతి యమలార్యుఁడు। రాజితబోధార్థనాభిరతుఁ డెఱ్ఱనయున్॥ ౪౧॥

క॥ స్తోత్రములకయ్యె సమ్య। క్పాత్రము శ్రీరాచపూడి గంగనయును దౌ।
హిత్రులుగలుగఁగ వంశప।విత్రంబామిథున ముభయవిధసంతతులన్॥ ౪౨॥

క॥ అక్షయగుణవిభవైతా। దృక్షకులోత్తంసునకు సద్వృత్తవిహార।
ప్రేక్షాసి లలితధర్మ సు।రక్షాంసునకు నురు రువిధురాహంసునకున్॥ ౪౩॥

క॥ గౌతమగోత్రునకును బ్రా।ఖ్యాతాపస్తంబసూత్ర యాజుషశాఖా।
ధీతిపవిత్రునకును లో।కాతిగపతితాజితాంతరామిత్రునకున్॥ ౪౪॥

క॥ పృథులాకోశీసేతు। ప్రథాకుసుమహారి కృష్ణరాయసముద్ర।
ప్రథితాగ్రహార భోగా।తిథేయ నిజసంతతి ప్రతీతాత్మునకున్॥ ౪౫॥

క॥ గంగాశుచివృత్తికి నభి।షంగానాఘూర్ణిత నీతిసంపత్తికి స।
న్మంగళగుణ పాత్రునకును। బింగళి సూరప్రధాని ప్రియపుత్రునకున్॥ ౪౬॥

క॥ శ్రీమద్రాజేంద్ర గురు।స్వామి స్థిరవంశ కలశజలనిధిసోమ।
తోస్సేమారాధ్య కృపాల।బ్ధామల శివభక్తి శోభితాచారునకున్॥ ౪౭॥

క॥ అమలాంబానందనునకుఁ। గమలాంబాగురుసమాన ఘనధైర్యునకున్।
గమనీయ మనీషివ్యప। గమనీయున కంబమాంబికా రమణునకున్॥ ౪౮॥

క॥ మజ్జనకున కర్చితధీ। మజ్జనకునకు నభినుతి సమార్జితమాయో।
న్మజ్జనకున కమలచిదవ। మజ్జనకున కమృతరస నిమజ్జనకునకున్॥ ౪౯॥

క॥ అమరామాత్యున కురుమ।త్యమరామాత్యున కజోపయమునకృతార్థో।
ద్యమరామాత్యుపమేయా। యమరామాత్యురు గుణోదయ యశశ్శ్రీకిన్॥ ౫౦॥

వ॥ అతిశయకీర్తి వైభవాభివృద్ధియగునట్లుగా నేను సమర్పింపంబూనిన ప్రభావతీ ప్ర
ద్యుమ్నంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన॥ ౫౧॥

క॥ శ్రీగమణీరమణీయ మ।హీహారస్థలుఁ డచ్యుతుఁడు సముజ్జ్వలమహిమన్।
ద్వారకనుండఁగ నొకనాఁ। డారూఢాదరత నింద్రుఁ డన్విభుకడకున్॥ ౫౨॥

వ॥ లోకహిత కార్యపర్యాలోచనంబునకై చనుదెంచువాఁడు నాకంబువెడలి యాకా
సంబున నడతెంచుచున్న సమయంబున॥ ౫౩॥

సీ॥ ధాత్రీమహాదేవి తాల్చినమున్నీటి మొలనూలిరత్నంపు మొగపనంగ।
జలధి పేరిటిపాఁపతలచుట్టుగల ధరిత్రీమూర్తి శిశుశిరోతిలకమనఁగ।
నపరదిక్సతికట్టినట్టిసాగరమను పుట్టంబుతుదిబ్రాఁతె మొగడయనఁగ।
వరుణగోపురబద్ధ వార్ధితోరణమధ్య గుంభితనవ పుష్పగుచ్ఛమనఁగ।
వివిధమణిమయ గృహదీప్తివిసరవిసర। శోభశోభితమగు ద్వారకాపురంబు।
దవులఁగాన్పించెఁదనఁ జూడఁదైవవిభుఁడు।వేయికన్నులుఁజాలక వెఱఁగుపడఁగ॥

వ॥ ఇట్లు గనుపట్టు నాపట్టణపుసొంపునకు శిరఃకంపంబు సేయు నిలింపవల్లభు నింపు
పెంపుపరికించి కించిదుల్లసిత విలోచనంబుల నా సహస్రవిలోచను విలోకించి త
దీయ రథసూతుండగు మాతలియిట్లనియె॥ ౫౪॥

క॥ ఏమియిది దేవరకను। దామరలకు నింతవెఱఁగు దలకొలిపెడు నే।
యేమనఁగ నహహ నాక।స్వామికి నబ్రమగుప్రోలు వసుమతిఁగలిగెన్॥ ౫౫॥

క॥ జడనిధియను తెరమఱుఁగటు। వెడలినిలిచినట్టి యహాట వెలఁదియపోలెం।

గడునింపులు గులుకుచుఁ దన। రెడు నీ పురలక్ష్మి యవధరించితె యధిపా॥ ౫౭॥

క॥ పడమట నంభోరాశియుఁ। గడమ దిశల వనచయంబుఁ గప్పారఁగఁ దా।
నడుమఁ బురలక్ష్మి గనుపట్టెడు హరియురమున సుఖించు రీతి దలిర్పన్॥ ౫౮॥

ఉ॥ వోహదధూపధూమములతోఁ గనుపట్టెడు తత్పురీవన।
వ్యూహము నో సమస్తవిబుధోత్తమ చూచితె యంబుపాన కా।
మూహల లంబమాన నవతోయదరాజి విరాజితాబ్ధి సం।
దేహనితాంతకందళన దీపితనైపుణి నేపుఁ జూపెడున్॥ ౫౯॥

ఉ॥ భోగపుఁజుట్లుకోటలుగ భూమికిరీట సముజ్జ్వలత్ఫణా।
పూగము సౌధబృందముగ భోగికులేంద్రుఁ డుపేంద్రుఁ డాయ లే।
కీగతిఁ దాను వచ్చి భజియించెనొకో యవతారమంచుఁ జే।
తోగతి నాకు నెంతయును దోఁచుచునున్నది నిర్జరేశ్వరా॥ ౬౦॥

మ॥ అవచూడోపల దీప్తిచిత్రితములై హర్మ్యాగ్ర విన్యస్త కే।
తువులందేర్పడ కొప్పె నప్పురముపై త్రోవన్ మొగుళ్లేగ యిం।
ద్రవిలోకింపితె యెంత సేల చని యేర్పాటయ్యె హో, స్మరా।
దవి కాలాగరు ధూపధూమలతలో యభ్రంబులో యిప్పుడున్॥ ౬౧॥

చ॥ హరిహయ చూడుమా తెలియుటబ్రము దగ్గఱ చూచి కాని యాం।
గిరసునికైన నల్లయవి కెంపులమేడలతోడి విస్ఫుర।
న్మరకత కుట్టిమస్థలియొ మవ్వపు లేఁజిగురాకు కెంపు ము।
న్మురమునఁ దేజరిల్లు నెఱ మామిడిమ్రాఁకులతోడి తోఁటయో॥ ౬౨॥

సీ॥ కలధౌతకేళినగంబు గాఁబోలును దనరుచున్నది శంభుతనువులీల।
ఘనపుష్పచాంపేయ వనరాజి గాఁబోలు నేలుచున్నది పులితోలుసిరుల।
హరినీలసోపాన సరణి గాఁబోలును బగటుచున్నది నల్లపాఁపపేరుఁ।
బవడంపుటలువ సౌభాగ్యంబు గాఁబోలుఁ జాటుచున్నది జటాజూటరుచిని।
సరసి గాఁబోలుఁ గ్రాలెడు సురనదిగతి। గోడ గాఁబోలుఁ బోలెడిను డుపతికళ।
ననిమిషాధిప చూచితే యల్లపసిఁడి। కోటనడిమి శృంగారముతోఁటలోన॥ ౬౩॥

సీ॥ ఆలోలశైవాల జాలలాలిత్యంబు జంగమోద్యాన వేషము వహింప।
రంగదత్తుంగ తరంగసంఘాతంబు నడగోటలతెఱంగు నడపుచుండ।
డిండీరమండలాఖండసౌభాగ్యంబు చరసౌధచయవిలాసము భజింప।
శ్రీకరశీకరాస్తోకప్రవర్షంబు కానుక ముత్యాలకరణిఁ బరగ।
నగడితలు తత్తదాశోపయాతవాత। వశత చేత నీతప్పురవర్యపర్య।

పాసనాశాసనానీత పరపురీ ప్రరంపరాలీల నెరపెనునింపుమీఱి॥ ౬౩॥

క॥ పడమటియదిసాగరమని। యెడుతద్జ్ఞులమాటఁదక్క నేతత్పురి న।
ల్గడలందుఁ బరిఘలెవ్వియొ। జడనిధియెయ్యదియొ తెలియశక్యమె ప్రజకున్॥ ౬౪॥

చ॥ తను ధరణీతటిద్విపత్పతి ధన్యవనావళి యింతమీఱుటల్।
కనియును మేఘమిచ్చటి కలజ్జతఁజేరెదుఁగాక చేరకే।
గినను గొఱతయేమి పురికిం బుఖ్రుఁదేనియ సోనకాలువల్।
జనముల పైరుపంటలకుఁ జాలవె యెన్నటికైన నెన్నఁగన్॥ ౬౫॥

వ॥ అని యివ్విధంబున రథికసారథులు తత్తద్వస్తుసందర్శన సమయసముచిత వచోరచనల వినోదించుచుం గొంతదవ్వున నయ్యర్వికిడిగ్గి యన్నగరంబు చేరంజను నంత నతనిరాక విని వనజోదరుండు ప్రియసహోదరుండగు సాత్యకింబిలిపించి యద్విజవల్లభు నెదుర్కొని తోడితెచ్చుటకు నియోగించిన నతండు సముచిత పరివారసమన్వితుండై యెదుర్కొని తోడ్కొనిచన వేడ్కలిగురొత్త చిత్తంబున నద్దేవోత్తముండు నూత్నగారుత్మత స్తంభ సంభృతభేదావలంబిరంభాతరు విభూషిత గోపురపార్శ్వభాగఁబగు తత్పురంబు ప్రవేశించి యుభయపార్శ్వ సౌధవీథికాధిరూఢ పౌరవిలాసినీ కటాక్షవహ బహుగుణీకృత మార్గతోరణుండగుచు వారిజనాభు మందిరద్వారంబు చేరనరిగె నతండును నుగ్రసేనవసుదేవ సంకర్షణ గదాక్రూరప్రముఖులతోఁ గక్ష్యాంతరంబులు గడచి యెదురువచ్చి తత్ప్రవేశ విధానంబు యథోచితంబుగా నడపి పరస్పరార్హ సంభావనంబు లస్తంభసంభ్రమ సంభృతంబులై జరగునంతఁ గుశలప్రశ్నంబుఁ గావించిన నద్ద్విజనాయకుండు జనార్దనునకిట్లనియె॥ ౬౬॥

గీ॥ ఇపుడు నీదర్శనంబనియెడు కుశలము। కలిమిప్రత్యక్షమే చెప్పవలదు కృష్ణ।
యటమటము గాకయటమునుపటికుశలము। నఖిలవిదుఁడవీ వెఱుఁగనియదియుఁగలదె॥

క॥ ఐనను నా చేతను విన। గా నభిమతమయ్యెనేని కమలోదర నీ।
కే నెఱిఁగించెద విను మవ। ధానముతో మన్మనోవ్యధాభరమెల్లన్॥ ౬౭॥

చ॥ తపమున వజ్రనాభుఁడను దైత్యుఁడు బ్రహ్మఁ బ్రసన్నుఁజేసి వ।
జ్రపురియనంగ నొక్కనగరంబును మేరువుపొంత మారుతా।
తపములకున్ని జానుమతిఁ దక్కఁ బ్రవేశ మొనర్పరాని యు।
ట్టిపసఁడనర్చుదానిని ఘటించియతం డొసఁగన్ బ్రదీప్తుడై॥ ౬౮॥

వ॥ యథేష్టవైభవోపభోగంబులం బ్రవర్తించుచు॥ ౭౦॥

ఉ॥ ఆతఁడు మొన్న నున్నతమదాంధత డాసిగ నేగుదెంచి యా।
పోతరమేమిచెప్ప నటుఁబూరికిఁగై కొన కప్సరోవధూ।
వ్రాతనిశాతపాణిరుహ వారిసలాలస నవ్యపల్లవం।
బైతనరారు నందనమహావనిలో విడియించె సేనలన్॥ ౨౧॥

సీ॥ దనుజాధిరోహ తాడనభంజనాదుల కోర్చునే కల్పవృక్షోత్తమములు।
శోష్యపర్యుషిత మనుష్యమాంసంబులు ప్రానునట్టివి రామ సంతానకములు।
దానవద్విప ఘటాలానతాదురవస్థ సైరించునే హరిచందనములు।
మనుజఖాదిస్వేద మలినవస్త్రాదులు దాల్పఁజాలివియె మందారతరులు।
నందనమ్మునకును వజ్రనాభదైత్యుఁ। డపుడు చేసిన కష్టపాటబ్జనాభ।
యిపుడుఁ దలఁపునఁబాటిన హృదయమునకు।నధికతరమైన పరితాపమావహిల్లు॥

గీ॥ వానికెదిరించిపోర దేవతలలోన। నెవ్వరును జాలరిది బ్రహ్మయిచ్చినట్టి।
వరములో పలియదియ పంకరుహనాభ। మదికలఁకఁజేసీమును చెప్పమఱి వినాఁడ॥

వ॥ కావున వానిచేఁతలన్నియు నప్రతిహతంబులయి సాగుచుండె నంత నేనును బృహ
స్పతియును విచారించుకొని యద్దురాత్మునకు॥ ౨౪॥

గీ॥ అక్కచెలియంద్ర సంతానమైనయట్టి। మనకుమనలోన నింతమత్సరంబు।
వలదుమాపల్కు నీవు నీపలుకుమేముఁ। జేసిబ్రదుకుట మేలంచుఁ జెప్పఁబనిచి॥

వ॥ కొంత శాంతసంరంభంబుగా మఱియు నప్పటిటీఅమికొలఁది యెంచుకొని చుట్ట
ఱికంబు నెరపుచుం బట్టణంబులోనికి రప్పించి వానికి వానిసేనలకు ననూనంబుగా
విడుదులుపాలు పెట్టించితి మట్టిసమయంబున॥ ౨౬॥

సీ॥ తనకులుపాచాల దనిమిట్టిపడఁగ ననామధేయపు దైత్యునకునడంగి।
తనవిడిదికి రంభ ననుపవై తనితిట్టుకిగ్గాడి యసురకుఁగేలు మొగిచి।
తనకుఁబెద్దతికంబు మును సేయవనిమాఱు నధమరాత్రసునకు నర్చలొసఁగి।
తనకమృతముఁబోసి యనుపవంచునదల్పఁ బినుగురక్కసునకుఁ బ్రియము చెప్పి।
పంకరుహనాభ యేఁఖడ్డపాటులరయ। నెందు నెవ్వరుఁ బడరునీకేమి చెప్ప।
నెంతపాపంబు చేసిన జంతువొక్కొ। యింద్రుఁడగునని యపుడాత్మ నెన్నుకొంటి॥

ఉ॥ వారిజనేత్ర యేనిపుడు వచ్చుచునుండి యలౌకికాద్భుత।
శ్రీరుచిరత్వటియ న్నగరీగరిమాతిశయావలోక లీ।
లారసదూరధూత సకలవ్యథచిత్తుఁడనై యథాపురా।
కారతనీకుఁదోఁచెదనొ కానితనుద్యుతిఁ బాసితిఁజుమీ॥ ౨౭॥

ఆ ం ధ్ర క వు ల చ రి త్ర ము.

.౦

మ ధ్య క వు లు.

నందిమల్లయ్య, ఘంటసింగయ్య.

ఈ యిరువురు కవులును కలిసియే గ్రంథములను జేయుచువచ్చిరి వీరు చేసిన గ్రంథములలో ప్రధానములయినవి ప్రబోధ చంద్రోదయమును, వరాహ పురాణమును. వీనిలో వరాహ పురాణమును కృష్ణదేవరాయల తండ్రియైన నృసింహ రాజునకును, ప్రబోధచంద్రోదయము నసంతామాత్యుని పుత్రుఁడయిన గంగయ్యామంత్రికిని, వీరంకితముచేసిరి. ఈయిరువురు కవులలో మొదటివాఁడయిన నందిమల్లయ్యకు రెండవకవియైన ఘంట సింగయ్య మేనల్లుఁడు. ఘంట సింగయ్యకు మలయమారుత కవి యని బిరుదాంకము గలదు. వీరిరువురకును గల బంధుత్వాదులు ప్రబోధచంద్రోదయములోని యీక్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నవి —

సీ॥ కలఁడు కౌశికగోత్ర కలశాంబురాశిమందారంబు సంగీతనందినంది।
సింగమంత్రికిఁ బుణ్యశీల పోతమ్మకు నాత్మసంభవుఁడు మల్లయమనీషి।
యతనిమేనల్లుఁడంచిత భరద్వాజ గోత్రరామచైత్రోదయంబు ఘంట।
నాగధీమణికిఁ బుణ్యచరిత్ర యమ్మలాంబకుఁ గూర్మితనయుండు మలయమారు।
తాహ్వయుఁడు సింగనార్యుండు నమృతవాక్కు।
లీశ్వరారాధకులు శాంతు లిలఁబ్రసిద్ధు।
లుభయభాషల నేర్పరులుపమరులు స।
మర్థులీకృతి రాజనిర్మాణమునకు॥—ప్రబోధచంద్రోదయము.

వీరు తమపుస్తకముల యాశ్వాసాంత గద్యములలోఁ గూడ నుభయ నామములను జేర్చుకొని

"ఇది శ్రీమదుమామహేశ్వర ప్రసాదలబ్ధ సారస్వతాభినంది నంది సింగయామాత్యపుత్ర మల్లయమనీషితల్లజ మలయమారుతాభిధాన ఘంట నాగయ్య ప్రధానతనూభవ సింగయకవిపుంగవ ప్రణీతంబయిన"

అని వ్రాసికొనియున్నారు. వీరిరువురును నియోగిబ్రాహ్మణులు వీరిలో మొదటివాఁడయిన నంది మల్లయ్య కౌశికగోత్రుఁడు, ఆపస్తంబ సూత్రుఁడు, దక్షిణామూర్తి శిష్యుఁడు. రెండవవాఁడయిన ఘంట సింగయ్య భరద్వాజగోత్రుఁడు, ఆపస్తంబ సూత్రుఁడు, అఘోర శివశిష్యుఁడు. ఈసంగతులనే కవులు తమ వరాహపురాణమునం దీప్రకారముగాఁ జెప్పిరి

సీ॥ అప్పుడు సభావేదికాగ్రస్థితులమైన మమ్ము వాగీశ్వరీ మంత్రరాజ।
సిద్ధిపారగులఁ గౌశిక భరద్వాజగోత్రుల మహాదేవాంఘ్రి జలజభక్తి।
పరతంత్రమతుల నాపస్తంబసూత్రుల గురుదక్షిణామూర్త్య ఘోరశివుల।
శిష్యుల నతిశాంతచిత్తులఁ దనకు నాశ్రితుల భాషాద్వయకృతినిరూఢ।
శేముషీభూషణుల నంది సింగనార్య।
తనయు మల్లయ కవికులోత్తముని ఘంట।
నాగధీమణి కూర్మినందనుని మఱియు।
మారుతాంకితు సింగయమంత్రిఁ జూచి॥—వరాహపురాణము.

ఈకవులు వరాహపురాణమునందుఁ గృతిపతియైన సాళువ నృసింహరాజుయొక్క వంశాభివర్ణనము చేయుచు, చంద్రవంశపు రాజయిన గుండరాజునకు సాళువ మంగరాజును సాళువ మంగరాజునకు గౌతరాజును గౌతరాజునకు గుండరాజును గుండరాజునకు తిమ్మరాజును జైమిని భారతమును కృతినందిన నరసింహరాజును పుట్టినట్టును, ఆనృసింహరాజువద్ద వరాహపురాణమునకుఁ గృతీశ్వరుఁడైన సాళువ నరసింగరాజు తండ్రియైన యీశ్వరరాజు సేనానాయకుఁడయి యుండినట్టును, వీరిది తుళువాన్వయమైనట్టును చెప్పియున్నారు. నృసింహరాజునే నరసింగరాయఁడనియు పుస్తకములయందు వాడుదురు. ఈ యంశములను దెల్పెడు పద్యాదులలో నొకటి రెంటిని వరాహపురాణమునుండి యిం దెత్తి చూపుచున్నాను.—

వ॥ అట్టి నరసింగ రాజరత్నంబుచేత మన్ననవడసి సైన్యనాయక పట్టభద్రత్వంబున నిర్నిద్ర విజయలక్ష్మీ మహత్వంబున మదవదభియాతి భయదసత్వంబున దీర్ఘాయురైశ్వర్య ధుర్యుండైన యీశ్వరనాయకునకుం బ్రియతనూభవుండు నరసవసుధాధ్యక్షుండు నిర్వంచితానుగ్రహంబునం బరిగ్రహించిన యిమ్మహాప్రబంధంబునకు శృంగార విభూషణంబుగాఁ దదీయ వంశావతారంబు &c.

* * * * * * *

సీ॥ ఉదయాద్రి భేదించె హుత్తరి నిర్జించె గండికోటపురంబుఁ గదలఁద్రవ్వె।
పెనుగొండసాధించె బెగ్గలూరుహరించెఁ గోవెలనెల్లూరుఁ గుంటుపఱిచె।
కుందాణివిదళించె గొడుగుచింతజయించె బాగూరుపంచము పాడుచేసె।
నరుగొండపెకలించె నామూరుమర్దించె శ్రీరంగపురమును జారిసమరె।
రాయచౌహత్త మల్లధరావరాహ।
మోహనమురారి బర్బరబాహుసాళ్వ।
నారసింహప్రతాప సన్నాహుఁడగుచు।
విశ్వహితకారి తిమ్మయయీశ్వరుండు॥

ఈ తిమ్మయయీశ్వరరాజు సాళువగుండ నారసింహరాజునకు సేనానాయకుఁడగుటయేకాక దాయాదుఁడు కూడనై యుండుటచేత నాతనియనంతరము రాజ్యమును వహించినట్లు తోఁచుచున్నది. వరాహపురాణమును కృతినందిన నరసింహరాయని కాలము మనకుఁ దెలియునుగనుక, ఇంచుమించుగా నీకవుల కాలమును దెలియును. కృష్ణదేవరాయల తండ్రియైన యీ నరసింహదేవరాయలు క్రీస్తుశకము ౧౪౮౭ వ సంవత్సరము మొదలుకొని ౧౫౦౯ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసినట్లు శిలాశాసనాదులవలనఁ దెలియవచ్చుచున్నది. కంచిలోనున్న దేవాలయములలో నొకదానిమీఁద శాలివాహనశకము ౧౪౧౫ వ సంవత్సరమునం దనఁగా హూణశకము ౧౪౯౩ వ సంవత్సరమునందు నరసింహదేవరాయలు భూదానముచేసిన ట్లొక శిలాశాసనమువలన తేటపడుచున్నది. ఇంతకుఁ బూర్వమునం దీతనిపేరు శిలాశాసనాదులలో నెక్కడను ఉదాహరింపఁబడి యున్నట్లు కానఁబడదు. అందుచేత నితఁ డాసంవత్సరమునందే రాజ్యమునకు వచ్చినట్లూహింపఁ బడుచున్నది. అనంతపురమండలములో గుత్తికి మూఁడామడల దూరములో పెన్నేటియొడ్డుననున్న రామపురమునందలి రామేశ్వరస్వామి యాలయపుగోడమీఁద నరసింహదేవరాయలు శాలివాహనశకము ౧౪౧౮ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౪౯౬ వ సంవత్సరమునందు రాజ్యముచేయుచుండినట్టు శిలాదానశాసన మొక్కటియున్నది. ఈప్రకారముగా నీతని దానశాసనములు ౧౫౦౯ వ సంవత్సరమువఱకును కానఁబడుచున్నది. ఆమఱుసటిసంవత్సరమునందు కృష్ణదేవరాయల రాజ్యమారంభమైనది. కాఁబట్టి నరసింహదేవరాయల కాలములోనున్న యీకవులు హూణశకము ౧౪౮౭ వ సంవత్సరమునకును ౧౫౦౯ వ సంవత్సరమునకును మధ్యకాలమునందు వరాహపురాణమును రచియించి యున్నారు. ఈ యిరువురు కవులును గ్రంథరచన చేసినట్లు చెప్పఁబడి యున్నను వీరిలో మలయమారుతకవి యనఁబడెడు ఘంటు సింగన్నయే ప్రసిద్ధుఁడైన మంచికవియైనట్టు గ్రంథాంతరములవలనఁ దెలియవచ్చుచున్నది. ఈసింగన్నతండ్రి పేరు నాగయ్య, తల్లిపేరు అమ్మలాంబ. పారిజాతాపహరణమును రచియించిన నందితిమ్మకవి యీ మలయమారుతకవికి మేనల్లుఁడు. నందిమల్లయ్య తండ్రిపేరు సింగన్న, తల్లిపేరు పోతమాంబ. సాధారణముగా ముక్కుతిమ్మన్న యనఁబడెడు నంది తిమ్మకవి యీమల్లయకవికి మనుమఁడని చెప్పుదురుగాని పారిజాతాపహరణమునందు కవి తనవంశమును జెప్పుచో నీక్రిందిపద్యమునం దాసంగతి చెప్పియుండలేదు —

సీ॥ కౌశికగోత్రవిఖ్యాతుఁ డాపస్తంబసూత్రుఁ డార్వేలపవిత్రకులుఁడు।
నందిసింగామాత్యునకును దిమ్మాంబకుఁ దనయుండు సకలవిద్యావివేక।
చతురుండు మలయమారుతకవీంద్రునకు మేనల్లుండ కృష్ణరాయక్షితీశ।

కరుణాసమాలబ్ధ ఘనచతురంతయాన మహాగ్రహార సన్మానయుతుండు।
తిమ్మయార్యుండు శివపరాధీనమతియు।
ఘోరశివగురుశిష్యుండు పారిజాత।
హరణమను కావ్యమొనరించె నంధ్రభాష।
నాదివాకర తారాసుధాకరముగ॥—పారిజాతాపహరణము.

మల్లయ సింగయకవులలో నెవ్వరికవిత్వమేదో యుభయు రచనలకునుగల తారతమ్యమెట్టిదో నిర్ణయించుట కాధారము లేవియుం గానరావు. అక్కడక్కడం గొన్ని యపూర్వప్రయోగములు గానంబడుచున్నను మొత్తముమీఁద కవనము రసవంతము గాను, నాతికఠినముగాను, శ్రావ్యముగాను, ఉన్నది. కవిత్వరీతి తెలియుటకయి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.—

వరాహపురాణము

ఉ॥ చూచె నృపాలు నెమ్మొగము చూపుసరోజగి తాళిసన్నిభం॥
బై చరియింపఁజూచి హృదయంగమ రూపవిశేషదర్పమై।
చూచె నిజార్చితాంగజుని చూపు మహీవిభు నేయనిచ్చ నా।
రాచముకైవడి న్నెఱయు రాజకుమారిక ఘర్మవారియై॥—ఆ. ౩

ఉ॥ కమ్మని తేనియల్ తఱుచు కాలువలై ప్రవహింప మీఁద ఝం।
ఝుమ్మని మ్రోయు తుమ్మెదల జొంపము మళ్ళకు నీళ్ళుగట్టుచో।
బమ్మిన వేడ్కఁ బాడు వనపాలక బాలకదంబకంబు చం।
దమ్మున నొప్పు నప్పురము నాలుగువంకలఁ బుష్పవాటులన్॥—ఆ. ౯.

ప్రబోధ చంద్రోదయము.

మత్తకోకిల॥ ఏను మున్నొకనాఁడు పద్మజు నింటికేగినఁ గొల్వులో।
మౌనులెల్లను లేచిరప్పుడు మమ్ముఁజూచి పితామహుం।
డానవెట్టి ప్రియంబుచెప్పుచు నంబుగోమయమార్జితం।
బైన యట్టి నిజోరుపీఠిక యందునిల్పఁడె నావుడున్॥—ఆ. ౨.

ఉ॥ మెత్తని దుప్పటంబులను మెత్తినకస్తురి కప్పురంబులన్।
ముత్తెపుఁజేరులన్ సురభిపూరిత పుష్పములన్ వృథావెలిన్।
హత్తిన వేడ్కఁజూతు రహహా మతిహీనులు లోనెఱుంగ కీ।
బిత్తటి వారనారులను పేరిటి జంగమ నారకంబులన్॥—ఆ. ౪.

కృష్ణదేవరాయలు.

ఇతఁ డాముక్తమాల్యదయను నామాంతరముగల విష్ణుచిత్తీయమను ప్రబంధ

మును రచియించిన మహాకవి ఇతఁడు కవీశ్వరుఁడయి విద్వన్మహాకవుల నాదరిం
చుటవలననే కాక మహారాజయి యనేకదేశములను జయించుటవలనఁగూడ సుప్ర
సిద్ధుఁడయినవాఁడు. దక్షిణహిందూదేశమును పాలించినరాజులలో నింతదేశమును
జయించి యేలినవాఁడును, ఇంత ప్రసిద్ధికెక్కినవాఁడును, మఱియెవ్వఁడును లేఁడు.
కాఁబట్టి యీతని చరిత్రమును వ్రాయుటకుముందీతని పూర్వులచరిత్రమును గూడ
సంక్షేపముగాఁ గొంతవ్రాయుట యుచితమని తోఁచుచున్నది ఈతని రాజధాని
బళ్ళారి మండలములోని యానెగొందికి సమీపమున తుంగభద్రా తీరమునందున్న
విజయనగరము. ఈవిజయనగరమునకు విద్యానగరమనియు నామాంతరము గలదు.
ఈపట్టణము విద్యారణ్యస్వామియని మహాప్రసిద్ధిగన్న మాధవాచార్యులవారి యాజ్ఞ
చేతఁగట్టఁబడినది ఈమాధవాచార్యులాకాలమునందు బుక్కరాజువద్ద మంత్రిగా
నుండెను కంపభూపతి కుమారుఁడైన బుక్కరాజు క్రీస్తుశకము ౧౩౫౦వ సంవత్స
రము మొదలుకొని ౧౩౭౯వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. ఈ రాజు
హూణశకము ౧౩౩౬వ సంవత్సరము మొదలుకొని ౧౩౫౧వ సంవత్సరము వఱ
కునుగూడ తనయన్నయైన హరిహరరాజుతోఁ గలిసి రాజ్యము చేసెననియు, ఆకాల
మునందుఁగూడ మాధవాచార్యుఁడే వారికి మంత్రియనియు, వారికి రాజ్యము మాధ
వాచార్యునివలననే వచ్చెననియు, కొందఱందురుగాని యదియెంతవఱకు సత్యమో
తెలియదు. బుక్కభూపాలుని తండ్రియైన సంగరాజొక చిన్న సంస్థానాధిపతియై
యుండి, మహమ్మదీయులు దండెత్తివచ్చి హిందూరాజ్యమును నాశనముచేసి యోరు
గంటి ప్రతాపరుద్రుని చెఱగొనిపోయిన కాలములో తనరాజ్యమును పోఁగొట్టు
కొనియుండెను. కొందఱతఁడు గొల్లవాఁడని చెప్పుదురు. కాని యీతని పూర్వ
స్థితిని నిర్ధారణముచేయుటకుఁ దగిన యాధారములేవియు నిప్పుడు కానరావు ఈ
హరిహరబుక్కరాజులు సహితము ప్రతాపరుద్రుని యవసానదశయందాతనిసేనలో
దండనాథులుగా నుండిరని యొకానొకరు వ్రాసియున్నారు ఏదియెట్లున్నను వీ రా
రంభదశలో రాజ్యహీనులయియుండి తమ ధైర్యసాహసములవలనను తమ కులగురు
వైన మాధవాచార్యుని బుద్ధిబలమువలనను రాజ్యము సంపాదించి, స్వతంత్రులై మా
ధవాచార్యుని మంత్రినిగాఁ జేసికొని యాతని యాలోచన ననుసరించి వర్తించు-
చుండినట్టు మాత్రము నిశ్చయముగా తెలియవచ్చుచున్నది మాధవాచార్యులు తా
నొక దేవత నుపాసించి యాదేవతను ప్రత్యక్షము చేసికొని యామె వరముచేత
బుక్కభూపాలునకు రాజ్యమిప్పించెనని కొందఱును, లక్ష్మీకటాక్షమును బొంది సన్ని
హితురాలయిన లక్ష్మీదేవిని తన్నైశ్వర్యవంతునిగాఁ జేయుమని కోరినప్పు డామె
యాతనికాజన్మమునందు లక్ష్మి లభింపదని చెప్పఁగా జన్మాంతరతుల్యమైన సన్యాస

మును స్వీకరించి వైభవమును బొందెనని కొందఱును, వ్రాసియున్నారు ఇవి యిట్టి వలివారి బుద్ధికల్పితములు. ఇటువంటి కథలను కల్పించుటలో హిందువులకుఁ గల సామర్థ్యము మఱియెవ్వరికిని గానఁబడదు. మాధవాచార్యులకుఁ బూర్వమునందు శంకరాచార్య పీఠమునకువచ్చిన యతీశ్వరు లాది శంకరునివలెను ఇతర సన్యాసుల వలెను పాదచారులయి భిక్షాటనము చేయుచు, శిష్యపరంపరకు తత్త్వబోధను జేయుచువచ్చిరి ఈమాధవాచార్యుఁడు బుక్కరాజువద్ద మంత్రిగానుండి సమస్త వైభవముల ననుభవించుచు సన్యసించినవాఁడగుటచేతఁ దాను సన్యాసియయ్యును తొంటి విభవములను విడువఁజాలనివాఁడయి జనులకుఁ దనయందుఁగల గౌరవాధిక్యమువలనను, రాజానుగ్రహము వలనను, గజాశ్వాందోళికాది సమస్త రాజచిహ్నములను ధరించి, పీఠాధిపతుల కిట్టియైశ్వర్య చిహ్నము లుండవచ్చునని నిబంధనము చేసి సమర్థించుకొనెను. ఏనుఁగులతోను గుఱ్ఱములతోను వాద్యములతోను పల్లకులలో నెక్కి సర్వసంగ పరిత్యాగులయిన సన్యాసులు మహా వైభవముతో సంచరించుట దేవతాపరాయత్తమని సాధించుటకయి మనవారీలక్ష్మి కథను తరువాతఁ గల్పించియుందురు. సన్యాసాశ్రమమును స్వీకరించినప్పుడు మాధవాచార్యులవారు విద్యారణ్యులన్న నామమును స్వీకరించిరి వీరికాలమునుండియే జగద్గురువుల మనుకొనెడు స్మార్తాచార్య పీఠస్థులయిన యతుల కందఱకును గజాశ్వాదులును వాద్యములును పెండ్లిపల్లకులును పరంపరగా వచ్చుచున్నవి ఈ మాధవాచార్యులవారు గొప్పవిద్వాంసులు. ఆదిశంకరుల తరువాత శంకరాచార్యపీఠమునకు వచ్చినవారిలో మాధవాచార్యులకుఁ బూర్వమునందుఁగాని పరమునందుఁగాని యింతటి పండితులు మఱియెవ్వరును లేరు. ఈయన పరాశరమాధవీయమను పేర పరాశరస్మృతి కొక్క గొప్పవ్యాఖ్యానమును, కాలమాధవీయమను నొక కాలనిర్ణయగ్రంథమును, శంకరవిజయమును, విద్యారణ్యమని ప్రసిద్ధిగన్న వేదభాష్యమును, నూటయెనిమిది యుపనిషత్తుల కొకవ్యాఖ్యానమును, సర్వదర్శన సంగ్రహమును, మాధవనిదానమును, రచియించెను. రాఁబోయెడు విజయనగరరాజుల చరిత్రమును దివ్యజ్ఞానముచేత ముందుగానే తెలుపుచు నీమహావిద్వాంసునిచే రచియింపఁబడినదన్న కాలజ్ఞానమను పుస్తకమొకటి కలదుగాని యది విజయనగర సంస్థానము క్షీణించినతరువాత రచియింపఁబడిన యాధునికగ్రంథమయి యుండును. మాధవాచార్యులవారు తుంగభద్రాతీరమందున్న పంపానగరమునందు జన్మించిరి, వీరు బుక్కభూపాలునికి కులగురువులు, భారద్వాజగోత్రులయిన తెలుఁగుబ్రాహ్మణులు; ఈయనతండ్రి మాయణుఁడు, అన్న సాయణుఁడు. అన్న యందును తండ్రియందునుగల గౌరవముచేత మాధవాచార్యులు వేదభాష్యములలోఁ గొన్నిటికి వారిపేరులుపెట్టెను. మాధవాచా

ర్యులు తొంబదిసంవత్సరముల ప్రాయమున సిద్ధిపొందిరఁట, ఈయన ౧౩౬౮వ సంవత్సరమునందు బుక్కరాజు మంత్రియైయుండిన ట్లొకతామ్రశాసనమువలనఁ దెలియవచ్చుచున్నది. మాధవీయాదిగ్రంథములలో మాధవాచార్యులవారు తమవంశమును దెలుపుచు వ్రాసిన రెండుశ్లోకముల నిందుఁ జూపుచున్నాను —

శ్లో॥ యస్య బోధాయనంసూత్రం శాఖా యస్యచ యాజుషీ।
భారద్వాజకులం యస్య సర్వజ్ఞ స్సహిమాధవః॥
శ్రీమతీ యస్యజననీ సుకీర్తిర్మాయణః పితా।
సాయణో భోగనాథశ్చ మనోబుద్ధిసహోదరౌ॥

బుక్కరాజు తరువాత నాతనికి కామాక్షీదేవివలనఁ బుట్టిన హరిహరనాథుఁడు ౧౩౭౯వ సంవత్సరము మొదలుకొని ౧౪౦౧వ సంవత్సరమువఱకును రాజ్యము చేసెను. ఈ హరిహరరాజునకు మల్లాదేవివలనఁగలిగిన పుత్రుఁడైన వీరప్రౌఢ దేవరాయలు ౧౪౧౨వ సంవత్సరమువఱకును, ఆతనిపుత్రుఁడైన విజయభూపతి ౧౪౧౫వ సంవత్సరము వఱకును, ఆతని కుమారుఁడయిన దేవరాయలు ౧౪౨౨వ సంవత్సరము మొదలుకొని ౧౪౪౭వ సంవత్సరమువఱకును, రాజ్యము చేసినట్లు శిలాతామ్రశాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. కాని వీరేయేసంవత్సరములయందు సింహాసన మెక్కిరో యేయేసంవత్సరములయందు పరమపదమును బొందిరో నిశ్చయముగాఁ దెలియదు. బుక్కరాజు కాలమునుండియు వీరికి మహమ్మదీయులతో యుద్ధములుజరుగుచువచ్చెను. ౧౩౬౮వ సంవత్సరమునందు మొట్టమొదట బుక్కరాజు మహమ్మదీయులను యుద్ధములో జయించెను. ఆతనిపుత్రుఁడైన హరిహరరాజును మహమ్మదీయులతో యుద్ధముచేసి ౧౩౮౦వ సంవత్సరమునందు తురుష్కులను గోవానగరమునుండి వెడలఁగొట్టెను. ఈహరిహరరాజు హిందూదేవాలయముల కనేకములకు భూదానములు చేసెను. హరిహరరాజుయొక్క కడపటి దినములలో సాళువగుండరాజు మంత్రిగానుండెను. గుండరాజు జైమినిభారతము కృతినందిన సాళువ నృసింహరాజుతండ్రి. గుండరాజుమంత్రిగాను దండనాథుఁడుగాను ఉండి కొంతరాజ్యమును సంపాదించెను. తదనంతర మాతనిపుత్రుఁడు సాళువ నరసింహరాజు దేవరాయలు సంతానములేక మృతుఁడగుటవలననో మఱియేలాగుననో కర్ణాటరాజ్యము నాక్రమించుకొనెను. నరసింహరాజునకు తిమ్మరాజను పేరుగల జ్యేష్ఠభ్రాత యొకఁడుగలఁడు. అతఁడే యీశ్వరరాజు తండ్రియైన సాళువతిమ్మరాజనితోఁచుచున్నది. సాళువ నృసింహరాజు భూదానములు మొదలైనదానము లనేకములుచేసెను. ఇతఁడు చిత్తూరిమండలములోని వందవాసినగరమునకు పడమట నామడ దూరములోనున్న వెల్లమగ్రామములోని దేవాలయమునకు శాలివాహనశకము ౧౩౯౧వ సంవత్సరమునందనఁ

గా హూణశకము ౧౪౬౯వ సంవత్సరమునందుఁ గొంతభూమి యిచ్చెను, ఈతని రాజ్యకాలములోనే చిత్తూరిమండలములోని యాప్పూరుగ్రామములోని శివాలయమున కొకరిచేత శాలివాహనశకము ౧౩౯౩వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౪౭౧వ సంవత్సరమునందుఁ గొంతభూమి యియ్యఁబడినది. ఈనృసింహరాజు కాలమున తిమ్మరాజుపుత్రుఁడైన యీశ్వరరాజు దండనాథుఁడుగా నున్నట్లు వరాహపురాణ పీఠికవలనఁ దెలియవచ్చుచున్నది. ఈనృసింహరాజుమరణానంతర మీశ్వరరాజు పుత్రుఁడైన నరసింహరాజు రాజ్యమునకువచ్చెను. ఇతఁడు ౧౪౯౩వ సంవత్సరము మొదలుకొని ౧౫౦౯వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినట్లు శాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. కొందఱితఁడు ౧౫౦౫వ సంవత్సరమువఱకును మాత్రమే రాజ్యపరిపాలనము చేసెననియు, ఆసంవత్సరము మొదలుకొని యాతని జ్యేష్ఠపుత్రుఁడయిన వీర నృసింహరాయలు పరిపాలనము చేసెననియు, చెప్పుచున్నారు ఇదియే నిజమై యుండవచ్చును. పేరొక్కటియేయై యుండుటచేత శాసనములను పరీక్షించినవారు కొడుకునుగూడ తండ్రినిగా భ్రమియించి యుందురు. ౧౫౦౯వ సంవత్సరమునందు కృష్ణదేవరాయల ప్రభుత్వారంభమైనది. కృష్ణదేవరాయలు రాజ్యమునకు రాకమున్దాతనియన్నయైన వీరనృసింహరాయలు కొంతకాలము రాజ్యము చేసినట్టు కృష్ణదేవరాయల కంకితము చేయఁబడిన గ్రంథములయందెల్లను జెప్పఁబడి యున్నది —

క॥ వీరనృసింహుఁడు నిజభుజ।
దారుణకరవాల పరుషధారాహత వీ।
రారియగుచు నేకాతప।
వారణముగనేలె ధర నవారణమహిమన్॥

క॥ ఆవిభు ననంతరంబ ధ।
రావలయముఁ దాల్చెఁ గృష్ణరాయఁడు చిన్నా।
దేవియు శుభమతి తిరుమల।
దేవియునుం దనకుఁగూర్చు దేవేరులుగన్॥—మనుచరిత్రము.

క॥ వారలలోఁ దిప్పాంబకు।
మారుఁడు పరిపంథికంధి మంథాచలమై।
వీర నరసింహరాయఁడు।
వారాశిపరీతభూమి వలయం బేలెన్॥

శా॥ వీరశ్రీ నరసింహశౌరి [illegible]పన్ విశ్వత్రమాపండలీ।
ధౌరంధర్యమునఙ్జనంబు ముదమందన్నాగమాంబాసుతుం।
డారూఢోన్నతిఁ గృష్ణరాయఁడు విభుండై రాజ్యసింహాసనం।

The Sathya Sam Varthani

సత్యసంవర్ధని

A MONTHLY ANGLO-TELUGU JOURNAL

Mainly devoted to Religious, Social and Moral Topics

శ్లో॥ సువిశాల మిదంవిశ్వం పవిత్రం బ్రహ్మమందిరమ్।
చేతస్సు నిర్మలం తీర్థం, సత్యంశాస్త్ర మనశ్వరమ్,
విశ్వాసోధర్మమూలంహి, ప్రీతిఃపరమసాధనమ్,
స్వార్థనాశస్తువైరాగ్యం, బ్రాహ్మైరేవం ప్రకీర్త్యతే॥

Vol II.] RAJAHMUNDRY [No 1.

July 1892.

CONTENTS

OF SUBSCRIPTION

free Rs 12 0-0

4-0-0

OURSELVES.

The *Sathya Sam Vardham* is entering on the second of its existence The munificent help conceded to us ur patrons and supporters, ' e encouragement shown our subscribers and other gentelmen, the kindness editors and proprietors who have supplied us with their valuable journals in exchange for our tiny monthly,—all these we own with grateful recognition We hope and earnestly request that they will continue their favour towards us this year also Offering our hearty prayers to our Heavenly Father and Friend without whose aid and guidance human efforts must ever be fruitless, we resume our humble work May the All-wise guide our pen and hold our spirits despite danger and disappointment!

The *Prardhana Samaj* Rajahmundry.

At a general meeting of the members of the Prardha na Samaj convened on the 28th June 1892 for ot office-bearers of the Samaj for 1892-93 t proceedings were made—

Venerable Mr Veeresalingam Puntulu the I the Samaj was re-elected to the office

For the sake of convenience, all the of the Samaj was divided into four sep

1. The *Samaj Proper* ; Mr. S. Mru Secretary, was elected the Secr aulu, the Treasure seco

The *Chari*

మ. బలముల్మందరఁగాంచెఁ గాంచనమయప్రాసాద హర్మ్యాగ్ర ని
ర్మల గంధోత్కటకుంభ ధిక్కృత నభోమధ్యజ్వలత్తారకల్
లలితారామ సదార్త పల్లవలతాంత ప్రోల్లసత్కోరకల్
కలుషాంభోనిధి తోరకల్ భటసమగ్రద్వారకల్ ద్వారకల్. ౧౨౧.
సీ. భవ్యప్రవాళసంబద్ధమందిరరోచు లుభయసంధ్యారక్తినోటువఱప
హరినీలమాణిక్య హర్మ్యాగ్రశోభలు శ్యామతమఃపాతమ స్తతిజయింపఁ
జారువజ్రాంచితసౌధ శృంగద్యుతుల్ పండువెన్నెలతోడ మెండుకొనఁగఁ
బద్మాహితోపల ప్రాసాదకాంతులు చండభానుప్రభ జోకఁజేయ
సంజకవలివి కృష్ణపక్షత్రియామ । లివ్వి శుక్లనిశీథినులివ్వి దినము
లివ్వియని బుద్ధిలోపల నేర్పరింపఁ । బద్మగర్భుండు నేరఁ డప్పట్టణమున. ౧౨౨.
సీ అనవద్య వేదవేదాంగశాస్త్రాంభోజగర్భోరగేంద్రులై గణనకెక్కి
యధిక కోదండవిద్యాభీమ భార్గవరామ దాశరథులై రాశికెక్కి
(యమిత నవనిధానసముపార్జనాత్యంతపటిమ కుబేరులై వన్నెకెక్కి)
రణరంగ రిపు సంహరణక్రియా జంభారి బలభద్రులై చాలఁ బ్రణుతికెక్కి
యజ్ఞములొనర్చిశత్రుల నదటడంచి । పృథివి జీవనమునమించి విప్రసేవఁ
జేసి చెలఁగుదు రప్పురసీమ ధరణి । సురలు రాజులు వైశ్యులు శూద్రవరులు.
క. నిరుపమ సుధామయములై । పరమోన్నతిఁ జెంది మధ్యభాగవినీల
స్ఫురదురు చిహ్నంబులచే । సరసతహర్మ్యములు చంద్రసామ్యముదాల్చెన్. ౧౨౪.
సీ. కరికుంభములఁబోలి కందుకంబులనేలు నున్ననివక్షోజ చన్నులమరఁ
గలువఱేకులమీఱి జలచరంబులఁగేరు తిన్నని నిడువాలుఁగన్నులమర
నళులకైవడిఁబొల్చి హరినీలములగెల్చు కప్పున గిరిజాను కొప్పులమరఁ
గుందనంబుహరించి క్రొమ్మెఱుంగులమించు మేలిమిఁదగు నునుమేనులమర
పొలఁగుదురు ముద్దుఁబలుకులు దొలఁకుకలికి
మొలక నగవుల వెన్నెల తళుకుచిలుక
నలరుదురు లీల రతిపతినైన మిగుల
వలవఁగాఁ జేయనేర్చినవారసతులు. ౧౨౫
చ. ప్రవిమలలీల దర్పక విరాజితకేళి మహీధరాగ్ర వ
జ్రవిపులపద్మరాగరుచిజాలము లెల్లపుడున్ జెలంగుచుం
గువలయ పద్మసంహతులకున్ మదిహెచ్చును గుందులేని యా
త్సవ మొనరింప డెందమున సంశయమంది కృశించె జక్కవల్. ౧౨౬.

చ. హరిగెయును గుంభసంభవుఁడు నాగ్రహమెత్తి ధరాధరంబులన్
శరధుల నుద్ధతింగొన మన●బునఁజూచిన భీతినొంది ది
గ్ధరములు వార్ధులన్ హరిపదంబొగిఁజొచ్చి భయంబుదక్కి ని
ల్చురహినిసాలముల్పరిఖలున్ గనుపట్టె మహోజ్జ్వలాకృతిన్. ౧౨౭.
సీ. కకుబంతవిశ్రాంత గంధేభముల జోడుకోడెలోయన నొప్పు కుంజరములుఁ
గమలాప్త రథతురంగంబుల పిల్లలోయనఁ బొలుపొందు భవ్యాశ్వములును
సారమాహేంద్రకౌబేరరథంబుల యాకృతిఁ గనుపట్టు నరదములును
శౌర్యతిరస్కృత చండ కంఠీరవ ఘోరపరాక్రమ వీరభటులుఁ
గలిగి పరభీషణాకృతిఁ జెలఁగి నిత్య । కాహళీవేణుడమరు ఢక్కామురజక
దుందుభి మృదంగ శంఖఝర్ఝరకడిండి । మ ధ్వనిశ్రేణి దిశలు గ్రమ్మఁగఁదనర్చు.
గీ. అమిత తేజోమయంబైన యప్పురంబు । మెఱయుఁ గైవారమై యొప్పుపరిఖతోడఁ
బరిధి సంయుక్తమైపొల్చు పద్మమిత్ర । మండలంబునుబోలి యఖండమహిమ.
సీ. పగడంపురత్నాలపైఁ గట్టినట్టి రత్నమణీనికర తోరణములచేతఁ
గర్పూరకస్తూరికా వజ్రరాసులుగనుపట్టు మేలియంగళ్లచేత
గందాననల్కినకడల ముక్తాంగవల్లికఁ దనరు ముంగిళ్లచేతఁ
గాంచనదండసంకలిత నానావస్త్రసమితిఁ జెన్నొందు సౌధములచేత
విమలమణిజాల నీరాజనములచేత । ననుపమదశాంగ ధూపవాసనలచేత
నమితమంగళ గీతవాద్యములచేతఁ । బుడమిలోఁ గడునొప్పు నప్పురవరంబు.
వ కాంచి యుబ్బలంబు చేరంజను నవసరంబున. ౧౩౧.
సీ. పరశుతోమరగదా పట్టిసశూలచాప శరాఢ్యమౌ కాలుబలము నడచె
రమణీయ వివిధచిత్రచ్ఛత్ర కేతనకాంతులఁ దగుశతాంగములు నడచె
నూపుర కింకిణీ నూతనక్వణనంబు గడునొప్పు ఘనతురంగములు నడచె
దాన గంధాంధలుబ్ధ భ్రమద్భ్రమర ఝుంకారనాదముమీఱఁ గరులు నడచెఁ
దమ్ములును గర్ణుఁడును సోమదత్తుఁడును ద్రొణాత్మజుండును రుక్మియు యవనపతియు
నాదిగా భూమిసుతులెల్ల నలమికొలువ । రాజసముమీఱ నారాజరాజు నడచె.
వ తదనంతరంబ యజాతశత్రుండును బాలశీతాంశురేఖయుంబోని యంకుశంబు కేలం
గీలించి మాణిక్యశాతకుంభమయప్రకరచామర రమణీయ ఘంటానిగళభూషి
తైరావతకులసంభవ చతుర్దంత దంతావళారూఢుండై నకుల సహదేవు లుభయ
పార్శ్వంబుల నిలిచి వింజామరలువీవఁ బరిపూర్ణ చంద్రమండలసమాన పుండరీకంబు
భీమసేనుండు పూన నర్జునుండు తాంబూలకరండంబు ధరింపఁ జతుర్థనుండు మంద

ంచానిలంబు నడియునట్లుగా సురటిద్రిప్ప సాంబ సారణ చారుదేష్ణ బృహద్భానుభానుదేవ భానువింద సునందనాది హరికుమారవర్గంబు ముందట బలసి కొలువఁ బ్రద్యుమ్నానిరుద్ధులుత్తమాశ్వంబులనెక్కి సాయుతాలంగు లొనరింప నుగ్రసేనుండును నుద్ధవుండును నక్రూరుండును జేకితానుండును కృతవర్మయు నాదిగాఁగల యాదవవీరులు భీష్మ ద్రోణ కృపాశ్వత్థామల నుగ్గడించుకొని పశ్చాద్భాగంబునం గొలిచి యేతేర ఘటోత్కచాది రాక్షసవీరులు తమతమ బలంబులతోడఁ బిఱుంద రా దక్షిణవామభాగంబుల సామజంబులెక్కి వచ్చు రాజపుత్రులతోడ నుచితాలాపంబులాడుచుఁ బౌరపుణ్యాంగనలు రమ్యహర్మ్యాగ్రములనుండి మంగళపల్లవ లాజపుష్పంబులు చల్లి దీవింప భూసురాశీర్వాదనాదంబులు మంగళపాఠకగీతరవంబులు వందిమాగధ జయధ్వానంబులుం జెలంగఁ గుంజర ఘంటానినాదంబులు రోదోంతరాళంబులు నిండ విజయభేరీమృదంగ కాహళ వేణు శంఖ తమ్మట మురజ ఢక్కా హుడుక్కాది నానావిధవాద్యధ్వానంబులు లోకాలోకపర్వతంబునఁ బ్రతిశబ్దంబు నిగిడింప నైరావతారూఢుండైన దేవతాసార్వభౌముచందంబునఁ బ్రవేశంబుచేసె నంతకమున్న యాయితంబులయిన హర్మ్యప్రాసాదంబుల బలభద్ర పుండరీకాక్షులు నానాదేశాగత రాజన్యులను భీష్మాదులను విడియ నియమించి యక్రూరు మందిరంబున ననుజసమేతుండైన యజాతశత్రునుంచి యఖిలబలంబులకు సకలపదార్థంబు లొసంగుచుఁ గతిపయదినంబులు నిల్చి యొక్కనాఁడు కృష్ణుం డుగ్రసేన శూరసేన వసుదేవపురస్సరంబుగా భీష్మ ద్రోణాది మాన్యులకును యుధిష్ఠిరాది పాండవేయులకును సుయోధనాది గాంధారేయులకును రాధేయాది మహాయోధవీరులకును ద్రుపద విరాటాది నానాదేశాధీశ్వరులకును ఘటోత్కచాలంబస హలాయుధాది రక్షోనాయకులకును జీని చీనాంబరానర్ఘ్య రత్నాభరణ తురంగ చతుర్దంతదంతావళాది నానావస్తువ్రాతంబులును వలయువారలకు దోరహత్తుగా నొసంగి యదలి ననిచి యందు నయ్యుధిష్ఠిరుని నిలిగించి యర్జునుం దనయొద్దనే యునుచుకొని సుఖంబుండెనంత. ౧౩౩

అయ్యుధిష్ఠిరుఁడు భీష్మాది కౌరవవృద్ధులును ధార్తరాష్ట్రులు జానపదులును
దనతోడ నేతేర ననుపమ సంతోషభరితుండై ఖాండవప్రస్థమునఁ బ్ర
వేశంబుచేసె భూమీశులనందఱుఁ దమనాళ్లకనిపి సోదరులుం దాను
నిత్యసంతుష్టులై నిరతంబు బ్రాహ్మణపూజసేయుచు మహాభూరిమహిమఁ
గీర్తిసౌహార్దములు గడుఁ బూర్తిఁ జెంది । యొప్పుగుఁ దనయందె నిలువంగ విపుల శౌర్య
వీర్య ధైర్యజవములతో విభవమొనఁగఁ । జిరతరశ్రీల రాజ్యంబు సేయుచుండె

క. అని శుకయోగీంద్రుం డ । య్యనిమిషరాడ్పౌత్రునకు దయాపరుఁడై చె
ప్పిన వృత్తాంతము సంతస । మున సూతుఁడు శౌనకాదిమునులకుఁ జెప్పెన్

శా. శ్రీమత్కాశ్యపగోత్రదుగ్ధ జలధి శ్రీ కామినీసోదరా
హేమక్ష్మాధర ధీర బుద్ధి జితభోగీంద్రామరాచార్య సం
గ్రామోపార్జిత భూరి భూవరసమగ్ర ప్రాభవా పన్నగ
స్వామి క్ష్మాధరకూర్మభూమిభరవాస్తవ్య స్వబాహార్గళా. ౧౩౬

క. కృష్ణాంబికా కుమారక । కృష్ణాంఘ్రి సరోజయుగళకీర్తనసేవా
నిష్ణాత నిఖిలభువనచ । రిష్ణు సముజ్జ్వల యశః పరిష్కృతమూర్తీ ౧౩౭

శ్రీవృత్తము శ్రీరమణివార సరసీరుహమదభ్రమర శిష్టజనరక్షణమహీమం
దార జలజాతనయనాహృదయ కైరవ సుధాకర సదీవరగభీరా
వైరి వసుధారమణవారణసమూహ మృగవల్లభ నిలింపవలిభోగా
నీరజభవప్రణయినీకరలసత్కమల నిశ్రుతమరందనిభవాక్యా. ౧౩౮

గద్య ఇది శ్రీమత్కౌండిన్యగోత్రపవిత్ర చరికొండ తిమ్మనామాత్యపుత్ర సకల విద్యా
పారీణ శతఘంటసురత్రాణ సుకవిజనవిధేయ ధర్మన నామధేయ ప్రణీతంబైన
చిత్రభారతంబను పురాణకథయందు సర్వంబును నష్టమాశ్వాసము

దుర్గ మిగుల కోపమును విచారమునొంది తనభర్తకుం దనకు జరిగిన ప్రసంగమంతయుఁ బూసగ్రుచ్చినట్లు కమలకుం దెలిపి జాగ్రతగ నుండుమని చెప్పి యామెకు నేసహాయము గావలసినఁ దానుచేసెదనని వాగ్దానముఁ జేసి యంతతోఁ దృప్తిఁగలుగమిఁ దమయింటి పొరుగుననున్న రాధాకాంతరావు భార్యయగు రోహిణిభాయియొద్దకుఁ బోయి యీవార్త యామెకుఁ జెప్పి, రాధాకాంతునితోఁ జెప్పి సాయముఁ జేయుమని యొట్టుదిట్టముఁ జేసివచ్చెను. దుర్గభాయి దౌలతురావుయొక్క దురుద్దేశముల నెఱిఁగించినవెనుకఁ గమల మిగుల భయపడుచుఁ దోడేలునోటినుండి విడిపింపఁబడి పులినోటఁబడితినిగదా యని దుఃఖింప నారంభించెను. మరునాఁడు రాధాకాంతరాయులు భార్యచే విని దీనురాలగు స్త్రీకి, మానహాని రాకుండఁ గాపాడవలెనని నిశ్చయించి "కమలతో మాటలాడి రమ్మ"ని రోహిణి నంపెను. రోహిణియు దుర్గయు నెన్నివిధములనో తరచితరచి యామె వివాహమునుగూర్చియు స్థితినిఁ గూర్చియుఁ దెలియఁగోరి యనేకప్రశ్నల నడిగిరిగాని యామె తిన్నఁగాఁ బ్రత్యుత్తరమీయక "నాకర్మము నేననుభవింపక తప్పదు. జలమరణమొ, యగ్నిమరణమొ నామొగమున వ్రాసియున్నది. నాకు మానహాని గలుగకుండ మీరుమాత్రము చూచుచుండుఁడు." అని యుత్తరముచెప్పెను. ఆమాటలఁబట్టి యామెకు మృతుఁడైన భర్తపై గాఢానురాగము గలదనియు నందుచే నామె ప్రాణత్యాగముఁ జేసికొనుననియు నిశ్చయించి రోహిణి మిగుల జాగరూకతగ నుండుమని దుర్గకు బోధచేసి మానహాని సంభవించునెడలఁ దనయింటి కామె నంపుమని నొక్కి పలుమారు చెప్పి యింటికరిగెను. ఆవేళ మధ్యాహ్నము రాధాకాంతరావు దౌలతరావునకు నట్టి దుష్కార్యముఁ జేయవలదని హితోపదేశముచేసెను. ఆ హితమతనికి విషప్రయోగమగుటచే దౌలతరావు మండిపడి వృద్ధుఁడగు రాధాకాంతుని ననరానిమాటలనెను. రాధాకాంతుఁడు వానిమాటలకుఁ దలపంకించి యీవిషయమున నెంతపనియైనఁ జేయ నిశ్చయించెను. దౌలతరావామెనుదప్పక వివాహమాడుటకు నిశ్చయించెను. కమల మానహాని సంభవించునని మృతినొంద నిశ్చయించుకొనెను.

ఆఱవ ప్రకరణం.

మహారాష్ట్ర ప్రభువులలో హోల్కారుకుటుంబము మిగుల గౌరవమునకుఁ బాత్రమైనది. ఈ హోల్కారువంశమును స్థాపనముఁ జేసిన శూరుఁడు మలహారురావు హోల్కారు. ఈతఁడు క్రీస్తుశకము ౧౬౯౩ వ సంవత్సరమున జనియించి, మొదట పీష్వాలయొద్ద సిపాయిగ బాహుబలాతిశయముచే నొక వాసికెక్కిన

దౌల—పిల్లలులేనివారిబ్రతుకు వ్యర్థముగదా! మాయన్నకు బిడ్డలులేకపోవుట చేత నేనే కర్మచేయవలసివచ్చినది. నాకును బిల్లలులేరు. ఈ పల్కూరువంశ మింతటిలో నాశనమే కాఁబోలును.

దుర్గ—(ఈమాటలువిని సిగ్గునఁదలవంచుకొని) "మీరెవరినైనఁబెంచుకొనుఁడ"ని ప్రత్యుత్తరమిచ్చెను.

దౌల— పెంచుకొనినవారికి ముప్పగడచుట యరుదు. అంతకన్నఁ దెగించి మఱియొకదానినిఁ బెండ్లియాడుట యుత్తమము. నీకిష్టమైనచో నట్లు చేసెద.

దుర్గ— నాకిష్టమైనది కాని మీకీవయసునఁ బిల్లనిచ్చువారెవరు?

దౌల— ఒకరిచ్చెడువారెవరు? పిల్ల సిద్ధముగ నేయున్నది. నీదయయుండినది—

ఈమాట యతనినోటినుండిరాఁగానే దుర్గ వెలవెలబోయిఁ చూడసాగి "ఎవరు పిల్ల యెవరు?" అని యడిగెను. అప్పుడు దౌలతరావు లేచి భార్యచేతులు రెండును బట్టుకొని "నేనొకమాట చెప్పెదను కోపపడక వినుము. కమలను నాకిచ్చి వివాహముఁ జేయుము." అని యింక నేమో చెప్పఁబోవుచుండ దెబ్బఁదిన్న పామువలె బుస్సునలేచి దుర్గ కోపావేశముచేఁ బెదవులు తడఁబడ నిట్లనెను. "ఛీఛీ. నీవంటి కఠినచిత్తునిఁ బాపకర్ముని నేనెందుంగనలేదు. అన్నగారికాష్ఠము తిన్నగఁ జల్లారనైన లేదు. అప్పుడే పుట్టెడు దుఃఖములోనున్న యాయన భార్య నోదార్చుటకు మారామెను బెండ్లియాడెదనని చెప్పుటకు నోరెట్లువచ్చెను. విధవయని సందేహము లేదు. అన్నపెండ్లాము తల్లివంటిదిగదా యని గౌరవము లేదు. నీముఖముఁ జూచినవారికి పంచమహాపాతకములుఁ జుట్టుకొనును." అని యామె నిందసేయుచుండ, దౌలతరావు మెల్లగ నామెతో "ఆమె నిజముగ విధవయైనచో నాది తప్పే మాయన్న యామెను బెండ్లియాడలేదఁట." అనెను.

దుర్గ — ఈమాయమాట లెవరు నీతోఁ జెప్పినారు? దుండిరావా యేమి? వానియమ్మ కడుపుమాడ వానికి మరణము రాను. ఆ కాళికాదేవికి వానిమీఁదదయ. ఆదిక్కుమాలినవాఁడే నాకొంపఁదీయుచున్నది ఊరిలో సాటివారు విన్న నేమందురు? ఆమెకుఁ బెండ్లిగాకున్న వైధవ్యమనుభవించుట యామెకు మెచ్చటా?"

అని పలుక దౌలతురావు భార్యను కోపింపవలదని బ్రతిమలాడి "నీకు సవతి వచ్చునను రోషముచే నిట్లనుచున్నావు. కోపపడక నా ముద్దుఁ జెల్లించు" మని వేడెను. దుర్గ యప్పలుకుల కలుక రెట్టింప "నాతో మీరు మాటలాడవద్దు. నాపనిమీఁద నేను బోయెదను." అని చేయివదిలించుకొని లోనికిం బోయెను. తనకు సవతివచ్చునను నీర్ష్యచేతనో, విధవను వరించుటచేఁగలుగు నప్రతిష్ఠను భరింపలేకనో,

యోధవరుఁడై తన ప్రభువులకు ననుగ్రహపాత్రుఁడయ్యెను. అందుచే పీష్వాయగు బాలాజీరావు వితరణికి, మాళవదేశమున జాగీరులిచ్చి తనకు లోఁబడియుండున ట్లొక చిన్నరాజుగ నొనర్చెను. తరువాత మలహారురావు మఱికొంత రాజ్యము సంపాదించి మాళవదేశముననున్న యిందూరునగరమును రాజధానిగఁ జేసికొని పేరునకు మాత్రము పీష్వాకు లోఁబడినట్లుండి మాటలచేతను, నప్పుడప్పుడంపు స్వల్పబహుమానములచేతను దన లొంగుబాటును దెలియఁజేయుచు, నిజముగ సర్వతంత్ర స్వతంత్రుఁడై యథేష్టగ రాజ్యముఁ జేయుచుండెను. కులమున నీచుఁడగు గొల్లవాఁడయ్యు బాహుబుద్ధిబలముల గొప్పవాఁడై మలహారురావు కొలదికాలమున నొక సామంత రాజగుటయె గాక యెల్లవిధముల నైశ్వర్యశాలియయ్యెను కాని యాతని యుత్సాహ వృక్షమునకు మూలము వదిలించినట్లు భగవంతుఁ డాయన కుమారరత్నమగు ఖండే రావును స్వర్గలోకమున కెత్తుకొనిపోయెను. ఖండేరావు మృతినొందునప్పటికి, శతవృద్ధుఁడై కాటికిఁ గాళ్లుజాపుకొనియున్న తండ్రియు, మాలిరావను నొక మగ శిశువును, గుణవతియు, విద్యావతియునగు నహల్యాభాయి యను భార్యయు గుణ ముక్తాభరణయగు ముక్తాభాయి యను కూతును నుండిరి మలహారురావు మనుమని మనుమరాలినిఁ జూచుకొని పుత్రుమరచి నిండుజవ్వనమున భర్తృహీనయయ్యుఁ బాతివ్రత్యమె ప్రధానముచేసికొని యొంటిపూట భుజించుచు, నేలఁ బండుకొనుచుఁ బుణ్యకార్యములఁ జేయుటచేఁ గాలముఁ బుచ్చుచు వివేకురాలగు కోడలింజూచుకొని దుఃఖము దిగమ్రింగి యెట్టెటో రాజ్యభారముఁ గొంతకాలము మోసెను. తదనంతరమున, గొన్నిదినములకు మలహారురావు కాలధర్మమునొంద మనుమఁడగు మాలిరావునకు మంత్రులందఱుఁ బట్టముఁగట్టిరి. కాని యచిరకాలంబుననె వానికిఁ గాలమాసన్నమగుటచే నతఁడును దండ్రి తాతల దర్శింపఁబోయి హొల్కారువంశము సంతతితో నస్తమించునట్లు మగపురువు లేకుండఁ జేసెను. భర్తయు, మామయుఁ, గుమారుఁడును నించుమించుగ నొకమారు కాలధర్మమునొందుటయు, హొల్కారువంశము నశించుటయు నిందూరు రాజ్యలక్ష్మి తనవలె ననాథయగుటయు, జనులు రాజహీనులై యుండుటయుఁజూచి యహల్య యబలయయ్యు దుఃఖసముద్రమున మునిఁగియు విధిలేక ప్రజారక్షణార్థమై రాజ్యముఁబూనెను. ఇది యామె మంత్రులలో ననేకుల కిష్టము లేదు. ఇష్టము లేకున్నను, దేశ మరాజకమై పరరాజులపాలగుట కన్నులారఁ జూడలేక యహల్యాభాయి యంతటి సాహసముఁ బూనవలసివచ్చెను.

రాణోజీ హల్కారు మృతినొందిన నాల్గవనాఁడు మహూపురమునుండి శ్యామసుందరదత్తు రాధాకాంతు గారిగృహమునకువచ్చి, ఋషికిం దనకుజరిగిన ముచ్చటలను

రాణోజీ మరణవిధమును దన సహాయమును దెల్పెను. శ్యామసుందరదత్తుయొక్క తండ్రియగు పరమేశ్వరదత్తు రాధాకాంతరాయునకుఁ బ్రాణమిత్రుఁడైనందునఁ దన మిత్రుని కుమారుని బాగుచేయవలెనని రాధాకాంతుఁడు శ్యామసుందరునకు నప్పటికి స్వల్పకాలముక్రిందట నెలకు ముప్పదిరూకల జీతముగల యుద్యోగమును జెప్పించి, యతనికి నెవ్వరు బంధువు లచ్చట లేమి, తనయింటనె భోజనమిడుచు వాని నభివృద్ధికిఁ దెచ్చుచుండెను. రాధాకాంతరావు, చనిపోయిన మలహారురావునకు గుండెకాయయు, బహిఃప్రాణమనియును బ్రజలు చెప్పుకొనుటయేగాక వారతనియం దమితగౌరవ ముంచి యతని యాజ్ఞానువర్తులై యుండిరి. రాధాకాంతుఁడు డెబ్బదిసంవత్సరములకన్న నెక్కువవయసుకలవాఁడు అయినను దేహపటుత్వము చెడక బహు దార్ఢ్యముగనుండెను. జీవించియున్నపుడు మలహారురావునకును, నతఁడును మాలిరావును మృతినొందినవెనుక నహల్యాభాయికిని, రాధాకాంతుఁడు తన ప్రాణములు గూడ ధారపోయునంతటి భక్తిగలిగి నిష్కపటియై వర్తించెను. శ్యామసుందరదత్తు రాధాకాంతునియెడలను నంత కృతజ్ఞతఁ జూపుచు రాణీయందు నట్టిభావముంచి పనిఁజేయసాగెను.

వచ్చిననాటిరాత్రి రాధాకాంతరావు శ్యామసుందరుని వెంటఁబెట్టుకొని శ్రీ యహల్యాభాయి రాణీగారిని దర్శించుటకుఁబోయి వాకిటనిల్చి తమవార్త నెఱుంగఁ జేయుమని లోనికిఁ బ్రతీహారినంపెను. లోపలికిరమ్మని రాణీగారి సెలవైనదని సేవకుఁడు వచ్చి తెలిపి యంతఃపురమున నొకగదిలోనికి వారిం గొనిపోయెను. ఆ గదిలో ముత్యాలజాలరువలె నడుమ వేయఁబడిన తెల్లతెరచాటున నల్లని యొక్క బక్కపలచని యంగనయు నామెకుఁ గొంత వెనుకగఁ బదునాఱు వత్సరముల యీడుగల జవ్వని యొక్కతెయుఁ గుర్చిలపైఁ గూర్చుండిరి. రాధాకాంతరావును శ్యామసుందరుఁడును తెరసమీపమునకుఁ జని యానల్లనిస్త్రీకి నమస్కారము గావించి తమకై వేయఁబడిన పీఠములపై సుఖోపవిష్టులైరి. దత్తదివఱ కెన్నఁడు నహల్యాభాయిని జూచియెఱుఁగఁడు కాఁబట్టి, సౌందర్యవతిగాక నల్లని శరీరకాంతిగలిగి సామాన్యస్త్రీవలె సాధారణ వస్త్రములు గట్టుకొని యాభరణములనైనఁ దాల్పక కృశించియున్న యీ యంగనను దన యేలికయగు రాణిగఁ గొంతసేపటివఱకుఁ దలంపక రాణీ యెంతో వైభవముతో నుండుననియు నిఁకముందు వచ్చుననియు నెదురుచూడసాగెను. ఇట్లు వీరిరువురు లోనికరిగి, కూర్చుండినవెనుకఁ గ్రొత్తవాఁడగు దత్తునిఁజూచి పడుచుకన్నెయగు ముక్తాభాయిదగ్గఱనున్న చిన్న గదిలోనికిఁ జనెను. అప్పు డహల్యాభాయి తెరఁదీయించి, దత్తును రాధాకాంతును దేరిపారఁ

జూచి "నీవు మాతో మాటలాడినది బాలుని విషయమే నా" యని యడిగెను.

రాధా — చిత్తము ఈ కుఱ్ఱవాఁడే ఏలిన వారు నాయందెట్టి భావము నుంచినారో, యీ బాలుని యందుఁగూడ నట్టిభావ మూంచఁదగును

అని రాధాకాంతరాయలు మెల్లఁగ నుడువుచుండ రాణికనల కొలుకలనుండి వేడికన్నీళ్లబిందువులు జార నారంభించెను. ఆతఁ డాకస్మికదుఃఖమునకుఁ గారణ మేమని వితర్కించుచుఁ గొంతసేపటికి గద్గదస్వరముతో రాధాకాంతరా విట్లనియె. "అమ్మా యేమిది. ఇట్లు మీరుండుటకుఁ గారణమున్నను ధైర్యమూనక విధిలేదు"

అహల్యాబాయి యతని మాటలువిని యూరటములేక "యీ బాలుని ముఖ మచ్చముగ నాతనివలె నున్నది. హా! మాలిరావూ! నాయనా! నీమరణముచేతనే గదా నేనిట్టి విశ్వాసహీనులగు మంత్రి పశువుల నాశ్రయించుట? హా! తండ్రీ నన్నేకాకిని జేసిపోతివా?" యని యామె విచారించుచుండ లోపల గదిలోనుండి ముక్తసరములవలె బాష్పములు చెక్కులమీఁదినుండి జార ముక్తాబాయి బెలుపై రోదనముఁ జేయసాగెను. రాధాకాంతుఁడు వారి విలాపముచే హృదయము గరుగ గరఁగ నంతవంతఁ దానుగూడ నొంది యనుచితమగు నాకార్యము మానుట పురుషలక్షణ మని కన్నీరుఁ దుడుచుకొని "అమ్మా యేలినవారు విలపింప ధైర్యముఁ జెప్పువారెవరు? మాలిరావు మీగర్భమునఁ జిచ్చు పెట్టి పోయెను. ఇది యాజన్మాంతమును బోవునదియు మరపువచ్చునదియుఁ గాదు ధైర్యము దెచ్చికొన్నను మీరే దుఃఖించినను మీరే. ప్రజలు మీబిడ్డలు. ఆ కుమారుఁడు పోయిన మేమున్నవారము." అని యూరడ్ప రాణి కొంత సేదదేరెను. తరువాత వారిట్లు మాటాడిరి.

అహల్యా — నేను నీవు చెప్పినట్లు ప్రజలనే బిడ్డలుగ నమ్మికొంటిని గాని వారు నాయందు విశ్వాసము లేక రాజ్యమునకు శత్రువులుగాఁ గొందఱున్నారు.

రాధా — అమ్మా అంతటి పాపకర్ములు, నదృష్టహీనులెవ్వరు?

అహ — నేను నీయందును గంగాధర జస్వంతరావునందును నాయాశలన్నియు నిల్పియుంటిని గాని నాయాస —

రాధా — (తొందరతో) అమ్మా నావిషయమై తమకు సందేహమేల? ఇదిగో మీపాదములు సాక్షి. నేను నాప్రాణమునకైనను లెక్కసేయను. నావిశ్వాసము తమకు విశదము.

అహ — నేను నీవిషయము చెప్పలేదు. గంగాధర జస్వంతరావునుగూర్చి. నిన్న నతఁడు నాదగ్గఱకువచ్చి కుమారునిఁ బెంచుకొమ్మని నాకనేకవిధముల నుపదేశ మొనర్చి నేను రాజ్యము పరిపాలించుట ప్రజల కిష్టము లేదని కఠినముగాఁ బలికెను.

పురోహితుఁడును మంత్రియుఁగదా నాకుపకారము సేయుననిదలఁచితినిగాని యిట్లగునని యెన్నఁడెంచలేదు. ఈమాటలు చెవిఁబడ ముక్తాభాయికి మనస్సు మనస్సులో లేక "జస్వంతరావునకును మా యమ్మగారికిని వివాహము లేకయుండవలెనని నాకోరిక. దైవమా! నీవు వీరికి సఖ్యముఁ గలుగఁజేయుము" అని తన మనస్సునఁ బ్రార్థనచేసెను. రాధాకాంతరావు గంగాధరుని విషయమై మొదటినుండియు సందేహము నొందుచుండుటచే నతని యనుమానము రాణి దెలిపిన సంగతులచే ధ్రువపఱచఁబడెను. దత్తు రాణిమాటలకు నర్థము స్పష్టముగా దెలియఁగక, సత్ప్రవర్తనకు నిధివలెఁ గనఁబడుచుండు జస్వంతరావు దుర్మార్గమునకు నొడఁబడునాయని వితర్కింపసాగెను. తరువాత నీ క్రిందిసంభాషణ జరిగెను.

అహల్య— ఇంకను విశేషము లేమి? రాఘోజీ, పాపము పోయినాఁడఁట. దౌలతరావునకుఁ జాలకష్టము సంభవించినది

రాధా—అతని కేగాదు చచ్చెడివాఁడు చచ్చుచు నతఁడొక పిల్లగొంతుకఁ గోసినాఁడు. వివాహమాడి యిప్పటికి నెలకాలేదు. పాపమా భార్యగూడ నిక్కడికి వచ్చినది ఆమె యతిసౌందర్యవంతురాలు

దత్తు—అతి దుర్మార్గుఁడగు దౌలతురావు పాప మామెను బాధించుచున్నాఁడఁట.

అహ — ఏమి! నా పాలనారంభమందుఁ బతివ్రతలకు బాధకలుగునా? అట్లయిన నామీఁద నతని కాగ్రహమువచ్చినను వచ్చుఁగాక. దౌలతరావును నేను మందలించి యామెకష్టమును మాన్పెదను. ఆకష్టమెట్టిదో నాకుఁ దెలియఁజేయుఁడు.

రాధా— వదినగారిని తాను పెండ్లియాడునఁట ఇది మంచిది కాదని మావంటివారు తెలుప నామెకు వివాహముకాలేదని చెప్పెను. ఆమె వివాహమైనదని వైధవ్య మనుభవింప సిద్ధముగనున్నది. అయిన దమ రిందు జోక్యముఁ గలుగఁ జేసికొనవద్దు అతఁడు బలియుఁడు అతఁడు శత్రుగణములోఁ జేరిన మనకు నష్టముకలదు.

అహ— అతఁడు శత్రుపక్షమునఁ జేరినను సరే. నా రాజ్యము పోయినను సరే ఇంత పాపకర్ముని చర్య నేను జూచుచు సైరింపఁజాలను. సాధుబాధ నివారింపకున్న నా రాజ్యమెందుకు?

దత్తు — (తనలో) ఆహాహా యేమి యీమె ధర్మగుణము! ధర్మదేవత యీమెగా నవతరించియుండును దేవుఁ డీమెను రక్షించుఁగాక.

రాధా — అమ్మా! అట్లయిన జస్వంతరావు మొదలగువారిలో నెవ్వరు చేరినారు? ఏమి ప్రతిక్రియ మనము చేయవలయును?

అహ— జస్వంతరావులో దౌలతరావు చేరును. ఇంక నెవరు చేరుదురో తెలియదు. మీరు నాయందు గాఢానురాగు లగుదురని నేను గెలువగలను. నేను శౌర్యము ప్రధానముగఁ గల మహారాష్ట్రస్త్రీనని నమ్ముము.

రాధా— అమ్మా! మీపదములు సాక్షులుగా శ్రీవిశ్వేశ్వరుఁడు సాక్షిగ, నేను నా జన్మాంతము దాక మీయెడ విశ్వాసముగ్గ నుండెద. అబ్బాయీ! దత్తా నీవుఁగూడఁ బ్రతిజ్ఞఁ జేయుము

దత్తు— అఖిలదేవతలు సాక్షులుగ నేను మీయాజ్ఞ నెరవేర్తునని, అట్లు ప్రమాణము చేయుచున్నాను

ఇట్లు వారుపలుక నహల్య సంతోషించి వారి నారాత్రికి వీడ్కొల్పినదయ్యెను.

ఏడవ ప్రకరణము.

గంగాధర జస్వంతరావు నలువదియేండ్లలోపు వయస్సుగలవాఁడు బుద్ధిబలముచేతను, బాహుబలముచేతను, నతఁడు తలంచిన కార్యములెల్ల నిర్వహింపఁగల సమర్థుఁడు. మలహారురావుహోల్కారుకాలమునుండియు నతఁడు పురోహితుఁడును మంత్రియునై వైదిక లౌకిక కార్యముల నమోఘముగ నిర్వర్తించుచు రాజ్యమందిరమునకు మూలస్తంభమైయుండి, యాతఁడు మృతినొందినతరువాత నధికారము నంతయు దనచేత నుంచుకొనవలెనని దురాశ జనియించినందున రాజ్యము నహల్యాభాయి వహించినఁదనయాటలు సాగవని యామెను కుమార స్వీకారము చేసికొమ్మని బలవంతపెట్టసాగెను. కుమారుని బెంచుకొన్నయెడల నతఁడు యుక్తవయస్కుఁడగు వఱకు రాజ్యము మంత్రులచేతులలో నుండుననియు, నందుచే దురాశాపీడితులగు వారిమూలమున దేశమునకుఁ గీడు రాఁగలదనియు, విశేషించి తనకు ముద్దులు మూటగట్టు కొమార్తెయుండఁగా నామెకు రాజ్యమొసగక పరుని నెవనినో తెచ్చి వానికి రాజ్యమును గట్టఁబెట్టుట యనుచితమనియు నెంచి యామె పెంచుకొనదయ్యెను. అందుచే గంగాధరుఁ డాగ్రహించి తనతో నింక కొందఱిని జేర్చుకొని రాణిపైఁ గక్షవహించెను.

వెనుకటి ప్రకరణమునఁ జెప్పఁబడిన సంగతులు జరిగిన మఱునాఁడు రాత్రి గంగాధర జస్వంతరావు భోజనముచేసి తన మిత్రులనిమిత్త మెదురుచూచుచుండెను. అంతలో హరిహరపాండ్యాజీ యను బ్రాహ్మణుఁడు తన యెత్తైన స్థూలదేహము దీపపు వెలుతురులో పెద్దనీడను వ్యాపింపఁజేయవచ్చి „అయ్యా! గోమోజీరావు, దవులతరావు మొదలగువారు సిద్ధముగనున్నారు. వారి నిక్కడికిరమ్మని నేను చెప్పినాఁడను.

వారు త్వరలో రాఁగలరు. తమభోజనమైనదా?" అని యడిగెను. "ఆహా నేను సిద్ధముగ నుంటిని. కాని రఘునాథరా వేమన్నాఁడు? నేను చెప్పమనినట్లు నీవు చెప్పినావా?' అని పాండ్యాజీతోఁ బ్రత్యుత్తరమిచ్చి కొన్ని ప్రశ్నలు వేసెను.

హరి—— ఈ కార్యము రఘునాథరావున కిష్టమే. నీ వెప్పుడు రమ్మనిన నపుడె బండెత్తివచ్చి యహల్యాభాయిని సింహాసనమునుండి లాగును.

జస్వం—— నిజముగా నాతఁ డట్లు వాగ్దానము చేసినాఁడా?

హరి——అతనికి నేను గుండెకాయను నాతో నిజముపలుకునుగాని యబద్ధము పలుకఁడు. నీవు కొంతరాజ్యము నాతనికిచ్చుటకు సమ్మతింతువేని నిన్నే హోల్కారుగఁ జేయునట్లుగూడ నేను చక్కఁజేసినాను.

జస్వం—— ఆహాహా! నాకు నీకంటెఁబరమమిత్రుఁడు లేఁడు. నన్ను హోల్కారుగఁ జేసినపక్షమున నేనతనికి సగమురాజ్యము నిచ్చుట కాశ్చర్యమా కష్టమా? కాని నేను హోల్కారును గావలెనని పట్టింపులేదు ఈ యాఁడుదానిపాలనలో నుండక పోయినఁజాలును ఆహల్యనుజూడ నాయొడలు మండునుగాని ముక్తాభాయిని గనుగొన్న నా హృదయము జాలినొందును.

అని జస్వంతరావును హరిహరపాండ్యాజీయును ముచ్చటించుసమయమున సేవకసమేతుఁడై గోమోజీరావు గుమ్మముదాటివచ్చెను. అంతట జస్వంతరావు మాటలాడవలదని పగవాఁడై దిక్కఁడగు హరిహరునకుఁ గన్నుసన్నఁజేసి ముందుగా "ఓహో! కొత్వాలుగారు కాబోలును. మమ్ముఁ జెఱసాలలో నుంచుటకువచ్చినారా యేమి? ఆయన యెవ్వరు?" అని పరిహాసముగఁ బలికెను. గోమోజీరావు నవ్వుచు "మీరు రాణిపైఁ గుట్రలు గావించుచుండ వారిసొమ్ముదినువారము మేమూరకుందుమా. అయితే దవులతురావు రాలేదా? ఈతఁడు నాస్నేహితుఁడు. ఈతని కాపురము వాసియా గ్రామము. మనకార్యమున కనుకూలుఁడు. ఇతనిపేరు సకారాం" అని చెప్పనంతలో ద్వాపరసమేతుఁడగు కలివలె దౌలతరావు మండిరావుతోఁగూడ గృహము నలంకరించెను జస్వంతరావువారినిఁగూడ సన్మానించి యందఱ మేడమీఁదికిఁ గొనిపోయెను. అందఱు నొకరి నొకరెఱిఁగినవారె గాని సకారాము నెవ్వరు నెఱుంగరు. అతఁడువచ్చి గోమోజీకిఁ గుడిప్రక్కను గూర్చుండెను. అతనియెదుట తమ రహస్యములను మాటలాడుకొన నందఱు సందేహించిరిగాని గోమోజీరాయని ప్రోత్సాహముచే నివారితసంశయులై మూటగట్టుకొనివచ్చిన రహస్యములను విప్పిరి. అప్పుడు వారందఱు నీక్రిందివిధమున మాటాడిరి.

ప్రథమాంకము.

కృష్ణ— క్షమించు ఆజంతువు నెంచక విధిలేకున్నది. దాని అశనఘూలిత్వము నేమని చెప్పుదును! కసాయివానిని కాళ్లు చేతులు జాగ్రత్తయని హెచ్చరిక చేయవలసి వచ్చుచున్నది దినమునకు మణుగుమాంసము వేసినను చప్పరించి, యింకను గాండ్రించుచుండును

విజయ— సరే! చాలును నాతోఁ జెప్పవలసినదంతా చెప్పినావుగదా!

కృష్ణ— ఇంకా లేదు గుఱ్ఱపుసాలలో పెట్టెయొకటున్నది. అందేమున్నదని యడిగితిని. సర్పరత్నము లున్నవని చెప్పిరి సర్పములపయినుండే రతనాలు శ్రేష్ఠమయినవని వాడుకగదా! మన అమ్మాయి కిచ్చుకొఱకే ముసలాతఁడు మన్యపుసర్పములనుండి యీ రత్నాలఁ దెచ్చినాఁడని సంతోషించి మూఁత పయికెత్తిచూతునుగదా! తెగబారెడేసిపొడుగున రెండు క్రూరసర్పము లా పెట్టెయందున్నవి

విమల— కృష్ణతాతా! తినుటకు వానికేమైన వేయించు వానివిషయము యిఁక మా అన్నయ్యతోఁ జెప్పి అతని నాయాసపెట్టకు.

కృష్ణ— అమ్మాయీ! నాకంఠములో జీవముండఁగా అతనిని నే నాయాసపెట్టఁ దలఁపను ఒక్కమాటమాత్రము చెప్పఁగోరినాను ఆజంతువు లిక్కడనె యుండవలసినయెడల, మీఅన్నయ్య త్వరలో చెఱసాలయందుండవలసినదే! ఏమో! ఆ పాడుపాములు కోళ్లనుగాని మఱి వేనిని దినవు. అబ్బాయీ! ఈ లెక్కపత్రముచూడుము ఒక్కొక్కపా మెన్నేసికోళ్లను మ్రింగినదో!

విజ— (అనంగీకారముగా) నేఁజూడను

కృష్ణ— నీవు చూడనియెడల నే నాశ్చర్యపడను పోనీ! కుబేరసేనునికిఁ జూపింతునా?

విజ— వల్లకాదు.

కృష్ణ— (ప్రక్కకు మోముత్రిప్పి) ఎట్లయిన నతనికిఁజూపి తీరుదును.

విజ— ఒక్కమాటే చెప్పుచున్నాను విను. మా చిననాయనకుఁగాని అతని పరివారమునకుఁగాని ఏమేమి కావలయునో వాని నన్నిటిని నీవు జాగ్రత్తచేయవలసినది. తట్టుబడినిగుఱించిన ప్రస్తావమేమియు అతనియొద్దఁ జెప్పక యూరకుండవలసినది.

కృష్ణ— మంచిదిబాబూ!

విజ— అతని సేవకులతోనయినఁ జెప్పఁగూడదు జ్ఞాపకముంచుకో!

కుడివయిపునఁ గుబేరసేనునిగదినుండి— ఓరీ! ఎవఁడురా, అక్కడ?

ఇద్దఱు సేవకులు— (తెరవెనుకనుండి వచ్చుచున్నారు)

కృష్ణ— అతని సేవకులయొద్ద నేమన్నను ఉపద్రవము లేదు. ఏమా? వారితో నే నెపుడు

మాటాడినను ఓ్రధముతో నేదో గొణఁగుదురు నామాట తమకుఁ దెలియలేదని యర్థమయియుండును

కుబేరనేనునిగదినుండి— ఎవఁడురా! గాడిదలార!

సేవకులు— (రంగస్థలమం దొక పడకకుర్చీయుంచి గదిలోకి వెళ్లుచున్నారు)

విమల— ఊరకుండుఁడు చిననాయన వచ్చుచున్నాఁడు కృష్ణతాతా! ఆయనకు నీవల్ల నేమయినఁ గావలెనేమో! వెళ్లక కొంతసేపిక్కడనుండుము.

కుబేర—(ఇద్దఱు సేవకులవయి నానివచ్చి పడకకుర్చీమీఁదఁ గూర్చున్నాఁడు)

సేవకులు— (ఒకఁడు పాదుకముకాయయు, ఒకఁడు చేరుమాలును చేతఁబట్టుకొని కుర్చీవెనుక నిలుచున్నారు.)

విజయ— చిననాయనా! చాలప్రొద్దెక్కినది

కుబేర— ఏమీ ప్రొద్దెక్కలేదు

విమల— అవును! ఏమీ ప్రొద్దెక్కలేదు

కుబే— పిల్లా! అల్లాగనకు మీ అన్నయ్యకు కోపము రాఁగలదు. చాల ప్రొద్దెక్కినది

విజయ— ఏమండీ! పదిగంటలు దాఁటినదే!

కుబే— దాఁటితేమాత్రమేమి? ఇంకా, తొమ్మిదిగంటలకుగాని సూర్యాస్తమయము గాదు నేనెవ్వరితోఁ జెప్పినా ఉదయముననే లేచినానందును

విజయ— చిననాయనా! నిన్ను నొప్పింపవలెనని నా తాత్పర్యము గాదు.

కుబేర — కాకపోవచ్చును. నన్ను నొప్పింపవలెనని యెవ్వనికిని తాత్పర్యము లేదుగాని ప్రతివాఁడును నన్నే నొప్పించుచున్నాఁడు. వాయుదేవునకు నామీఁద నేమియు అసూయ లేదుకాని, తాను వీచుటమాని, ఉక్కపెట్టి నా దరికి రాక నాకు శత్రువయినాఁడు.

విజయ — గాలిని నేను శాసింపలేను. నాయింట నేదైన సదుపాయలోపముండి దానిని తీర్చుటకు సాధ్యమయ్యెనా, మిక్కిలి యుత్సాహముతో సవరింతును

కృష్ణ—(ప్రక్కమొగముగా)అక్కఱలేదబ్బాయి ఈయన కీతట్టు గాలి యీవలేకేకలదు.

కుబేర— నీవు మంచివాఁడవే! అయితే, నా సుఖముకొఱకని చెప్పి ప్రజలు తమ కిబ్బంది కలిగించుకొనుటకు నే నెంతమాత్రము నంగీకరింపను. అయినప్పటికీ నీవు కోరుచున్నావుగనుకఁ జెప్పుచున్నాను విను నా పడకగది సౌఖ్యకరముగాలేదు. అది యేటివార నున్నది

కృష్ణ— (ప్రక్కమొగముగా) అవును. నట్టేట నుండవలసినది

విమల—చిననాయనా! అది మార్చుట సుకరమే! వెనుకగదిలో నీవు పరుండవచ్చును.

కుబే— వెనుకగదులంటే నాకసహ్యము. వానిలో మనుష్యసంచారమే కనఁబడదు.

విజ— ఈ యుత్తరపుదిశ నొకటున్నది దానిలో నిద్రింపవచ్చును

కుబే— ఏమీ! నాకొంప తీయఁదలఁచుకొన్నావే! దాని కిటకీ కొండగాలి కెదురు గాదటోయి! ఎంతభక్తి! నా శరీరము పాషాణమనుకొన్నావాయేమి?

కృష్ణ— (ప్రక్కమొగముగా) ఈ మహానుభావుఁడు వెన్నెలకు వడదాఁకే యేను మల్లెపూవులయెత్తువాఁడండీ! చిన్ననాఁడు బెల్లింతవ్వినశక్తి అంతా పోయినది.

విజ— (చెల్లెలితో ప్రక్కమొగముగా) నా ఓర్పంతయు స నుచున్నది

విమ— (అన్నతో ఆరీతినే) కొంచెమోపికపెట్టు. ఇతఁ డిక్కడ నిఁక చాలదినము లుండఁడు.

విజయ— (చెల్లెలితో ఆరీతినే) ఉండెనా, యేదో పెద్ద కలహము సంప్రాప్తించును

కుబే— మూట్టుదానికివేసినట్లు నా వసారాలోకి పథ్యము పంపుచున్నారు నాకోసము మీరిబ్బందిపడుట నా కెంతమాత్రమును సమ్మతము గాదు. అయినా, నాతో సహపంక్తిచేయుటకు మీకిష్టము లేదుగద!

విమల— (అన్నతో, ప్రక్కమొగముగా) నన్నుత్తరమియ్యనీ! (పయికి) ముఖ్యముగా— నాకు పరమసంతోషము! అన్నయ్యనుమాత్రము క్షమించు అతఁడు కొట్టునొద్దకు త్వరగా వెళ్లవలసివచ్చుచుండును

కుబే— సాయంకాలమయినను నా సహపంక్తికి రాఁగలిగెనా బాగుండును దీపాలు పెట్టినతరువాత భోజనమంటే నా కసహ్యము

విజ— సరే! ఇంతటినుండి రాత్రిభోజనము సూర్యాస్తమయకాలమందే చేయుదము

కుబే— నానిమిత్తము మాత్రము మీరిబ్బందిపడవద్దు.

కృష్ణ— (ప్రక్కమొగముగా) ఏమిసరసుఁడండీ!

విజ— ఇఁక నీనిమిత్తము నేఁ జెయ్యవలసిన మార్పు లేమయిన నున్నవా?

కుబే— ఏమీ? నామనస్సును కలఁతపెట్టుటకే ప్రయత్నపూర్వకముగా ఆమాట అనుచున్నావు నా నిమిత్తమయి యేమీ అక్కఱలేదని యీవఱకే నేను స్పష్టముగాఁ జెప్పియుంటిని అయినప్పటికి, చెప్పుమన్నావుగనుక విను నే నెప్పుడును, మేడపయినిఁ గాపురముండేవాఁడను. నిజము చెప్పనా? మేడలేనిచోటఁ గాపురము నాకు సరిపడదు

విజ— అయ్యో! నాకు మేడయిల్లులేదే!

కుబే— లేకపోయెనా కట్టవోయి! అబ్బాయి! కట్టు! ఒకమేడకట్టు! కాని నానిమిత్తమయి మాత్రము కష్టపడకు.

విమల—చిననాయనా! నీ సుఖముకొఱకు ఏమిగావలసినను, అన్నయ్యయయినను సరే, నేనయినను సరే, శక్తివంచన లేకుండా, చేసి నీ యస్వస్థత మాన్పుటకు—

కుబే—(మాటునడ్డగించి) నాకస్వస్థముగానున్నదని నీకెవరు చెప్పినారు నాకాలాగులేదు

కృష్ణ—(ప్రక్క మొగముగా) మదిమివలన మదికిమాత్రమే స్వస్థత తప్పినది

విమ—అదిగాదు పూర్వమున్నంత దృఢశక్తిలేదనే యభిప్రాయముతోఁ జెప్పినాను.

కుబే—పూర్వము నాకెట్టి దృఢశక్తియుండెనో తెలియుటకు నీకెట్లు సాధ్యము! నేనీదేశము విడిచి యేఁబదిసంవత్సరములయినది

విజ—చెల్లెలి యభిప్రాయమేమనఁగా—ఏఁబదిసంవత్సరములకు పూర్వము నీవు, ఇప్పటికంటె చిన్నవాఁడవని—

కుబే—(కోపముతో) కాను!

విజ—పోనీ! ఆలాగే కానీ! నీమాట కడ్డము చెప్పను (ప్రక్క మొగముగా, చెల్లెలితో) మన మిక్కడినుండి లేచి వెళ్లుదము. ఇఁక నాకు ఒళ్లు తెలియదు

విమ—చిననాయనా! కొంచెము సేపు మేమావలనుందుమా?

కుబే—తప్పకుండా!

విజయ- విమల—(వెళ్లుచున్నారు.)

కుబే—(కుర్చీమీఁదనుండి ప్రక్కకు తిరుగకయే తొందరగాను, బిగ్గరగాను) పొడుము కాయ! పొడుముకాయ!

ఒకసేవకుఁడు—(అందిచ్చును)

కుబే—(వెనుకటివలెనే) చేరుమాలు చేరుమాలు

రెండవసేవకుఁడు—(అందిచ్చును)

కృష్ణశర్మ—(ప్రక్క మొగముగా) ఇంతశాంతచిత్తుఁడయిన యీ యజమానునితో ఈ సేవకు లెంతసౌఖ్యపడుచున్నారు

కుబే—(గట్టిగా పొడుముపీల్చుట నభినయించి తనలో) నామాట కడ్డము చెప్పఁడఁట! నిశ్చయమే! ఎందుచేత? నేను భాగ్యవంతుఁడనని తానెఱుఁగును. ముసలివాఁడనని యెఱుఁగును. అందుచేత నేను త్వరగా చావవలసినదని వానికోరిక! నే నిల్లు వాకిళ్లు విడిచిపెట్టి యేఁబదియేండ్లు దేశాలవెంబడిని తిరిగివచ్చిన దిందుకొఱకే! ఇందుకొఱకే! ఇపుడు నాచేతిలో భాగ్యముండుఁగాక! నేఁ బోఁగొట్టుకొన్న సుఖము తిరిగి రానేరదుగదా! మన్యపుగొడ్డు పడ్డప్పుడు శవకళేబరమును పొడిచి తినుటకు గెద్దలు రామబందులువలె, ఈ దురాశపాతకులయిన బంధువులుమాత్రము చుట్టుకొని యున్నారు

కృష్ణ— తమకు నావల్లఁ గావలసిన దేమైన నున్నదా?

కుబే— నాకు ఎవరివల్లఁ గావలసినదీ, యేమీలేదు. అలాగే నన్నుఁగూడా ఎవరును ఏమీ కోరరని నాకోరిక!

కృష్ణ— తమవల్ల నేమియు నాజన్మముతో అక్కఱలేదు తక్కినవారిమాటయు ఇట్టిదే!

కుబే— నీవు మోటదున్నపోతులాగున్నావు. పో! నీపనిచూచుకో! ఇఁక నాకన్నుల కగపడకు

కృష్ణ—(ప్రక్కమోముతో) ఇఁక తనకన్నుల కగపడవద్దట! ఏమి యుత్తముఁడండీ! (కుడివైపునుండి వెళ్ళుచున్నాఁడు)

తెరయావలినుండి చండసేన— నేను రావచ్చునా?

కుబే— చండసేనవలె నున్నది త్వరగా, త్వరగా! (సేవకులతో) పొండి, దూరముగాఁ బొండి

చండసేన (ప్రవేశించుచున్నది)— ఏమి అల్లుఁడుగారు!

కుబేర— ఓహోహో! చండమ్మత్తగారా? నమస్కారము! నీవు ఖులాసాగా నున్నావుగద!

చండ—ఆ! ముసలిదానను నామాటకేమి? మీదేహములో నెట్లున్నది? ముఖ్యముగాఁ గావలసినవిషయమిది!

కుబే—(ప్రక్కమోముతో) ఎంతదయగలయిల్లాలు! (పయికి) వందనములు! నిన్నటికంటె చాల ఖులాసాగా నున్నట్లే తోఁచుచున్నది

చండ— నామనసిపుడు కుదుటఁబడ్డది నీకు జబ్బుచేసినట్లు పాడుకలవచ్చి యేమి తోఁచినదిగాదు.

కుబే— కలా? నిజముగా? నన్ను కలగన్నావా?

చండ— ఏమొట్టుపెట్టితే ఆమొట్టు! ఆ దుస్స్వప్నముచేత రాత్రి తెల్లవారుదాఁక మరి నిద్రపట్టినదిగాదు మంచముమీఁదనుండి లేవఁగానే యిక్కడికిఁ బరుగెత్తి వచ్చితిని ఉదయాన చలిగాలి వీచెను. అందువల్ల నీవు లేచినదాఁకా మనసు చాలా వేదనపడ్డది

కుబే— నీకు కలలో నేనెట్లు కనఁబడ్డాను.

చండ — (ప్రక్కమోముతో) మనకు మంచిదారి చూపినాఁడు (పయికి) నేను చెప్పితినా నీవు నమ్మవు.

కుబే— నమ్మకేమి?

చండ — పరిహాసమనుకోకు! నీవివాహామఁట! మంగళస్నానమునకు వేణ్నీళ్ళకు బదులుగా, నీళ్లబ్రాహ్మణుఁడు, ఇవమువంటి చన్నీళ్ళబిందె తీసికొనివచ్చి అభిషేకిం దెదు నీళ్ళ గబాలున నీమీఁద గ్రుమ్మరించినాఁడఁట! రాత్రి యీఁదరగాలిగనుక చలియెత్తి నీకు దవడలు దగ్గఱఁబడి మాటలేకపోయినదఁట! నేనే అపుడు శరీరమంతా కాచేసరికి మెలమెల్లగా మాటాడినావఁట!

కుబే— ఇది పరిహాసము

చండ— కాదు నిజము నేఁ జచ్చినట్లే! నేనఖా—

కుబే— (మాటకు అడ్డమువచ్చి) వద్దు వద్దు నమ్ముచున్నాను

చండ— కలలో పెండ్లికూఁతురుకూడ కనఁబడ్డది

కుబే— (సంతోషముతో) ఆ పెండ్లికూఁతురెవరెవరు?

చండ — నేనిపుడు లక్షువరాలిచ్చినా చెప్పను.

కుబే — అత్తా! నిజముగా నావిషయమయి అభిమానించుకొని వేదనపడేవారు ఈ భూమియందొకరైన నున్నారని నాకీవఱకును కలలోనయినా తోఁచలేదు

చండ— మాయలు, మర్మాలు, ఎఱుఁగని ఆఁడువాండ్రకు యోగ్యులయిన తమ బంధువులమీఁద స్వభావసిద్ధముగానుండు ప్రేమ యెట్టిదో నీవెఱుఁగవు

కుబే— ఒక్కపీట తెచ్చివేసెదను కూర్చుండు

చండ— వద్దు! వద్దు (తానే పీట తెచ్చివేసికొని యెడమప్రక్కను గూర్చున్నది)

కుబే— అత్తా! ఆ డంగుల ప్రేమ యెట్టిదో ఆసంగతి కొంత యెఱుఁగుదునని వెనక తలఁచుకొనేవాఁడను ఇంతేకాక, స్త్రీజనానురాగము నాపైని కలిగినదనియే యొకప్పుడు భావించితిని. కాని, నేను మోసపోయితిని అత్తా! (తొందరగా లేచి బల్లగ్రుద్దుచు) నిజముగా నేను మోసపోయితిని (తిరిగి నెమ్మదిపడి కూర్చుండి) క్షమించు నిష్కారణముగా తొందరపడితిని.

చండ— అన్నా! అల్లుఁడా! నిశ్చయముగా నిన్ను నేరపెట్టను నీవంటి యుత్తముని మోసపెట్టుట కాయఁదుదానికేమి పిశాచ మావేశించినది చెపుమా!

కుబే— అత్తా! నా అప్పటిదినములలోకూడాను

చండ — నీ యిప్పటి రూపరేఖావిలాసములు నేనెఱుఁగుదునుగదా! ఇందువల్ల, అప్పుడేలాగుననుండేవాఁడవో గ్రహింపఁగలను

కుబే — (ప్రక్కమోముగా) నేనీప్రాంతమునకు తిరిగివచ్చినతరువాతఁ జూచిన స్త్రీజాతిలో ఉచితానుచితము లెఱిఁగినది యీ బిడయొక్కతెయె! (కుర్చిదగ్గఱకుఁ దీసి, పయికి) తనకు సగమూకాలమయినపిమ్మట, తనముప్పు వెళ్లఁబుచ్చఁదగినవా

రెవ్వరులేకుండ తనకు తానొక్కఁడే యగుట చాల దుఃఖకరముగదా!

చండ—— ఆమాట నిజమే! కాని కుబేరసేయఁడుగారికిమాత్ర మట్టివిచారము పనిలేదు.

కుబే—— నామాట సత్యము అట్టి దుఃఖము ముఖ్యముగా నాకే కలిగియున్నది

చండ—— ఈవిషయములోమాత్రము నీతో నే నేకీభవింపను నిశ్చయముగా నీమాట తప్పు అనుచున్నాను

కుబే—— (ఆశతో) నీకుఁ దెలిసినసంగతులుమీఁదనే యయియుండునా?

చండ—— (పరిహాసముతో) నేను ప్రత్యక్షముగాను స్పష్టముగాను ఎఱిఁగినసంగతుల మీఁదనే

కుబే—— (ప్రక్కమొగముగా) ఆహాహా! (పయికి) నాముప్పు గడపఁగలిగినవారెవరో చెప్పు నా వేడుక పట్టఁజాలకున్నాను

చండ—— (ప్రక్కమొగముగా) ఇప్పు డప్పుడే నా యభిప్రాయముచెప్పితినా రసభంగ మగును (పయికి) ఎవరనఁగా,——

కుబే—— అవును ఎవరో చెప్పు.

చండ—— నీ అన్నకొడుకును, కూఁతురును

కుబే—— ఇంతేనా! నాముప్పుగడుపువారు వీండ్రా? అవును తమకడుపు నించుకొనుటకుఁగాను ఎలుకల ముప్పుగడపే పిల్లులవంటివారు

చండ—— అయ్యయ్యో! వాండ్రు నాలాగు తలఁపకు మన్యప్రాంతములలో జమీందారులయొద్ద పెద్దపెద్ద యుద్యోగాలుచేసి భాగ్యము సంపాదించితెచ్చినావుగదా! ఆభాగ్యమయినా వందలు, వేలు, కాదు లక్షలాదిధనముగదా!

కుబే—— అవును నీతోఁ జెప్పుచున్నాను

చండ—— (ప్రక్కమొగముగా) నాకోరికకూడా, మొట్టమొదట నీసంగతి నిశ్చయముగాఁ దెలిసికోవలెననియే! (పయికి) ఇట్టి లక్షాధికారి, వంచకులయిన యితరులవల్ల మోసపడకుండ తప్పించుకొనుట శక్యముకాదు

కుబే—— శక్యముకాదనియే నేనును భయపడుచున్నాను.

చండ —— అయినా, ఆ భయ మక్కఱలేదు నీభాగ్యవిషయములో నాకేమైన నపేక్షయుండునా? అట్లే నాకంటె ఎక్కువ యపేక్ష నీ యన్నకొడుకునకును, కూఁతునకును లేదు

కుబే—— ఆహాహా! అత్తా! నీవు కాపట్యములేనిదానవుగనుక ప్రతివారిని నీవలెనే యెంచుకొందువు

చండ—— నేనంతయెక్కువదాననుగాను వారియెడల నీకుఁ గనఁబడ్డదోషమేమి?

కుబే — వాండ్రు వినయముఁ జూపుచున్నారు నేనడుగుటయే తరువాయి!

చండ— అది న్యాయమేకదా!

కుబే— కాదు అన్యాయము వారికి ప్రేమ హృదయపూర్వకమయినది కాఁజాలదు ఏమా? నేను కొన్నివేళల మండిపడుచుండును కొన్నివేళలందు చంచలచిత్తముతో నుందును. ఏమన్ననుసరే! నాకు మాఱుమాటాడరు. ఏమికోరిననుసరే, తెచ్చి యిత్తురు.

చండ—ఇంత వినయము అనుమానాస్పదముగానే యున్నది వాండ్రింత పన్నాగము పన్నినారని నేనీవఱకు తలఁపలేదు

కుబే— సందేహమేమి? నిశ్చయముగా అనుమానాస్పదము (పొడుము పీల్చుట నభినయించును) ఒకవేళ అట్లుగాకపోవచ్చును నిష్కారణముగా వాండ్రపట్ల ననుమానపడుట యెందుకు?

చండ— (ప్రక్కమొగముగా) ఓహో! మాఱుఘోరణిలోఁ బడ్డాఁడేమి చెపుమా?

కుబే — నామాట కెదురాడుటకు నేనొప్పనని వాండ్రెఱుఁగుదురు. అందుచేత, నామాటచొప్పుననే నడచినయెడల నేచిక్కులేదని వాండ్రు తలఁచియుందురు ఇఁక వ్యయము మాటకా? మా విజయసేననివంటి స్థితిమంతునకది యొకలక్ష్యము గాదు

చండ— (ప్రక్కమొగముగా) నాకిపుడు తోవదొరికినది (పయికి) అనఁగా, పూర్వమట్టిదే! స్థితిచెడకముందు—

కుబే— స్థితిచెడుటయేమి?

చండ— అతని యాస్తియంతయు పోయి ఋణగ్రస్తమయినమాట నీవును వినియుందువు.

కుబే— ఒక్కమాటయినను వినలేదే! (పొడుము పీల్చుట నభినయించును)

చండ— అలాగయినయెడల ముందుగాఁ జెప్పుట నాకెందుకు!

కుబే— ఎంత చక్కని మర్యాదగల యిల్లాలవమ్మా! కానీ! మా వానిస్థితి చెడ్డదా?

చండ— సంపూర్తిగా—

కుబే — (పొడుము పీల్చుట నభినయించి) ఈసంగతి తెలిసినందుకు నాకు చాల సంతోషమయినది ఏమా? (లేచుచున్నాఁడు) వీని నక్కవినయమునకు హేతు విపుడు తెలిసినది వానివద్ద నేననుకొన్నదానికంటె ఎక్కువమోసమున్నది ఈ దుర్మార్గము—అనగా, తనయింట నాకు బసయిచ్చుటయు, నాకు సర్వసౌఖ్యములు గలుగునట్టు జాగ్రత్తచేయుటయు, దీనికర్థమేమి? నాకు సకలపదార్థములను దెచ్చి యిచ్చుచు, నా మొగముఁజూచుటకు వానికెంతసాహసము చెల్లినది!

స్త్రీ హి తో ప దే శ ము.

ద్వితీయాధ్యాయము
ర జో వి ష య ము.

ప్రథమాధ్యాయమందు స్త్రీలు సర్వదా శరీరారోగ్య విషయమును గమనించవలసిన విషయములను వ్రాసియుంటిని ఈద్వితీయాధ్యాయమందు రజోదర్శనానంతర అవస్థనుగూర్చి కొన్నిముఖ్యాంశములను వివరించుచున్నాను స్త్రీలకు ఈఅవస్థ బహుముఖ్యమయినదిగా నెంచవలెను ఎందువల్లననఁగా రజోవిమోచనము అనఁగా బహిష్ఠయగుట క్రమముగా నగుచున్నయెడల స్త్రీకి గర్భోత్పత్తిఅయి అనుకూలమయిన సంతానము కల్గుటకు సందేహములేదు ఇది క్రమముగా కాకపోవుటవలననే అనేకస్త్రీలు సంతానవతులు కాకయు అయినను దుర్బలసంతానము గలవారుగను ఉందురు. కాఁబట్టి యీవిషయములో ప్రతిస్త్రీయును విశేషజాగ్రత్తనుపుచ్చుకొనుచుండవలెను.

ఈఅవస్థయొక్క పరిమాణము ప్రథమ రజోదర్శనము మొదలుకొని, అనఁగా సమర్తాడినది మొదలుకొని ముట్లుడుగువరకును అయియున్నది. ఈకాలమును మరల మూడుభాగములుగా భాగింపవచ్చును మొదటిది ప్రథమరజోదర్శనకాలము. రెండవది సమర్తాడినదిమొదలుకొని యుక్తకాలావధిని బహిష్ఠ అగుచుండుకాలము. అదే గర్భవతి కాఁదగినకాలము మూడవది ముట్లుడుగుకాలము. ఈకాలమందే తత్త్వమువిశేషముగా భేదించును ఈమూడును బహుజాగ్రత్తపుచ్చుకొనవలసినవే

ప్రథమకాలము- రజోదర్శనకాలము స్త్రీలకు జీవితకాలములో ప్రధానావస్థయని పైనిచెప్పియుంటిని స్త్రీలబాల్యావస్థ రజస్వలకాఁగానే అంత్యమగును ఇందువలననే మనవారు రజస్వలగుటను 'పెద్దమనిషి' యగుటయని వ్యవహరింపుచున్నారు. స్త్రీలకు సమర్తాడుటయే వయఃకాలమునకు ప్రారంభము స్త్రీలయొక్క శరీరస్థితిగాని బుద్ధిబలముగాని రజస్వలఅయినకాలమునుబట్టియే ముఖ్యముగా నిశ్చయింపఁబడుచున్నది అందుచేతనే స్త్రీలకు జన్మకాలజాతకముకంటె రజస్వలాజాతకము ముఖ్యముగా నెంచఁబడును

రజస్వలకాఁగానే వయఃకాలము ఆరంభమయి నప్పటికిని ఆపైని౭-౮సంవత్సరములవరకును సంపూర్ణమయిన వయస్సురానేరదు. అనఁగా మనదేశస్థితినిబట్టి

౧౬ లేక ౨౦ సంవత్సరముల వరకును స్త్రీలు పూర్ణవయస్సు గలవారలయియుందురు. అధమపక్షము ౧౬ సంవత్సరములయినను కావలెను. స్త్రీలకు గర్భాధానము సంపూర్ణ వయస్సువచ్చిన పిమ్మటనే చేయవలెనుగాని ఆలోపున తొందరపడి చేయరాదు. మనదేశములో రజస్వలకాఁగానే పునస్సంధానము చేయుపురభ్యాసము తరుచుగా నున్నది. మరికొన్నిచోట్ల రజస్వలకు పూర్వమందే గర్భాధానము చేయుచేడువాడుకయుచుగలదు అట్లు చేయుటవలన అనేకబాధలు సంభవించుచున్నవి. మొదటిది, అట్టిస్త్రీలయొక్క శరీరము మిగుల దుర్బలముగానుండును. రెండవది, గర్భోత్పత్తి అయినయెడల ప్రసవమగుటలో అత్యంతమయిన బాధకలుగును. అంతచిన్నవయస్సులో గర్భముపూర్తిగావ్యాపించి యుండకపోవుటచేత శిశువు గర్భములో పెరుగుటకుఁగాని ప్రసవసమయమున సులభముగాగర్భములోనుండి వెలుపలికి వచ్చుటకుఁగాని తగినంత సావకాశము ఉండనేరదు. చిన్నవయస్సులోఁ గలిగిన సంతానము వెంటనే మృతిఁబొందునదిగానైన నుండును, ఆరోగ్యము లేనిదిగానైననుండును. కావున అధమము ౧౬ సంవత్సరములువచ్చువరకైన మనదేశములో ఆడుచిన్నదానికి గర్భాదానము చేయకుండనుంచిన మేలుగానుండును. తమఆడుపిల్లలయొక్క క్షేమముకోరు తల్లిదండ్రులు ఈవిషయమయి గట్టిశ్రద్ధ వహించినయెడల తమంతటతాము విశేషసంతోషము గలవారగుటయేకాక లోకమునకుకూడమేలు చేసినవారగుదురు. ఈవిషయములో తెల్లవారిలోఅనఁగాజాతివారిలో కొందరు కొంతమట్టుకు కట్టుడిగానుందురు. వారిదేశములో రజస్వల ఆగుటయే ఆలస్యము. ౧౬ సంవత్సరములు వయస్సువచ్చినపిమ్మట సమర్తాఔదురు. ౨౦ సంవత్సరములకుముందు గర్భాధానముచేయరు. వారిలో ౨౫ సంవత్సరములు వయస్సు వచ్చినయెడల గర్భాధానమునకు యుక్తకాలము. మిక్కిలి సుకుమారలైనటువంటియు రోగిష్ఠులుగానుండునటువంటియు స్త్రీలు వివాహమే చేసికొనరు. ఎందువల్లననఁగా ఆటువంటివారికిగర్భోత్పత్తిఅయినయెడల ప్రాణాంతకమేగాని మరియొకటి కాదు.

యుక్తకాలమువచ్చువరకు గర్భాధానము చేయకూడదనుట మిగుల నావశ్యకమగుట యెందువల్లననఁగా అతిబాల్యమున నుత్పత్తిఅయిన సంతానము మిగుల దుర్బలమగుటయేకాక, అట్టిదుర్బలత్వము క్రమముగా వంశపారంపర్యముగా వ్యాపించి తుదకు "నేలముల చెట్టుకు నిచ్చెనలువేయువారు" అని సామెతలో చెప్పిన రీతిగలవాండ్రు జన్మింతురు.

ఇఁకరజోవిషయమయి ప్రారంభించి వ్రాయుచున్నాను. రజస్రావము ప్రతి

నెలకు అనఁగా నిరువదియెనిమిది దినములకొకసారి సర్వసాధారణముగా కలుగు చుండును. కొందరికి అనఁగా మంచిదేహారోగ్యముగలవారికి ఇరువది తొమ్మిదవ దినమునకే సరిగా నెనుకటిసారి కలిగిన కాలముననే కలుగుచుండును. కొందరు స్త్రీలు మూడేసివారములకొకసారి బహిష్ఠలగుచున్నారు. ప్రతిపర్యాయము మూడు దినములు మొదలుకొని అయిదు దినముల పర్యంతము స్రావము ఉండుచుండును. కొందరికి వారమువరకునుండును ప్రతిపర్యాయమును వెలుపరింపఁబడు రజస్సు అరసోలెడు మొదలుకొని మూఁడుగిద్దలవరకు నుండునని నిదానించఁబడ్డది

బహిష్ఠయగుట క్రమముగా జరుగుచుండని యెడల ఆ స్త్రీకి గర్భోత్పత్తి కానేరదు. ప్రథమరజోదర్శనము ఉష్ణదేశములలోను పట్టణవాసులకును శీతలప్రదేశములలో నుండువారికంటె నెక్కువ త్వరగా సంభవించును ఆరంభమయినది మొదలుకొని ముప్పది ముప్పది అయిదు సంవత్సరముల వరకును ఉండును. రజోదర్శనావస్థ ఉన్నంతకాలము సంతానార్హత కలిగియుండును శరీరారోగ్య దార్ఢ్యములనుబట్టి ౨౬-౫౦ సంవత్సరముల వయస్సువచ్చువరకును బిడ్డలనుకనుచున్న వారక్కడక్కడనుందురు. శీతలప్రదేశములలో ౬౦ సంవత్సరములవయస్సులో కొందరు స్త్రీలు అనుకూలమయిన బిడ్డలను గనినట్లు తెలియవచ్చుచున్నది ఈవిధముగానే అతిబాల్యమందు అనఁగా ౧౧ ౧౨ సంవత్సరముల వయస్సులో సంతానము కల్గుటయును మనదేశములో నెక్కుచోట్లగలదు.

ఎంతశీఘ్రముగా రజస్వలఅయిన అంతశీఘ్రముగా ముట్టుడిగిపోవును మనదేశములో సాధారణముగా ౧౧-౧౨ సంవత్సరములకు సమర్తాడుదురు అక్కడక్కడ సకృతుగా ౯-౧౦ సంవత్సరములకే కొందరైనట్లు కనిపెట్టఁబడినది రషియా మొదలయిన అత్యంత శీతలప్రదేశములలోని స్త్రీలు ౨౦-౩౦ సంవత్సరములకుఁగాని రజస్వలలేకారట అందువలనవారిలో ౬౦ సంవత్సరములు వచ్చిన పిమ్మట సంతానము కల్గుట ఆశ్చర్యకరముకాదు అటువంటి శీతలప్రదేశములలో మరియొక చిత్రముకూడనున్నది. ఏమనఁగా అచ్చటి స్త్రీలు మాసము మాసము బహిష్ఠలుకారు. సంవత్సరమునకు మూడు నాలుగు సార్లుమాత్రమే ఆగుదురు. ఆలాగునయైనప్పటికిని స్రావముకొద్దిగానుండును.

విసర్జింపఁబడు రజస్సురూపముచేతను కొన్నిగుణములను బట్టియు రక్తమువలెనున్నప్పటికిని కేవల రక్తమమాత్రముకాదు ఆరోగ్యముగల స్త్రీల రజస్సు రక్తమువలె నెప్పుడునుగడ్డకట్టనేరదు అది గర్భమందు క్రమక్రమముగాకూడుకొనెడి యొక ద్రవద్రవ్యము. ఇది శరీరమందాయాకోశములలో చేరుచుండు ఇతర ద్రవద్రవ్య

ములవంటిచే ఇదిగర్భములో నున్నంతసేపు కేవలరక్తము వలెనే ఉండను. వెలుపరించు సమయములో జిగురుగల యొక క్షారపదార్థముతో నదికలియుటచేత దానికి గడ్డకట్టుశక్తిపోవును న్యాయముగా అట్లేకావలసినది కొందరికి జబ్బుచేత రజస్సువిశేషముగా వెడలినప్పుడు పూర్వోక్తక్షారపదార్థములో కలియఁజాలకపోవుటనుబట్టి గడ్డకట్టుట తటస్థించును. మంచిదేహారోగ్యముగల స్త్రీలయొక్క రజస్సు యుక్తప్రమాణముగా నుండుటయేకాక చటుక్కున తెగినవేలునుండి స్రవించు రక్తము ఎంతప్రకాశముగల యెఱుపుగానుండునో అంతప్రకాశముగల యెఱుపుగలదిగానుండును

రజస్సు గడ్డకట్టుట యొకదోషము. అదుర్గుణమున్నయెడల బహిష్టయయినప్పుడు అమితమయిన బాధ కల్గుటయేకాక అబాధగల స్త్రీకి అది నివారణమగువరకును గర్భోత్పత్తి కానేరదు. గనుక అటువంటిది ఉన్నయెడల వెంటనే తగినచికిత్స చేయించుకొనవలయును.

ఆరోగ్యముగల స్త్రీలకు యుక్తకాలములయందు రజోవిమోచనము కాకమానదు. అది బొత్తుగా లేకుండ నుండుకాలములు గర్భిణిగానున్నపుడును స్తన్యమిచ్చు కాలమందును మాత్రమెగాని మరెప్పుడునుగాదు అలాగుననే గర్భసంబంధమయిన జాడ్యములు మిక్కిలి దుర్బలస్థితి క్షయమొదలయిన విశేషరోగములు ఉన్నప్పుడుకూడ బహిష్టయగుట జరుగదు

గర్భిణిగానున్నపుడుకూడ కొందరుస్త్రీలు బహిష్టలగుదురని అనుభవముగలిగినవారే చెప్పెదరు. గాని అది సరికాదు ఎందువల్లననఁగా గర్భోత్పత్తి అయినతక్షణము ఒక విధమయిన జిగురైన పదార్థముచేత గర్భముయొక్క అంతరాద్వారము గట్టిగామూసివేయఁబడును. గర్భిణీ అవస్థలో అప్పుడప్పుడు బహిష్టఅగుదినములలోనే తటస్థముయ్యెడిరౌద్రవిస్రావద్రవ్యము బహుస్వల్పముగాను ఒకటిరెండు గంటలు, లేక విశేషకాలమున్నయెడల ఒకదినముకంటె నెక్కువకాలమువరకు ఉండనిదిగాను ఉండుటచేత అదియెంతమాత్రము రజస్సుకాదు. అది రజస్సు ఉత్పత్తిఅగు గర్భాంతరాళమునుండి వచ్చునదికాదు. గర్భము పెరిగినకొలఁది ద్వారమందున్న కొన్నికోశములు స్రవచ్చి వానివెంబడి బయలుదేరు నిజమయినరక్తమే చాలమందిని భ్రాంతిపొందించినది అదినిజముగా గర్భాంతరాళములోనుండియే వచ్చెడియెడల గర్భస్రావమునకు సూచకమని తెలిసికొనవలెను.

కొందరు స్త్రీలు స్తన్యమిచ్చుసమయములో నిజముగాబహిష్టలగుటకలదుగాని అది బహుస్వల్పము- ఆలాగు జరిగినయెడల వారికి వెంటనే గర్భోత్పత్తికూడనగును-

"OUR DUTY TO OUR FILTHY NEIGHBOURS IN SOUTHERN INDIA"

Moral obligations.— ఈయంశమునుగురించి ముందుగా దేహారోగ్యమునకు చెరుపు కలుగచేసికొను వారలను గురించి వ్రాయుదము సాధారణముగా మనలో మాటలవల్లకాకపోయినను చేయుపనులవల్లను ఎవడు ఏమిఅయిపోయిన మనకేమి అనువారలనేకులున్నారు. వారు మనతోడి మనుష్యులయొక్క ప్రాణములను కాపాడుట మనకందరికి విధియన్నమాట మరచుచున్నారు ధర్మశాస్త్రము జీవహింసచేయకూడదని చెప్పుటయేకాక భూతదయ కలిగి ఉండి మనయొక్కయు ఇతరులయొక్కయు ప్రాణములను సంరక్షణచేయుట విధిగా చెప్పుచున్నది మనకందరకు బీదతనముచేతను రోగముచేతను పీడింపబడుచున్నవారి కష్టములను తొలగించి గట్టెక్కించుట విధియైయున్నది మనమట్లు చేయక చూచి చూడనట్లూరకుండిన యెడల సకలవ్యాపకుడయి సమస్తజీవరాసులను ప్రేమతో కాపాడు భగవంతుని యాజ్ఞమీరినవారమయి ఆయనదయకు దూరులమగుదుము. దక్షిణహిందూస్థానములో ప్రతిసంవత్సరము సుమారు నాలుగైదులక్షలమంది సులభసాధ్యమయిన రోగములచేత చనిపోవుచున్నారన్న సంగతి చదువుకొన్నవారికందరికి విశదముయ్యే ఉన్నది మనము ప్రజలతో మీరందరు దేహారోగ్యమునకు హానికలుగచేసికొనక సుఖింపుడని చెప్పినంతమాత్రమున ఏమియులాభము లేదు. మనము శ్రమయనక కృషిచేసి ప్రజాక్షేమమునకు ఆవశ్యకమయిన పనులను చేయింపవలెను మనము నిజముగా ప్రజాక్షేమముకోరువారమయిన రోగులకు మందును మంచిఆహారమును శుద్ధోదకమును ఇప్పించి చెడుగాలిలో నివసించు వారలకు మంచిగాలి వచ్చుసాధనములు చేయించి వారికి దేహారోగ్యమును కలుగచేసి వారిస్థితిని బాగుపర్చవలయును మన పట్టణములయొక్కయు పల్లెలయొక్కయు స్థితి ప్రాణనాశము కలుగచేయు పలువిధములైన తెగుళ్లనుపుట్టించి మననాగరికతకుకూడ అవమానము కలుగజేయుచున్నది.

ఇప్పుడు ప్రజావృద్ధి మనదేశము భరించలేనంత విశేషముగా అగుచున్న స్థితిలో లేమిచేతను రోగముచేతను పీడితులయి చావసిద్ధముగానున్నవారిని ఆదరించ చావకుండ చేయుటవల్ల మనకు లాభమేమియని కొందరభిప్రాయపడుదురు. అది సరికాదు. మనతోడివారి ప్రాణములను రక్షించవలసిన బాధ్యతను గురించి యిదివరకే చెప్పిఉంటిమి మనము జనుల సౌఖ్యముకొరకు ఎంతమాత్రము శ్రద్ధపుచ్చుకొనక వృధాగా ధనవ్యయమెందుకని ఊరకుంటిమేని పట్టణములు పల్లెలు చూడ

నసహ్యములై రోగములు వృద్ధిపొంది చావులు మెండుఅవుతు. ఊరుశుభ్రముగా
నుండనియెడల రోగములు ప్రబలి వృద్ధులను రోగులను బలహీనులనేకాకుండ జబ్బు
పుష్టికలిగి పాటుపడువారినికూడ పరలోకగతులనుచేయును ఇంతేకాక చావగా
మిగిలినవాండ్రైనను ఉత్సాహముగాను బలముగానునుండక వాడిపోయి కాంతిలేని
వారివలె కనపడుదురు. ఇప్పుడున్న గ్రామములలో ఈవిషయములో అశ్రద్ధచేయ
బడిన వనేకములున్నవి ఇట్టిగ్రామను లెంతమాత్రమభివృద్ధిగాలేవు ఈకొత్తాట్టు
ములో ప్రజలదేహస్థితి పూర్వముకన్న జబ్బుపడినట్లు స్పష్టముగా తెలియుచున్నది
దక్షిణహిందూస్థానములో పూర్వమాంగ్లేయులతో సమానముగా యుద్ధముచేసిన
పటాలము లిప్పుడెక్కడను కనపడవు క్రొత్తగా సిపాయిలను కొలువులో చేర్చు
కొను హవల్దారుకు ఇదిబాగుగా తెలియును క్రిందటి సంవత్సరము 2195 గురు
కొలువులో ప్రారంభమున చేర్చుకొనబడిరి. ఇందులో 938గురు అనగా నూటికి
42 మంది కొలువుకు పనికిరారని నిరాకరింపబడిరి కాబట్టి మనము పట్టణములను
గురించి అశ్రద్ధచేయుటవలన జనక్షేమమునకు నష్టమేకాని లాభములేదు. అశ్రద్ధ
చేసినయెడల క్రమముగా జనులు బలహీనులగుదురు ఇప్పుడు మనపూర్వులకన్న
మనముబలహీనులమన్నమాటయందరికి విశదమయ్యే ఉన్నది మనము బాగుగ శ్రద్ధ
పుచ్చుకొని ప్రజల సౌఖ్యముకొరకు ధనవ్యయము చేసినయెడల జనులు రోగము
లేక దృఢముగానుందురు. రోగపీడితులును బలహీనులును బ్రతికియున్నంతమట్టుకు
విశేషబాధలేక కొంచెముత్సాహముగానేయుందురు. ఇంగ్లండు దేశములో పట్టణ
ములు శుచిగానుంచుటవలన విశేషలాభముకలిగినది ఇట్టిశ్రద్ధపుచ్చుకొనుటచేత
ఇంగ్లండుదేశమునకు సంవత్సరమునకు 70000 మంది కూడిక అగుచున్నారు
పదియేనుగురు రోగులకొకడు చనిపోవునని అనుకొన్నప్పటికి పైనిచెప్పిన ప్రతి
క్రియలవల్ల ఎంతమట్టుకురోగనివారణ మయినదో మనమాలోచింపవచ్చును కొం
దరు వితండావాదులు జనులకు సౌఖ్యకరములయినపనులను చేయించుటకు మనము
ధనవ్యయముచేయవలసిన అవసరము కనిపెట్టలేరు ప్రజాక్షేమముకొరకు చేయవల
సిన పనులను గురించి ఆలోచించుటకు వెనుకనొకగొప్పసభ జరిగినప్పుడు ఆస్ట్రియా
దేశపు యువరాజుగారు ప్రతిదేశములో ప్రతిమనుష్యునికి కొంతవెలయున్నదని చెప్పి
నారు మనము ఇండ్లకు భూములకు వానివల్ల డబ్బువచ్చుటచేత ఖరీదుకట్టుదుము.
మనుష్యులసంగతిలోకూడనదేప్రకారముగాఖరీదుకట్టవచ్చును.ఇంగ్లండుదేశములో
జనసమూహమంతకుమేష్టరుఫార్ (Farr) దొరగారుఖరీదుకట్టినారు. మనుష్యునొక్కొ
కనికి 110పౌనులు అనగా సుమారు 1400రూపాయీలుఖరీదుతేలినది. ఒక్క

పురుషులకు మాత్రమే లెక్కకట్టినయెడల 150 పౌనులనగా సుమారు 1800 రూపాయలుతల ఒకటికిఖరీదు తేలినది కాబట్టి మనుష్యులు చనిపోవుట చేత దేశమునకు ద్రవ్యరూపమయిన నష్టము కలుగుచున్నది. ఇదే ప్రకారముగా మన హిందూదేశములో కూడ మనుష్యులకు వెలకట్టవచ్చును. కాని మన దేశములో జననమరణముల లెక్కలు క్రమమయినవి లేనిహేతువుచేత అంతసరిగా వెలకట్టుట కష్టము. అయినను దక్షిణహిందూస్థానములో మనుష్యునకొకనికి సుమారు నూరు రూపాయీలు వెలకట్టవచ్చును మన దేశములో సంవత్సర మొకటికి 3,40,000 మంది సులభసాధ్యములయిన రోగములవల్ల చనిపోవుచున్నారు. కాబట్టి మన దేశమునకు సాలుఒకటికి 3,40,00,000 రూపాయీలు నష్టము కలుగుచున్నట్టు స్పష్టమగుచున్నది. అనగా ప్రతిక్రియలవల్ల నివారణఅగు మసూచి, విషూచి నగ్రైరాజాద్యములవల్ల మనకు ప్రతిసంవత్సరము మూడుకోట్ల నలువదిలక్షలరూపాయీలు నష్టముకల్గుచున్నది వీనినివారణకొరకు ఆసుపత్రులఖర్చులు కాక 7 లక్షల రూపాయీలుమాత్రమే ఖర్చుపెట్టుచున్నాము. గనుక మనము ఈవిషయమయి ప్రస్తుతము ఖర్చుపెట్టు ద్రవ్యము బహుస్వల్పమన్నమాట తేటపడుచున్నది

మనము శ్రద్ధపుచ్చుకొని ప్రజలకు సౌఖ్యము కలుగచేసి ప్రజాక్షయము కాకుండ చేసినయెడల వీరికెక్కడినుండి తిండివచ్చునని కొందరనవచ్చును- మద్రాసు ప్రెసిడెన్సీలో ప్రజావృద్ధియివరకేఅయియున్నదనియు ఇక్కడికే దేశము భరింపజాలకున్నదనియు చాలమంది అభిప్రాయము. కాని కొంచెమాలోచించినట్టయిన ఇదినిజము కాదని మనకేతోచును- ఏమనగా ఇప్పుడున్న పంట నూటికొకపాలు హెచ్చినను ప్రజలకు సమృద్ధిగసరిపోవును- ఇంతేకాక సేద్యములేక బీడులయియున్న భూమి విశేషించి ఉన్నది- మనము పాటుపడితిమేని స్వల్పకాలములో ఇది అంతయు దివ్యమయిన పంటభూములగును- స్కాట్లండు దేశములో పూర్వము కొండలు గోతులు ఇప్పుడు రమ్యమయిన తోటలుగానున్నవి మనదేశములో అట్లు చేయుటకు విశేషము పెట్టుబడి కావలెనది యెందుండివచ్చునని కొందరడుగవచ్చును- స్కాట్లండుదేశములో అడవులు స్వాధీనపరుచుకొని ఫలపర్చుకొన్నవారు సాధారణులు కాని విశేషధనవంతులు కారు- వారలకు వారిభుజబలములు దృఢమనములు తప్ప వేరేయేమిపెట్టుబడిలేదు- వారిభుజశక్తివలననే యీపనినిచేసిరి- ఈపని మనకైనను అసాధ్యముకాదు- కాని యిదినిర్వహించుటకు సర్ జేమ్సుకెయిర్డు (Sir James Caird) దొరవారివలె వ్యవసాయములో విశేషము అనుభవము కలవారు కావలెను- వ్యవసాయములో తెలివిగా పనిచేయించుటకు కేవలపుస్తకజ్ఞానమెంత

మాత్రము పనికిరారు ఇది తెలివితోను అనుభవముతోను మిళితమయి ఉండవ లెను- ఒక్క వ్యవసాయమే కాకుండ ఇతర వృత్తులనుకూడ వృద్ధిచేయవలెను- ఇప్పుడు నూటికి 80 మంది కేవలము వ్యవసాయమువలన జీవనము చేయుచున్నారు- ఇందులో అధమము నాలుగవవంతు అయినను గాజుపనులు, కాకితములు, బట్టలు, కమ్మరము మొదలగు నితరవృత్తు లవలంబించునట్లు చేయవలయును- ఇప్పుడు మనలో కొందరు పైని చెప్పిన వృత్తులను వృద్ధి చేయుచున్నారు- అవి యింకను వృద్ధి కావలెను- అయిన యెడల దేశము ధనవంతమగును- స్ట్యూఆర్టు (Stuart) వంశపురాజులు రాజ్యము చేయునప్పుడు ఇంగ్లండులో ప్రజలస్థితి యిప్పుడు మనస్థితియున్నట్లేయుండినది- అప్పుడు ఇంగ్లండులో నూటికి 80 మంది వ్యవసాయమువల్ల జీవించెడివారు- విద్యాభి వృద్ధి లేక ప్రజలు మూర్ఖులైయుండిరి- బీదలయిండ్లు చాలచెడుస్థితిలో ఉండెను- ఇప్పటివలె వృత్తులు ప్రబలి వర్తకములు సాగలేదు- ఇప్పుడు నేతబట్టలకు ప్రధాన పట్టణమయిన మాంచెస్టరులో అప్పుడు జనసంఖ్య 6000 మంది-బనాతలు, కం బళ్లు మొదలగువానికి ప్రసిద్ధికెక్కిన లీడ్సుపట్టణమునకప్పుడు జనసంఖ్య 7000- కత్తులు మొదలగువానికి ప్రసిద్ధికెక్కిన షేఫీల్డులో 2000 మంది ఉండెడివారు- కమ్మరపుపనులకు విస్తారము ప్రసిద్ధికెక్కి ప్రపంచమంతకు గొప్పఫిరంగులు మొద లైనవానిని విశేషముగా రవాణా చేయు బర్మింగుహాము అనుపట్టణమునకప్పుడు పేరైన లేదు- ఇప్పుడీపట్టణములన్నియు బంగారముతో తులతూగుచున్నవి- కూలివాండ్రు నివసించుటకు మంచిగృహములు అమరినవి- ఇప్పుడు కూలిపనిచేయువారు మునుపు వారములో సంపాదించెడిది ఇప్పుడు ఒకరోజులో సులభముగా సంపాదించుచున్నారు- పాటుపడుటవల్ల ఇంగ్లండు దేశములో జనులు అభివృద్ధిఅయినట్లే ఇక్కడను మనముకావచ్చును- ఎవరైనను మనకు దారిచూపించగలరుకాని మనకు సమస్తము అమర్చిపెట్టలేరు- అయినను మనకొక్క లాభమున్నది- గవర్నమెంటువారు ఇందు లో కొంచెము శ్రద్ధవహించి పనిచేయుచున్నారు- చదువుకొన్నవారిలో యూరోపి యనులు కొందరు మనవారు కొందరిప్పుడిప్పుడే శ్రద్ధపుచ్చుకొనన నారంభించుచు న్నారు- ఇది వృద్ధిఅయి ప్రజలుచాలమంది ఇందువిషయమయి శ్రద్ధపుచ్చుకొని అవసరమయిన పనులు చేయుదురని తలచుచున్నాము-

Filthy condition of towns in southern India —ఇదివరలో ప్రజలస్థితిని బాగుచేయవలసిన బాధ్యతనుగురించి వ్రాసితిమి- ఇక వారిస్థితినిగురించి వ్రాయుదము- దక్షిణహిందూస్థానములో పట్టణములలో ఇరుకుగా ఇండ్లమీదనుం ఉన్నస్థలములు చూచుటకు నంతము అసహ్యముగా నుండను

4 శ్రీ త్రిప్ర - వేంకటాచలము- [సశేషము-]

మృచ్ఛకటికము.

చతుర్థాంకము.

[అంతట చేటి ప్రవేశించుచున్నది]

చేటి—తల్లిగారిపంపున ఆమెయొద్దకుఁ బోవుచున్నదానను! అదిగో! ఆమె చిత్తరువు పలకపైఁ జూడ్కి నిలిపి మదనికతో నేమొ మంతనమాడుచున్నది కాని చేరఁబోయెదను (అని నడుచుచున్నది)

[ఇంతట యథానిర్దేశముగా వసంతసేనయు మదనికయుఁ బ్రవేశించుచున్నారు]

వసం—ఓసీ మదనికా! చారుదత్తునిగారి యీచిత్రాకృతి సొగసుగానున్నదిగాదా!

మద—తగినట్లున్నదిగదమ్మా!

వసం—నీకెట్లు తెలిసెనే?

మద—కాకున్న మీదృష్టి దీనిపై నింత సుస్నిగ్ధముగాఁ దగులుకొనునా?

వసం—వేశ్యాజనాశ్రయమువల్లఁగదా యీయి(దాక్షిణ్యము)చ్ఛకాలు నేర్చి యిట్లు పలుకుచున్నావు మదనికా?

మద—అమ్మా! బోగపువాడలోఁ గాపురము బొంకు (దాక్షిణ్యము) నేర్పులుగదా గఱపును!

వసం—నానాపురుష సంగముచేత వేశ్యాజనమునకు మిథ్యాప్రీతి పుట్టును నిజమే.

మద—ఇందు మీదృష్టియె కాకుండ హృదయముగూడఁ దగులుపడఁగా, నాకుఁ దెలిసినందులకుఁ గారణమడిగెదవేలమ్మా?

వసం—ఓసీ! సఖీజనులు ఉపహసించెదరా? చూతము!

మద—అట్లేల? అబలాజనులు సఖీజన చిత్తానువర్తులుగారా?

మొదటిచేటి—(చేరఁబోయి) అమ్మా! "గవిసెన బండికట్టి ప్రక్కలతలుపులవాఁకిటి కెదుట నిలఁబడియున్నదిగ ఎక్క వెళ్ళుము" అని మీయమ్మగారు చెప్పుచున్నారు.

వసం—ఏమీ! పూజ్యులగు చారుదత్తుఁడుగారు నన్నుఁ బిలువనంపినారా?

చేటి—ఎవరోగాని యాకర్ణిరథముతోఁ గూడఁ బదివేల సువర్ణములుచేయు నలంకారమొక్కటికూడఁ బంపిరి

వసం—అదియెవరోగదా?

చేటి—[illegible] రాజశ్యా[illegible]

వసం—(క్రోధముతో) పోపో! తిరిగి యెప్పటి కిట్లుచెప్పకుమీ!

చేటి—అమ్మా! కనలక ప్రసన్నురాలవుకమ్మా! నా తెచ్చినది సందేశమమ్మా!

వసం—అవును! సందేశమునకే నాకుఁ గోపము!

చేటి—ఇంతకు మీతల్లి గారితో నేనేమని విన్నవింపను?

వసం—నీవుపోయి మాయమ్మతో "నీకు నేను బ్రతుకవలెననియున్నచో ఇట్లు నన్ను మరెప్పుడుఁ జేయఁ బనుపవలదు" అని నామాటలుగాఁ జెప్పు

చేటి—నీకు మనసువచ్చినట్లే! (అనుచు నిష్క్రమింపఁగా శర్విలకుఁడు ప్రవేశించె)

శర్వి—తే॥ గీ॥ త్రోసి నిశపయి వచనీయదోషమెల్ల
నృపతి రక్ష్యులతోఁబాటు నిదురఁ గెల్చి
రేయిమాయంగఁ జంద్రునిచాయ సూర్యు
నుదయమున మందరశ్మిత నిదిగోఁ గంటి.

మరియు

చ॥ గిజగిజలాడఁబర్విడుచు చెగాంధిగ నన్నెవఁడైనఁ జూడనీ
విజనపథమ్మునన్నిలువ వేగముతోఁ గలఁగంటఁగూడనీ
ఋజువులు చూచుకొన్నగతిఁ బోల్చిపొక్కెడునంతరాత్మ యుక్
నిజబహుదోషముల్ దలఁచి నిత్యము మానిసి శంకఁగూరెడున్.

మదనికకొఱకుఁగదా సాహస మనుష్ఠించితిని!

చ॥ ఒకయిలుదూరఁగాఁ బరిజనోక్తి వినంబడి పాటివచ్చి, యిం
కొక గృహమట్టిచొచ్చి యదియోషి దధిష్ఠితమౌట వీడి, వే
ఱొకయెడ రాడ్భటుల్ పొదువ నూర్పకనిల్చితి నింటికొయ్యనా,
నకట! యిటెంతొ మోసపడనయ్యెఁ బగల్ నిశినిద్రలేవడిన్.

(అని నడుచుచున్నాఁడు)

వసం—ఓసీ చేటీ! ఈచిత్రఫలకమును నాశయనగృహమున నుంచి తాటాకు వీవన గట్టి యొకటిగొని వేగరావే!

మద—మీపనుపుచేసెదను. (అనుచుఁ బలకనుగొని వెళ్ళును)

శర్వి—ఇది వసంతసేనగారి లోఁగిలికనుక నిందుఁ బ్రవేశించెదను. (జొచ్చి) ఇందు మదనిక యెచ్చటఁగనిపించునోగదా!

(తాలవృంతముతో మదనిక ప్రవేశించుచున్నది)

శర్వి—(చూచి) ఓహో! ఈబిడయేగా మదనిక!

క॥ ఇది మెయిదాల్చిన రతివలెఁ
బొదలుచు గుణముల విశేషభూతి నొఱయుచున్

మదనుని దత్తప్తము నా
మది గండపుఁ జల్లఁదనము మఱియుం గూర్చెన్.
మదనికా!

మద — (చూచి) అహో! ఏమీ! శర్విలకుఁడుగారా? మీకుఁ గుశలముగలదా? మీరెక్కడనుండి?

శర్వి—చెప్పెదనుగదా. (ఒకరినొకరు సానురాగముగాఁ జూచుకొనుచున్నారు)

వసం—మదనిక జాగుచేసెను! అది యెక్కడఁబోయినది? (చిన్నకిటికినుండిచూచి) ఏమీ! ఎవరితోనో క్రొత్తపురుషునితో మంతనమాడుచు నిలఁబడినది! ఇదేనా! స్నేహాతిశయముతో నిండి నిశ్చలమగు దృష్టినిలిపి యాతనిసొబగులను మనసార గ్రోలుచున్నదిగదా! కాఁబట్టి యొక్కటియనుకోవచ్చును — ఈతఁడు దీనికిఁ గన్నెఱికము పెట్టఁదలఁచుకొన్నాఁడు కావున నిది యభుజిష్యయయి యితని పాలఁ బలువేడుకలందుఁగాత! ఎప్పుడుగాని యెవ్వరికేంగాని ప్రతిచ్ఛేదము గల్గరాదుగదా! కనుక దీని నిప్పుడు నేఁబిల్వనుజాడు!

మద—శర్విలకుఁడుగారూ! చెప్పఁడి!

శర్వి—(శంకపొంది దిక్కులుచూచుచున్నాఁడు)

మద—ఏమయ్యా యిది? శంకితునివలెఁ గనిపించెదవు!

శర్వి—నీకొక చాటుమాట చెప్పెదను! ఇది యెవ్వరికిని జెప్పఁగూడదుసుమా!— ఇక్కడ మరెవ్వరును లేరుగద?

మద— లేరు అయితే, ఏమి?

వసం—ఏమీ! పరమరహస్యమా? అయితే నేవినఁబోను.

శర్వి—మదనికా! వసంతసేన నిన్ను వెలకువదిలిపెట్టునా!

వసం— ఏమి! నన్నుగుఱించిన ముచ్చటగాఁబోఁచుచున్నదే? కనుక నీకిటికి మఱుఁగున మేనుసేర్చి వినిచూచెదను.

మద— శర్విలకా! ఆయమతో నీప్రస్తావము తెచ్చిచూచితిని. అప్పుడామెచెప్పినదేమిటో? నాకు స్వతంత్రతకలచేని, వెలగొరకుండనే నాపరిజనుల నభుజిష్యలంగావించెదననియె సరిగాని శర్విలకా నన్నామెకొల్వునుండి విడిపించుకొనఁజాచెదే? ఇంతటి విభవము నీకెక్కడినుండి వచ్చినదయ్యా!

శర్వి—క॥ పేదఱికము దూలింపఁగ
నీదగు స్నేహంబు నేగణించుతలఁపులోఁ
బాదుకొన నేఁటిరాతిరి
గాదిలి నీకొఱకు నొకతెగవు సలిపితిఁగా.

వసం—ప్రసన్నమయ్యె నీతని యాకృతి సాహసము చేసెనని వినఁగానే గుండెలు వ్రీల్చెడు!

మద—శర్విలకా! ప్రొద్దుటి చద్దిమద్ద బోని ముద్దరాలికతంబున రెండును సంశయములో మునిఁగినవా?

శర్వి—ఏదియు నేదియు?

మద—శరీరమును జరిత్రమును.

శర్వి—ఓసి అపండితురాలా! సాహసకర్మములందుఁ గాదఁటే శ్రీ యెల్లప్పుడు ఎని యుంచును?

మద—శర్విలక! ఏమి! నేఁటితో నీచారిత్రము కళంకితమయ్యెను సుమా! నాకత నింతటి తెంపుపని చేసిన నీవత్యంతవిరుద్ధ మాచరించితివని నేననఁగలనా? మరి?

శర్వి—స్రగ్ధర॥ పూఁదీఁగంబోలి సొమ్ముల్ పొసఁగఁదొడుగు నే ముద్దుపిల్లల్ హరింపన్
భూదేవస్వం బుదగ్రం బలదగు పసిఁడిన్ ముట్టి నేఁ దొంగిలింపన్
దాదుల్ నిద్రించువేళన్ ధనముకొఱకుఁ దద్బాలఁ గొంచుం దాఁటన్
గాదౌనం చెప్డు బుద్ధిం గడుఁ దనివి మరే క్రాలెదన్ దొంగచెయ్యిన్.

కనుక వసంతసేనతో,

ఆ॥వె॥ నీదు మేని యొంది నిర్మించినది యలం
కారమిదియు నప్రకాశముగను
దోఁచుబుద్ధి పొడమి నాచోటి నేయొనఁ
గొనుగ వలయుఁ జుమ్ము పడఁతి మిన్న

అని విన్నవింపవె

మద—శర్విలక! నీ తెచ్చినయలంకార మప్రకాశమందువు, ఆమెయో బహుప్రసిద్ధురాలు ఈరెంటికిని సరిపడదే అయినను, జేరరమ్మి నీయలంకృతిని జూచెద.

శర్వి— ఇదె యలంకరణము. (అనుచు సాశంకముగా సమర్పించుచున్నాఁడు)

మద—(పరికించిచూచి) ఈయలంకారము మున్నెన్నఁడో చూచిన దానివలెనున్నది కనుక నీకిదెక్కడదొరికెనో చెప్పఁగదయ్యా!

శర్వి—మదనికా! ఆమాట నీకేందులకు? నీవు గ్రహింపవె!

మద— (రోషపడి) నాకు నమ్మకమియకుండెనని నన్నేందుకై సొమ్మిచ్చి దక్కించుకొనెదవయ్యా?

శర్వి—ఓసీ!— తెల్లవాఱినతరువాత నీపొద్దుటిపూఁట సెట్టికూడలిలో సార్థవాహుఁడగు చారుదత్తుని సొత్తిదియని యెవ్వరో యనఁగా వింటిని. (వసంతసేనయు

మద కయు మూర్ఛిలునట్లు గనిపించిరి) మదనికా! మూర్ఛఁదేఱుము!—ఏమీ! ఇప్పుడెట్లుంటివి?

తే॥ గీ॥ నీవిషణ్ణత ప్రీతె సర్వావయవము
లధికసంభ్రమమునఁ గన్నులదరెభ్రాంతి
నిన్నునే నభుజిష్యఁగా నెన్నిన, నను
కంపఁజూడక యూరక కంపితెదవు!

మద—(తెప్పిరిలి) ఓయీసాహసికా! నేనుగారణముగా నింతటి యకార్యకరణము నకుఁ జొచ్చిన నీవాభవంతిలో నెవ్వరినైనఁ జంపలేదుగదా? మరెవ్వరికైన గాయములు చేయలేదుగదా?

శర్వి— మదనికా! భీతునిని నిద్రితునిని శర్విలకుఁ డెన్నఁడును బ్రహరింపఁడు; కావున నాయింట నెవ్వఁడును జావలేదు, ఎవ్వనికిని గాయములు తగులలేదువే!

మద— సత్యమేనా?

శర్వి— సత్యమే

వసం—(ఒడలుదెలిసి) అద్దిరా! తిరిగి బ్రతికితిని!

మద— ప్రియముగదా!

శర్వి—(ఈర్ష్యతో) మదనికా! ప్రియమని వేరచెప్పవేలె?

తే॥ గీ॥ పూర్వపురుషులు సద్వృత్తిఁబొందియుండ
ఖ్యాతివడసెన కులమునఁ గలిగినేఁడు
నీదునేయాన మదిఁగట్టికాదు నాక
కానిపని చేసికొంటిని గంతుగాసి
గుణముపోయిన స్నానముగోలుపోను
జెలిని నను ద్రోసి లాఁతినివలచెదేలె?

(సాభిప్రాయముగా)

క॥ కులపుత్ర మహావృక్షము
లిలసర్వ స్వఫలవృద్ధి హెచ్చుచు వేశ్యా
కులఖగభక్షితమైని
ష్ఫలత్వమును బొంపుచుండుఁ బరికింపంగా.

క॥ కనసురతజ్వాలంబును
బ్రణయే దనమైన కామవహ్నిని నిత్యం
బును వేల్వఁబడెదుఁ జూమా
వనములు ధనములును నరులు పాల్వడినిలువన్.

వసం— (సస్మితముగా) అహో! ఈయనకుఁ గోపావేశముతోడి చిత్తభ్రమము
యుక్తకాలముగా నప్పుడువచ్చినది!

శర్వి—ఎన్నివిధములఁజూచినను—

క॥ శ్రీలును నారులుఁదలఁపఁగఁ
వాలాయముపాఁప కన్నెవరుసను జరుగన్
శ్రీలను స్త్రీలనునమ్ముట
బాలిశులే పురుషులనుచుఁ బలుకఁగవలెనే.

తే॥ గీ॥ రాగమును స్త్రీలయెడలఁ జేయరాదుసుమ్మి
రక్తపురుషుల స్త్రీలు పరాభవింత్రు;
రక్తయగునేని స్త్రీ తగు రమణమునకు
వదలఁదగుఁ గామిని విరక్తభావయేని.

కనుకనే మనవారు బాగుగాఁ జెప్పినారు; ఏమని?

ఉ॥ విత్తముఁజిమ్మనవ్వెదరు వెచ్చములోఁ బడవెక్కి పోక్కెదర్
హత్తినవాని నచ్చికలనప్పుడె లోఁగొని నమ్మరాతనిం
బొత్తుపడంతు రిట్లగుట భూరిసుశీల సమన్వితాన్వయా
యత్తజనుల్ శ్మశానకుసుమాళులఁబోలెఁ ద్యజింత్రువారలన్.

ఇంతేకాదు.

తే॥ గీ॥ కడలి తఱఁగలవలెఁ జలించెడు ప్రకృతులు
సంజమబ్బుల చీలికచందమున ము
హూర్తరాగంబునాలయు స్త్రీలొడిసిధనము
విడతురు నిరర్థుఁబురుషుఁ బిడిచిపిడిచి
లత్తుకను బాఱవైచెడు బాగుమీఱ.

స్త్రీలనఁగాఁ జపలలుగారా?

క॥ ఒకనికి హృదయంబొసఁగుచు
నొకనిపయిం దృష్టివఱపి హొయలునెఱపి వే
ఱొకయెడ మదసేకంబిడి
యొకనిని మేయిచ్చి సుఖమునొందింత్రు బలే!

ఇందుచేతనే యెవరికో వీరిగుణము మనసునకెక్కి యిట్లువ్రాసినారు

క॥ మలతలను నలినియవునే
యలవడునే గుబ్బపుఎరు వలగాడివకున్

మొలచు నెవరిచల్లఁగ యువ
తిల బోగపుఁజేఁటు పడఁతి యేలాశుచియా?

ఓరీ! దురాత్ముఁడా! పాడు చారుదత్తుఁడా! వాఁడు నీవుగావుగదా! (అని కొన్నియడుగులు నడుచుచున్నాఁడు.)

మద—(ఉత్తరీయపుఁగొన పట్టుకొని) ఓయీ! అసంబద్ధ సంభాషకా! అసంభావనీయమందుఁ గోపగించెదేల?

శర్వి—సంభావనీయము కాకపోవుటేల?

మద—ఈయలంకారము మా అమ్మగారి సంబంధిగదా!

శర్వి—అయిన ఏమి?

మద—ఇది పూజ్యులయినట్టి యాయనయొద్ద నిక్షేపముగాఁ బెట్టఁబడినది.

శర్వి—ఏమని?

మద—ఇట్లని (చెవిలోఁ జెప్పుచున్నది).

శర్వి—(వైలక్ష్యముతో) అయ్యో! ఎలతకష్టము!

క॥ వేసంగియెండ వడఁబడి
గాసిలి నీడకయి యెలుఁగకయచేర మహా
యాసముతో నకటా నా
యాసలుచెడఁ బెట్టు నాకులన్నియు రాలెన్!

మద—ఏమీ! ఈతండు సంతాపము గూరెడునా? అయిన నితఁడు తెలియక యీ పని చేసియుండును.

శర్వి—మదనికా! ఇపుడు నేనేమిచేయఁదగును?

మద—ఇందులో నీవేపండితుఁడవు.

శర్వి—అట్లుకాదు. చూడు.

క॥ అరయ నిసర్గజమెప్పుడు
నరుదగు పాండిత్యమబ్బు నజ్ఞాతునకున్
బురుషుల పాండిత్యమ్మో
యురు శాస్త్రాధ్యయనమున సముపదేశ్యంబో

మద—శర్విలకా! నాపలుకులు వినెదవా ఆమహానుభావునకే యిది తిరిగిమ్ము!

శర్వి—మదనికా! అతఁడు నామీఁద రాజకులములోఁ జెప్పునే?

మద—చందమామ యెండగాయఁడులే.

వసం—లెస్సగఁజెప్పితివి మదనికా! లెస్సగఁజెప్పితివి!

శర్వి—మదనికా!

ఉ॥ భీతి విషాదముల్ హృదయవీధి జనింపఁగలేదు నాకు నీ
రీతిని సాహసం బుపచరించిన దానికి నీవ దేలకో
యాతని సద్గుణాళి కొనియాడెను, కుత్సితకర్మ చేసి నా
చేతసులజ్జఁగూరెడును జెప్పఁగదే ననుబోటి కూళులన్
భూతలనాథుఁ డెవ్వలనఁబోవుచు శిక్షయొనర్పఁజూచునో!

అయ్యో యిది నీతివిరుద్ధముగదా! ఉపాయాంతరము వెదకెదనుగాక!

మద—అదియే మరొక్క పెరవు?

వసం—ఇతరోపాయ మేదియై యుండును?

మద—పూజ్యులగునట్టి యాయనసంబంధినని చెప్పి నీయలంకారము నీయమయొద్ద కుం గొనితెమ్ము.

శర్వి—అట్లొనర్చినయెడ నేమిగలుగును?

మద—నీవు దొంగవుకావు. ఆయయ్య యిదియచ్చవలసియుండదు, హా అమ్మగారికి నిజాలంకారమును దొరకును.

శర్వి—ఓసీ! ఇది యతిసాహసముగాదఁటే?

మద—ఓయీ! కొంపోయి యర్పింపు. కాదేని యతిసాహస మగ్యోడునఁజుమా!

వసం—సాధు! మదనికా! సాధు! అభుజిష్యయే మత్రించినది!

శర్వి—క॥ నిన్నను గమించునాకున్
సన్నుతమగు గొప్పబుద్ధి జనియించెఁగదా!
వెన్నెల మాసినరాతిరిఁ
గిన్నులకును ద్రోవఁ జూపఁగలవాఁడేఁడీ?

మద—అయితే నీవొక్క మహూర్తము ఈకామదేవాలయమందు నిలు. ఇంతలో నీరాక యామెకెఱిఁగించి వచ్చెదను.

శర్వి—అట్లేకానీ!

మద—(చేరఁజని) అమ్మా! ఇదుగో! చారుదత్తునిగారి దగ్గఱనుండి బ్రాహ్మణుఁడు (ఒక్కఁడు) వచ్చినాఁడు.

వసం—ఆయనగారి సంబంధియని నీవెట్లు తెలిసికొంటివే?

మద—ఆత్మసంబంధులనే నేను దెలిసికొనలేనా?

వసం—(తనలోఁ దలయూఁచి నవ్వి) తగునుగదా! (పైకి) లోపలికిరమ్మను!

మద—అమ్మగారియాజ్ఞ (అనుచుఁబోయి) శర్విలకా! ప్రవేశించు [illegible]

జంతుస్వభావచరిత్రము.

ఈలోకములో స్థలమును, జలమును, వాయువును, సర్వమును జంతుమయమయి యున్నది. ఈజంతువులు భూతదర్శకాదుల సాహాయ్యములేక దృష్టికిఁగానఁబడనంత చిన్నవి మొదలుకొని యేనుఁగుకంటెను పెద్దదగు తిమింగిలము వఱకును నానావిధరూపములతో నానావిధపరిమాణములు కలవిగా నుండును. జంతుశాస్త్రజ్ఞులీజంతువులను వంశాస్థిమంతములు, మృదుశరీరవంతములు, సంధిమంతములు, మొదలగు కొన్ని ముఖ్యభాగములుగా భాగించియున్నారు. వంశాస్థిమంతములనఁగా వెన్నెముక గలవి. మనుష్యుఁడు, మృగములు, పక్షులు, పురుగులు, చేపలు, ఈ తరగతిలోఁ జేరినవి. మృదుశరీరవంతములనఁగా మెత్తని దేహముగలవి. నత్తలు, జలగలు, ఎఱ్ఱలు, మొదలయినవి యీతరగతిలోఁ జేరినవి. వీనిలో నత్తలు మొదలయినవానికిఁ గొన్నిటికి పైనిచిప్పలుండును, కొన్నిటికుండవు. సంధిమంతములనఁగా కణుపులుగలవి. పీతలు, సాలెపురుగులు, కణుసరిగలు, మొదలయినవి యీతరగతిలోఁ జేరినవి. వంశాస్థిమంతములు సస్తనజంతువులు, పక్షులు, సరీసృపములు, చేపలు, అని మరల నాలుగంతర్భాగములుగా విభాగింపఁబడినవి. మనుష్యులు, మృగములు, కోఁతులు, గబ్బిలములు, తిమింగిలములు, సస్తనజంతుజాతిలోనివి. సస్తనజంతువులనఁగా తమపిల్లలకు పాలుకుడిపి పెంచు జంతువులు. సస్తనజంతువులలో నించుమించుగా రెండువేలజాతులున్నవి. ఈజాతులలో నెల్లను మనుష్యజాతి మిక్కిలి ప్రధానమయినది. అయినను మనుష్యజాతినిగూర్చి శారీరశాస్త్రము మొదలయిన బహుశాస్త్రములు వివరించునుగాన మానవేతరజంతువులను గూర్చియే యిందుఁ జెప్పఁబడును. సస్తనజంతువులలో మనుష్యుఁడు ద్విహస్తజంతువు, కోఁతులు చతుర్హస్తజంతువులు; మృగములు చతుష్పాదజంతువులు.

చతుర్హస్తజంతువులు.

చతుర్హస్తజంతువులనఁగా నాలుగు చేతులుగల జంతువులు. కోఁతిజాతికే మాత్రము నాలుగు చేతులుగలవు. అవి మనుష్యుని చేతులంత మహోపయుక్తములు కాకపోయినను, కోఁతులచేతులు కాళ్ళవలె నడుచుటకును చేతులవలె వస్తువులు కొమ్మలు మొదలయినవి పట్టుకొనుటకును కూడ నుపయోగించును. ఈ కోఁతిజాతిలోఁ గొన్నిటికి తోకలుండవు; కొన్నిటికి పొట్టితోకలుండును; కొన్నిటికి పొడుగుతోకలుండును.

తోఁకలేనికోఁతులు వాలిడికోఁతులనఁబడును. కోఁతిజాతిలో నెల్లను మిక్కిలి పెద్దవియు బలిష్ఠములయినవియు వాలిడికోఁతులలోనే యున్నవి. సుమిత్రాద్వీపమునందును మలయదేశమునందును మనుష్యునంత యున్నతమైన యొకజాతికోఁతులున్నవి. మలయభాషలో ఆకోఁతికి "ఉరాంగుఉటాఙ్" అని పేరు. అందమున

కడవిమనుష్యుఁడని యర్థము. అడవిమనుష్యుఁడని పేరున్నను, రూపమునందు దానికిని మనుష్యునికిని మిక్కిలి భేదముగలదు. అది నిలువుగానిలుచున్నపక్షమున మిక్కిలి దీర్ఘములైన దానిచేతు లించుమించుగా భూమిని తాఁకుచుండును, దానికాళ్ళుకూడ పొడుగైన బొట్టనవ్రేళ్ళునుగలిగి చేతులవలె నుండును. అది నాలుగు కాళ్ళతోను చెట్లనెగఁబ్రాఁకి, అడవిలో క్రిందికిదిగకుండ నొకచెట్టునుండి యొకచెట్టుమీఁదికి ఊఁగుచుమిక్కిలి యెంతదూరమైనను బహువేగమున పోఁగలదు. అది తోఁకలేకపోవుట చేతను పరిమాణముచేతను మనుష్యునివలెఁ గానఁబడినను, అది యూతకోల మొదలయిన యాధారము లేక నిలువుగా రెండుకాళ్ళతోను సుఖముగా నడవలేదు; అది యొకచెట్టును డి క్రిందికి దిగినపక్షమున రెండవచెట్టు చేరువఱకును నాలుగుకాళ్ళతోను నడుచును. దానిమూతి మనుష్యముఖమువలెఁగాక మిక్కిలిపొడుగుగా నుండును; దాని శరీరమునిండను రెండుమూడంగుళముల పొడుగుగల వెంట్రుక లుండును. ఈప్రక్కను వేయఁబడిన దానిపటమును జూచినచో దానిరూపము కొంతవఱకు బోధపడవచ్చును. ఈకోఁతు లయిదడుగులకంటె నెక్కువ యెత్తుగా నుండును; వానిబలమును మిక్కిలి యధికమయినదే. ఈజాతి యాఁడు కోఁతియొకటి యనేకములైన బలమైన గాయములఁదగిలి దుర్బలమయినతరువాత సహితము దృఢమయిన బల్లెమునూడఁబెఱికి పూరిపుడకవలె ముక్కలుముక్కలుగా విఱిచివేసినది. ఈ జంతువులకు గోళ్ళును పండ్లును ముఖ్యమయిన యాయుధములు. పులిమొదలయిన ఘాతుక



మృగములకువలె వానినోటిలో రెండు పెద్దకోఱలుసహిత ముండును. వానినిజూచి చిఱుతపులిసహిత మెదిరింప సాహసింపదని చెప్పుదురు. ఈకోఁతులు తాము వసించుటకు చెట్లమీఁద నొకవిధమయిన గుడిసెలను నిర్మించుకొనునుగాని వానికి పైకప్పుండదు. వేఁటగాండ్రీకోఁతిని పట్టుకోఁదలఁచినపక్షమున, అది వసించియుండు చెట్టుచుట్టునుగల వృక్షములను మొట్టమొదట నఱికి పాఱిపోవుట కవకాశము లేకుండఁజేసి, తరువాత అదియున్నచెట్టును నఱుకుదురు. అది దబాలున క్రిందపడి పాఱిపోలేక సొమ్మసిల్లియున్నప్పుడు దానిని వెంటనే త్రాళ్ళతోఁగట్టిబంధింతురు. అదిసాధారణముగా సాధువుగానేయుండునుగాని కోపమువచ్చినప్పుడుమాత్రము మిక్కిలి భయంకరమయినదగును. కొందఱు వేటకాండ్రొకప్పుడు పట్టుకోఁ బ్రయత్నించినప్పుడు, ఒకకోఁతి యందొకనికి రెండువ్రేళ్ళు మొదలంట కొఱికివేసి మొగముమీఁద పెక్కుగాయములుచేసి విడిపించుకొని పాఱిపోయినది. దానిముఖము మొదు

తలుపడి, తృప్తిలేని ముసలిలోభివాని ముఖమువలెనుండును. పెంచినప్పుడది మచ్చికపడి చిన్నతనములో మిక్కిలి వినయముగా నుండునుగాని యెదిగినకొలఁదిని దాని కల్లరిచేష్ట లెక్కువగును. అది మనుష్యులు చేయుచుండఁగాఁ జూచినదాని నెల్లను చేయును. పెంచిన యీజాతి కోఁతియొకటి తానుపరుండుటకు బట్టలు మొదలైనవి తెచ్చి దులిపి ప్రక్కవేసికొనుటయేకాక చలికాలములో కంబళ్ళు మొదలైనవి దొంగిలించి తెచ్చి పాన్పువేసికొనుచువచ్చెను. అది మనుష్యుఁడు చేసిన పనినెల్లను జేసినను, దానికిమనుష్యునకుఁగల బుద్ధిమాత్రము లేదు. అది మంటచేసియున్నపక్షమున నిప్పు దగ్గఱఁగూరుచుండి చలిఁగాచుకొనునుగాని నిప్పులారిపోకుండ క్రొత్తపుడకలు వేయుట దానికి దెలియదు. అడవిలోనున్నప్పు డీజాతికోఁతులు మందలుగా నుండక వేనికవి ప్రత్యేకముగా నుండును. ఆఁకలిచేత మేతకు వెడలునప్పుడుతప్ప, అవి తమస్థానమునుగదలక సోమరులయి యుండును.

ఆఫ్రికా ఖండములో నింతకంటెను పెద్దదగు కోఁతిజాతియొకటిగలదు. ఆ కోఁతులను మహావానరములందురు. అవి యాఱడుగుల వఱకును ఎత్తుగానుండి చాలవఱకు మనుష్యులను పోలియుండును. జంతుశాస్త్రజ్ఞు లీకోఁతిని "గోరిల్లా" యని చెప్పుదురు. ఇవి ఆఫ్రికాఖండముయొక్క పడమట గాబూనునదికి సమీపమునందున్న యరణ్యములలో వాసముచేయును. మహాబలసంపన్నములయిన యీమహావానరముల ముఖములు కొంతవఱకు మనుష్యముఖములను బోలియున్నను వానివలె సౌమ్యములుగాక వ్యాఘ్రముఖములవలె భీకరములయి యుండును. భల్లూకమునకువలె వీనిదేహమంతయు రెండుమూడంగుళముల నిడుపుగల నల్లని దట్టమైన వెండ్రుకలతో నిండియుండును. కడుపుమీఁదమాత్రము బొచ్చుకొంచెము పలచగానుండును. ఈ మహావానరము కోపము వచ్చినప్పుడు పులివలె గర్జించుచు మీఁదఁబడి మనుష్యునివలె వెనుకకాళ్లమీఁద నిలువఁబడి నాలుగుకాళ్ళతోను పట్టుకొని శత్రువును కొఱికి ముక్కలుముక్కలుగా చీల్చివేయును. అదిచేతితో నొక్కదెబ్బ కొట్టినపక్షమున మనుష్యుఁడు చచ్చిపోవును. ఆప్రాంతములయందుండెడి యాటవికు లీజంతువునకు సింహమునకంటె నెక్కువగా భయపడుదురు. ఈకోఁతి యితరులకు కనఁబడకుండ కానవృక్షములయొక్క దట్టమయిన కొమ్మలలో దాగియుండి, ఆదారిని వచ్చెడి మనుష్యులను కనిపెట్టిచూచుచుండి, అదియున్న చెట్టుక్రిందినుండి యెవ్వఁడయిన నడుమట తటస్థమయినపక్షమున తన వెనుకటికాళ్ళను క్రిందికిజాఱవిడిచి మెడపట్టుకొని యామనుష్యుని చంపి క్రిందపడవేయునని చెప్పుదురు. ఈకోఁతులను గూర్చి యద్భుతములయిన కథలనేకములు చెప్పుదురుకాని వానినిగుఱించి యింకను మనుష్యునకుఁ జక్కగా తెలియమిగనుక, అవి యెంతవఱకునిజమో నిశ్చయింపవలనుపడదు. ఆప్రాంతములయందు వాసముచేయు మూఢులవిమనుష్యులనియ్యు.

ఇతరులు తమ్ము దాసులనుగాఁ జేయకుండ తప్పించుకొనుటకయి యరణ్యములలోఁ జేరి యట్లుండెననియు, నమ్ముచున్నారు. అవి మిక్కిలి సత్వసంపన్నములయిన జంతువులై నను వానికి వయస్సుముబట్టి దేహబలము హెచ్చినకొలఁదిని బుద్ధిబలము తగ్గుచుండును. అంతేకాక యవి మందలుగానుండక వేఱు వేఱుగా నివసించును. ఇంత శరీరబలము గల జంతువులు బుద్ధిబలముగలవై సంఘీభవించి యున్నపక్షమున, తుపాకులు మొద లయిన యాగ్నేయబాణములు లేని చుట్టుపట్లజనుల నవి యనాయాసముగా నాశ నము చేయఁగలుగునని యెంచియె సర్వదయాపరుఁడయిన యీశ్వరుఁడు వాని కైకమత్యమును బుద్ధిబలమును లేకుండఁ జేసియున్నాఁడు.

ఈ గోరిల్లాజాతికోఁతులు వసించెడి యరణ్యములయందే "చింపంజీ" యనఁ బడెడు మఱియొకజాతి పెద్ద వాలిలేనికోఁతులు గలవు. వీనిని చితుకముక్కులు. ఇవి కొండకోఁతు లనఁబడును. ఇవి సాధారణముగా మందలుగానుండి గుహలయందును పర్వతములలోను వాసము చేయును. ఇవి "గోరిల్లా" జాతి కోఁతులవలె నంత భయం కరములయినవి కావు. అయినను ఇవి సంఘీభవించి ధైర్యముతోను సాహసముతో ను పోరాడునుగాన వీనిధాటికి నిలువలేక యేనుఁగులు సింహములు మొదలయిన పెద్దజంతువులుసహితము పలాయనములగును. ఇవి నాలుగయిదడుగుల యెత్తువఱకు పెరుగును. ఇది నల్లనిరూపముతో బహువిషయములయందు "ఉరాంగుఉటాను" ను పోలియుండును. ఈ మనస్సుసహిత మిదిదానికి తీసిపోవునటనాను. ఒకసర్యాయ మీకోఁతి గొలుసుతో చెట్టునకుఁ గట్టివేయఁబడి యుండఁగా దాపునకుఁ బోయిన యొకభటుని వంకనెత్తుకొని చెట్టునకెగఁబ్రాఁకినది. ఇంతబలమున్నను, ఇవి యొం టిగా నేజంతువును తోడిజంతువుల తోడ్పాటు లేక యెదిరింపదు. ఈజంతువులు పో రాడునప్పుడు కఱ్ఱలు రాళ్ళు మొదలయిన సాధనములనుగూడ నుపయోగించునని చెప్పెదరు. ఇవియెప్పుడును మనుష్యులమీఁదికి కయ్యమునకు కాలుద్రవ్వవు. ఇవి యాత్మసంరక్షణార్థముగా తమలోనొకదానిని కావలిపెట్టి శత్రుభయమును తెలుపు టకయి వేగునడుపుచుండును. ఈకావలియున్నకోఁతికి శత్రువాసన్నమగుచున్నట్టు పొడకట్టఁగానే యది బిగ్గఱగా నఱచును. ఆసంజ్ఞను తెలిసికొని యాపత్తును తప్పిం చుకొనుటకై తక్కినవన్నియు చేరి ప్రతిధ్వనులు చేయుచు యుద్ధసన్నద్ధములగును. ఈ జాతికోఁతి పిల్లల ననేకపర్యాయములు పట్టుకొని యింగ్లండు మొదలైన దేశములకుఁ గొనిపోయి పెంచియున్నారు. అవి చిన్నతనములో మనుష్యులతో మచ్చికపడి మనుష్యులుచేయు పనులనేకములు చేయును. కాని తక్కినకోఁతులవలెనే యివియు మనుష్యుని మంచిగుణములకంటెఁ జెడుగుణములనే సులభముగా నేర్చుకొనును.

[సశేషము.]

కం. వీరేశలింగము.

మహీపతిరాంరూప్రాం నీలకంఠ్. సి. ఐ. ఇ.

రావుసాహేబు మహీపతి రాంరూప్రాంగారు బొంబయిరాజధానిలోఁ జేరిన సూరతుపట్టణమునందు శాలివాహనశకము ౧౭౫౧వ సంవత్సరము డిసెంబరునెల మూఁడవ తేదిని జననమొందెను. ఈయన ఘూర్జర (Guzerat) దేశమందలి వంగర నాగరులను నగ్రబ్రాహ్మణకులస్థుఁడు. పూర్వము మహమ్మదీయ ప్రభుత్వములో మిగుల ఘనతకెక్కిన యీనాగరజాతివారు బ్రిటిషుదొరతనమువారివలనఁగూడ గొప్ప మెప్పు వడసిరి. మహీపతిరాంగారి పితామహుని ప్రపితామహుఁడగు నీలకంఠమేతాగారు సూరతునవాబుగారికి మంత్రిగానుండిరి. ఆయన సంతతిలోఁ గొందరు వాణిజ్యముచే మిగుల ధనికులయిరిగాని యీయన తండ్రి రూప్రాంగారుమాత్రము బీదస్థితికి వచ్చి సూరతునగరమందలి కష్టమ్సుడిపార్టుమెంటులో నెలకు నారురూప్యములు జీతముగల యుద్యోగములోఁ జేరిరి. మహీపతిరాంగారు వత్సరముల వయసువచ్చుదాఁక స్వదేశపాఠశాలకుఁ బంపఁబడిరి. దొరతనమువారి పాఠశాల లప్పుడు నూతనముగా నేర్పరుపఁబడినందునఁ బదునొకండువత్సరముల ప్రాయమునందా పాఠశాలలలో నొకదానియందుఁ బ్రవేశించిరి. తరువాత సూరతులోఁ గ్రొత్తగా స్థాపింపఁబడిన యాంగ్లేయపాఠశాలకుఁ బోయిరి. ఆయన కొంతకాలమునకుఁబిమ్మట, నాచదువుకూటమునందు మాసమునకుఁ బదునాలుగు రూప్యముల వేతనముగల సహాయోపాధ్యాయపదము నంగీకరించెను. అప్పుడు బొంబయినగరమందలి గ్రాంటుగారిచే స్థాపింపఁబడిన వైద్యవిద్యాశాలలోఁ (Grant medical college) జదువుకొనుట కాయనకు మిక్కిలి యాసక్తి గలిగియున్నను, శవములనుకోయుట హిందూ మతవిరుద్ధమయిన పనిగా నాకాలమందెంచఁబడినందున, విద్యాశాలకుఁ బోవుట కాయనకు వీలులేకపోయెను. ఆయన విద్యాభ్యాసముఁ జేసినకొలఁదిని, మూఢవిశ్వాసములు క్రమక్రమముగా విడువనారంభించెను. విగ్రహారాధనయందాయనకు నమ్మకముపోయి కులాచార సంస్కరణమునకుఁ బ్రయత్నింపసాగెను. సూరతునగరమందలి మితానుభోగ సమాజము (Temperance Association)న కీయన కొన్నిదినములు కార్యదర్శిగానుండి పిమ్మట సమాజమువారి పత్రికఁ గొంతకాలము ప్రచురించెను. విశేషమైన విద్యను సంపాదించుటకై ౧౭౭౯వ సంవత్సరమునందు బొంబయిపట్టణముఁ జేరెను. అప్పు డెల్ఫిన్‌స్టన్ విద్యాశాలలోఁ బ్రధానోపాధ్యాయులగు మిస్టర్ హార్క్‌నెస్స

దొరవారు తన పాఠశాలలోఁ బదునేనురూపాయల జీతముగల సహాయోపాధ్యాయ పదము నాయన కొసగిరి. తరువాత గొంతకాలమునకుఁ బ్రవేశపరీక్షయందుఁ గృతార్థుఁడయి క్రమక్రమముగా సర్వకళాపరీక్షలయందు మిగుల శ్లాఘనీయముగా మెప్పువడసె విద్యార్థి వేతనములఁ గైకొనెను. ఆయన విద్యాభ్యాసముఁ జేయునప్పుడే ధనముఁగూడ నార్జింపవలసివచ్చెను.

పిమ్మట మహీపతిరాంగారు స్వదేశస్థుల స్థితిని బాగుపరచుటకుఁ గృషిఁ జేయనారంభించెను. "బుద్ధివర్ధకసభ" యను సంఘములోఁ జేరి బొంబయి నగరమందుఁ బ్రథమ బాలికాపాఠశాలను స్థాపించుటయందు విశేషము పనిఁజేసెను. అప్పటికిఁ బాఠశాలకు ద్రవ్యసహాయము లేనిహేతువుచే నాసభయొక్క మెంబర్లు వంతుల చొప్పునఁ బాఠములఁ జెప్పుచుండిరి. లార్డు కానింగుప్రభువుగారిని గౌరవించు కొఱకు బొంబయి నగరమందు విద్యఁగఱచు బాలికలందఱుఁ బట్టణ మందిరము (Town Hall)లోఁ జేరినప్పు డాసమాజమున కీయనయే కార్యదర్శిగా నుండెను. ౧౮౫౫వ సంవత్సరమునం దాయనవిశేషమర్యాదలతో ధర్మశాస్త్ర(Jurisprudence) పరీక్షలోఁ గృతార్థుఁడయి నలువదిరూప్యముల బహుమతి నందుకొనెను. తరువాత ఎలిఫిన్‌స్టన్ హైస్కూలులో నెలకు నలువదిరూపాయల జీతముగల సహాయోపాధ్యాయ పదము నంగీకరించెనుగాని యాకాలమందు రాజకీయ విద్యాభ్యాసాధ్యక్షుఁడగు ఇ. జె. హవర్డుదొరవా రాయనకు నహమదాబాదు హైస్కూలులోఁ బ్రధానోపాధ్యాయ పదము నొసగిరి. అప్పుడు సిపాయిల కలహప్రసమయమయి నందున బొంబయినగరమునుండి మూడువందలమైళ్ళ దూరములోనున్న యహమదాబాదు పట్టణమునకు విశేషప్రయాసతోఁ గాలినడకను పోవలసివచ్చెను. కలహించిన సైనికులపక్షమున నొక్కమాటయినఁ బలుకఁగూడదని తనపాఠశాలలో నుత్తరువుఁ జేసెను. బొంబయికి తిరిగి వచ్చినతరువాత సమాజపుఁ బత్రికను మఱియొక కులాచార పత్రికను బ్రచురింపఁ దలకొనెను. పిమ్మట డెబ్బదియైదురూప్యముల వేతనముఁగల పాఠశాలల విమర్శకుఁడుగా నియమింపఁబడెను. ఇప్పుడు సర్ అను బిరుదునొందిన టి. సి. హెూపుదొరగా రస్పెక్టరుగా నుండెను. గుజరాతు నందలి పాఠశాలలన్నిటియందు విద్యాభ్యాసముఁ జేయువిధము నేరిగిన (Trained) యుపాధ్యాయులను నియమించుట యగత్యమని యాలోచించి అందుకొఱకు నింగ్లాండులో నున్నరీతిగా నార్మల్‌స్కూళ్ళ నేర్పఱుచుటకు యోచించెను.

అప్పుడు మహీపతిరాంగారిని ఇంగ్లాండుదేశమునకుఁబోయి యక్కడ విద్యఁ

గరపువిధము స్వయముగాఁ జూచిరావలయునని హూపుదొరవా రాజ్ఞాపించిరి. సముద్రముదాటుట పాపకార్యమని యప్పటిహిందువుల యభిప్రాయమయియున్నది. అట్లు చేసినందువలన దోషియైనవాఁ డొక్కఁడేగాక వానికుటుంబ మంతయు వెలివేయఁబడవలసినదని గూడ వారియభిప్రాయము. అయినను తనభార్యతో నాలోచించినపిదప నింగ్లాండునకుఁ బోవ నాయన యియ్యకొనెను. కొందఱు స్నేహితులతోఁగూడ నీసంగతిఁ జెప్పఁగా వారు చేతనైన సాహాయ్యముఁ జేయుటకు వాగ్దానముఁ జేసిరి. కాని యీసంగతి యెల్లవారికిఁ దెలిసినందున గుజరాతులోని నాగరకులమువారందఱు కోపభరితులయి పగఁదీర్చుకొనుటకు శపథముఁ జేసిరి. కొద్దిమంది సాంస్కారికులు మాత్రముతప్ప తక్కినజనులందఱు నిట్టి సాహసకార్యము పాపహేతువనియును ఆత్మహత్యవంటిదనియును దూషింప మొదలుపెట్టిరి. మహీపతిరాంగారి బంధువులు తమ జీవితకాలమంతయు వెలిగా నుండవలసి వచ్చునను భీతిచేత నాయన నీప్రయత్నమునుండి తొలఁగించుటకు యత్నించిరిగాని యాయన మాత్రము దృఢనిశ్చయుఁడై యుండెను. ఆన ౧౮౬౦వ సంవత్సరము మార్చి నెల ది ౨౭వ తేదిని ఆయన సీమకుఁ బ్రయాణమయి పోయెను. నాలుగు మాసములు లండనుపట్టణమందును, చెల్టెనాహాములో నాలుగుమాసములును గడపి యింగ్లాండు దేశ మంతయుఁగూడ గ్రుమ్మరెను. మరుచటివత్సరమునం దేప్రిల్ నెలలోఁ దిరిగి హిందూదేశమునకు వచ్చెను. వెంటనే మతస్థులందఱు నాయనను వెలిఁజేసిరి. అనేకులాయనకు వ్యతిరేకముగానుండి పలువిధములయిన కష్టములఁ బెట్టిరి. ఆయనకొఱ కాయనభార్య మాత్రము కులమును విడిచిపెట్టెను. నావికాయాత్ర విషయమయి పండ్రెండువత్సరములు ఘోరమయినవాదములు జరిగెను. ఆకాలములో మహీపతిరాంగారికి మిక్కిలి సహాయులై తోడ్పడిన వారలలో ముఖ్యులయిన లేటు సర్దారు రావుబహద్దరు బోలనాథ్ సారాభాయిగారు సముద్రయాత్రలఁ జేయవచ్చునని హిందూశాస్త్రములను ఖండించి చేసినవాదములకు నేటివఱకును అట్టివి శాస్త్రవిరుద్ధములని వాదించువారలలో నేరును తగినయుత్తరము లొసగలేరైరి. కాని సహేతుకములయిన వాదములనేకముగాఁ జేయఁబడినను మతాచార్యులయొక్క దురభిమానమును పోగొట్టలేకపోయెను. ఆరుసంవత్సరము లయినపిమ్మట ప్రాయశ్చిత్తమును చేసికొనినయెడల మహీపతిరాంగారిని తిరిగి కులములోనికిఁ జేర్చుకొనుటకు మతాచార్యు లియ్యకొనిరి. మహీపతిరాంగారుకూడ అప్పటిస్థితుల ననుసరించి కులములో నుండుటవలననే యెక్కువ లాభములను చేయవచ్చునని యెంచి అందులకు సమ్మతించెను. కాని యింగ్లాండునకుఁ బోయినందువలన తానేమియు పాపకార్య

మును చేయలేదనిమాత్రము బహిరంగముగా చెప్పెను. అందువలనఁ గులస్థులకుఁ గోపమువచ్చి తిరిగి యాఱు సంవత్సరములవఱకుఁ గులమునందుఁ జేర్చుకొనరైరి. కాని యందువలనఁ మంచిలాభములు మాత్రము గలిగినవి. జాతిభేదమందలి పట్టుదలలు క్రమక్రమముగఁ వదలి మతవైషమ్యములు, మూఢవిశ్వాసములు మొదలగునవికూడ తొలఁగిపోవ నారంభించెను.

ఇంగ్లాండునుండి తిరిగివచ్చినతరువాత అహమదాబాదు పట్టణమందలి గుజరాత్ ట్రెయినింగు కాలేజిలోఁ బ్రధానోపాధ్యాయత్వము వహించి, చనిపోవునంతవఱకును మహీపతిరాంగారా పనిలోనే యుండిరి. ఆయన గుజరాతీ ట్రాన్స్లేటరుగాను గుజరాతీసంఘమునకు కార్యదర్శిగానునుండి, గుజరాత్ స్కూలుపత్రికను బ్రచురించెను. గుజరాతుదేశమందలి పాఠశాలలలో నభ్యాసముఁ జేయించు నుపాధ్యాయులందఱును మహీపతిరాంగారియొద్ద విద్యనేర్చినవారే. గుజరాత్ దేశమందలి విద్యాభ్యాసము మహీపతిరాంగారి శక్తిసామర్థ్యములవలననే వృద్ధిపఱుపఁబడినది. గుజరాతీభాషాభివృద్ధికొఱకు పాఠశాలలకుపయుక్తమగు చిన్నపొత్తముల నచ్చువేయుటకు సర్. టి. హోప్దొరవారు స్థాపించినసంఘములో నీయనకూడ సామాజికుఁడుగా నుండెను. ఆపుస్తకములు నేటివఱకును హోప్సీరీస్ (Hope Series) అని వాడఁబడును. గుజరాతీ ట్రాన్స్లేటరుగానుండి మహీపతిరాంగారు పలువిధములైన చరిత్రలు, భూగోళములు, వ్యాకరణములు మొదలగుగ్రంథముల రచించి దేశభాష నభివృద్ధి నొందించెను. విద్యాసంబంధమయిన ప్రతివిషయములోను దొరతనమువారు మహీపతిరాంగారి యభిప్రాయమునుబట్టియే నడచుచుండిరి. మార్క్విస్ ఆఫ్ రిపన్ ప్రభువుగా రేర్పరచిన విద్యావిషయమైన సభవారిచే విచారింపఁబడినవారిలో నీయనయొకఁడు. ఈయన రావుసాహేబు అను బిరుదునొంది [illegible] సంవత్సరము జనవరినెలలో సి. ఐ. యి. అను మఱియొకబిరుదము నొందెను.

మహీపతిరాంగా రభివృద్ధిఁ జేసిన దొక విద్యావిషయమునకే కాదు. ఆయన తనస్నేహితులగు రావుబహదూర్ భోలానాథ్ సారాభాయిగారితోఁగూడ గుజరాతునందుఁ బ్రార్థనసమాజము నేర్పరచి కులాచార సంస్కరణమునందుఁ బ్రధానత్వమును వహించెను. ఆసమాజమునకుఁ బ్రథమములోఁ గార్యదర్శిగాను పిమ్మట అధ్యక్షుఁడుగానునుండి నిత్యుఁడైన పరబ్రహ్మమునుగూర్చి యుపన్యసించి విగ్రహారాధన మొదలగు దురాచార పిశాచములపై దండెత్తెను.

[సశేషము.]